

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఉన్న విత్తనాల దుకాణం ఎదుట శుక్రవారం బారులు తీరిన రైతులు

కనికరించండి.. రుణమాఫీ చేయండి

కలెక్టర్‌కు రెంజల్ రైతుల విన్నపం

రెంజల్. ఆగస్టు 9: అర్హులమైన తమకు రుణమాఫీ కాలేదని, కనికరించి రుణాలు మాఫీ చేయాలని నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల రైతులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం పలువురు రైతులు కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం రూ.లక్షన్నర లోపు పంట రుణాలను మాఫీ చేయగా.. కెనరా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతో మాఫీ వర్తించలేదని వాపోయారు. స్పందించిన కలెక్టర్ మాఫీ కాని రైతుల జాబితాను రెండ్రోజుల్లో సమర్పించాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు.

రుణం మాఫీ కాలే.. పింఛన్ రాలే

- **సెల్‌టవర్ ఎక్కి యువకుడి నిరసన**

వైరా రూరల్, ఆగస్టు 9: ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తున్న కాంగ్రెస్ సర్కారు.. తమ భూమిపై ఉన్న రూ.88 వేల రుణాన్ని మాఫీ చేయలేదని, 68 ఏండ్ల తన తండ్రికి ఆసరా పింఛన్ కూడా ఇవ్వడం లేదని ఓ యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుక్రవారం తమ గ్రామానికి వస్తున్నట్టు తెలుసుకున్న ఆ యువకుడు గ్రామంలోని సెల్ టవర్ ఎక్కి నిరసనకు దిగాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా వైరా మండలంలో జరిగింది. వైరా మండలం కేజీ సిరిపురం గ్రామానికి చెందిన నారపోగు నాగకృష్ణ.. తండ్రి నారపోగు భిక్షం పింఛన్ కోసం అనేకసార్లు దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. అలాగే వారి 1.20 ఎకరాల వ్యవసాయ భూమిపై ఉన్న రూ.88 వేల పంట రుణం మాఫీ కాలేదు. తమ బాధను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనుకున్నాడు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు ఉప ముఖ్యమంత్రే తమ గ్రామానికి వస్తున్నట్టు తెలుసుకుని సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. స్వయంగా డిప్యూటీ సీఎం వచ్చి తమ సమస్యను పరిష్కరిస్తేనే తాను ఈ టవర్ దిగుతానని స్పష్టంచేశాడు. దీంతో స్థానిక మాజీ ఎంపీటీసీ, స్థానిక కాంగ్రెస్ నాయకులు వెంటనే సెల్ టవర్ వద్దకు చేరుకుని 'నీ సమస్యను డిప్యూటీ సీఎంకు తెలియజేస్తాం. 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం' అని హామీ ఇవ్వడంతో ఆ యువకుడు సెల్ టవర్ దిగాడు.



సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న యువకుడు నాగకృష్ణ

బీసీ యువతకు ఉపాధి శిక్షణ

హైదరాబాద్, ఆగస్టు9 (నమస్తే తెలంగాణ): బీసీ నిరుద్యోగ యువతకు ఎల్జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 100మంది అభ్యర్థులను ఎంపిక చేసి 3నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. రూ.4వేల ఉపకార వేతనం అందిస్తామని తెలిపారు. 24 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 040-24071178 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

1200 మంది రైతులకు రుణమాఫీ కాలేదు

- **అధికారులు, లీడ్ బ్యాంకర్లపై ఎమ్మెల్యే కడియం ఫైర్**
- **రుణమాఫీ సాంకేతిక సమస్యపై కలెక్టరేట్‌లో సమీక్ష**

జనగామ, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): 'ఒకే మండలంలో 1200 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వారంతా ఆందోళనలో ఉన్నారు. మేం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పథకంపై పర్యవేక్షణ సరిగా లేదు. మీ వల్ల ప్రభు త్వం బద్నాం కావాలా?' అంటూ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లీడ్‌బ్యాంక్, వ్యవసాయశాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.శుక్రవారం జనగామ కలెక్టరేట్‌లో లింగాలఘనపురం మండలం నెల్లుట్ల, నవాబ్‌పేట గ్రామాల రైతుల రుణమాఫీలో తలెత్తిన సాంకేతిక సమస్యపై కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, లీడ్‌బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో కలిసి సమీక్షించారు. తన నియోజకవర్గ పరిధిలోని నవాబ్‌పేటకు చెందిన 800 మంది, నెల్లుట్లకు చెందిన సుమారు 400 మంది రైతులకు కెనరా బ్యాంక్ ద్వారా రుణ మాఫీ కాలేదని, దీనికి ఎవరు బాధ్యులు అని కడియం మండిపడ్డారు.'మీపర్యవేక్షణ లోపం వల్ల మేం బద్నాం కావాలా?' అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, వెంటనే రైతులకు రుణమాఫీ చేయాలని కలెక్టర్‌ను కోరారు.





పిట్టల సారయ్య దంపతులు

రుణమాఫీ పైసలు బాకీ కింద తీసుకున్నరు

- **వారం తిప్పకుని ఇవ్వలేమంటున్న బ్యాంకు అధికారులు**
- **వడ్డీ కట్టేందుకు మళ్లీ అప్పు చేశామన్న రైతు దంపతులు**

టేకుమట్ల, ఆగస్టు 9: రుణమాఫీ డబ్బులు తప్పకుండా రైతులకే ఇవ్వాలని, పాత బకాయిల కింద ఆపొద్దని ప్రభుత్వం చెప్తున్నా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ అధికారులు ససేమిరా అంటున్నారు. మహిళా సంఘంలో ఉన్న అప్పు కింద రుణమాఫీ డబ్బులు పట్టుకుని రైతు దంపతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. మండలంలోని గర్మిళ్లపల్లి శివారు కలికోటపల్లికి చెందిన పిట్టల సారయ్య దంపతులు తెలిపిన వివరాల ప్రకారం.. 'మాకు ప్రభుత్వం రూ.48 వేల రుణం మాఫీ చేసినట్టు లిస్టులో పేరు వచ్చింది. బ్యాంక్‌కు వెళ్లి అడిగితే.. 'వడ్డీ రూ.6 వేలు అయింది. కట్టాలంటే అప్పు తెచ్చి కట్టినం. మాఫీ పైసలు మా అకౌంట్‌లో వేస్తామని చెప్పారు. వారం రోజులు తిప్పించుకున్నరు. తీరా ఇప్పుడు బ్యాంకులో డబ్బులు లేవు బయట తీసుకోండని చెప్పారు. బయట తీసుకునేందుకు వెళ్తే అకౌంట్ బ్లాక్ అయిందంటున్నారు. మళ్లీ ఏపీజీవీబీకి వెళ్లి డబ్బులు అడిగితే.. మీ భార్య మహిళా సంఘంలో అప్పు తీసుకుంది. అవి కడితేనే ఇస్తాం. లేకుంటే ఇవ్వం' అంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇప్పుడు రూ.20 వేలు ఆపుకోండి, మిగితావి నెలనెలా కడుతాం' అని ఎంత వేడుకున్నా డబ్బులు ఇస్తలేరని, వడ్డీకి తెచ్చిన అప్పు తీర్చకుంటే పరువు పోతుందని రైతు దంపతులు విలపిస్తున్నారు.

- **శ్మశానవాటిక స్థలం కబ్జా చేశారని దళితుల ధర్నా**



మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని తమ శ్మశానవాటిక స్థలాన్ని మాజీ సర్పంచ్, ఆయన మనుమడు ఆక్రమించి పట్టా చేసుకున్నారంటూ దళితులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదేమని అడిగితే 11 మంది దళితులకు కోర్టు నోటీసులు పంపించారని దళిత నాయకుడు గుజ్జునూరి బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. **- ఇనుగుర్తి**

- **పాడి రైతుల ధర్నా**



పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం విజయ డెయిరీ రైతులు ధర్నా చేశారు. డెయిరీ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూర్, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన రైతులు పాల డబ్బాలతో రాస్తారోకో చేయడంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించి ధర్నాను విరమింప జేశారు. **- స్టేషన్ ఘన్‌పూర్**

- **సిమెంట్ ఫ్యాక్టరీ భూనిర్వాసితుల నిరసన**



ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి గ్రామ శివారులో నిర్మించనున్న రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ కోసం భూములివ్వాలంటే ఎకరానికి రూ.50 లక్షలు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. **– ఎదులాపురం**



ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో వినతి పత్రాలతో భారీగా తరలివచ్చిన ప్రజలు

ప్రవాసంలో సర్కార్.. ప్రయాసలో పాలన

- **అమెరికాలో సీఎం రేవంత్,సీఎస్, మంత్రులు**
- **రాష్ట్రంలో వర్షాలు, జ్వరాలు, సమస్యలు**
- **రోడ్డెక్కుతున్న నిరుద్యోగులు, రైతులు**
- **పడకేసిన పాలన.. ఎక్కడికక్కడే ఫైళ్లు**
- **తిరిగొచ్చాకే పాలనాపరమైన నిర్ణయాలు**

హత్యలు, లైంగికదాడులు.. పంజా విసురుతున్న విషజ్వరాలు! వానలు పడి కొన్నిచోట్లా ప్రమాదకరస్థాయికి వరదలు, మరికొన్నిచోట్లా కరువుఛాయలు. సుంకిశాల లాంటి నిర్వహణా వైఫల్యాలు. గురుకులాల్లో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు! రోడ్డెక్కుతున్న నిరుద్యోగులు! దిక్కుతోచని స్థితిలో రైతాంగం! రగులుతున్న ఉద్యోగులు! ఇదీ రాష్ట్రంలో పరిస్థితి.

ప్రభుత్వం మాత్రం ప్రవాసంలో ఉన్నది. సీఎం సహా సీఎస్, మంత్రులు అమెరికా పర్యటనలో ఉన్నారు. కీలక శాఖల ఉన్నతాధికారులూ అక్కడే ఉన్నారు. రాష్ట్రంలో పాలన పడకేసింది. పాలనాపరమైన నిర్ణయాలు తీసుకునేవారు లేక ఫైళ్లు మూల్గుతున్నాయి. రెండు వారాలపాటు ఇదే పరిస్థితి.

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాలన పడకేసిందా? అంటే అవుననే అంటున్నాయి అధికార వర్గాలు. కీలక అధికారులు, మంత్రులందరూ విదేశీ పర్యటనలో ఉండడంతో రాష్ట్రంలో పాలన అటకెక్కింది. నిన్నమొన్నటి వరకు ఢిల్లీకి వెళ్లిరావడంతోనే ముఖ్యమంత్రి, మంత్రులకు సరిపోయేది. వారానికి ఒక్కసారి ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఢిల్లీ పర్యటనలకు వెళ్లేవారు. ఇప్పుడు సీఎం సహా కీలక మంత్రులు, అధికారులు అమెరికా బాటపట్టారు. రాష్ట్రంలో ఒక వైపు వర్షాలు, వరదలు.. మరోవైపు హత్యలు, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల్లో సీట్ల లొల్లి జరుగుతున్నది. ఇదంతా ఒకెత్తయితే అనేక శాఖల్లో అధికారులు, సిబ్బంది బదిలీల ప్రహసనం సాగుతున్నది. ఇలాంటి కీలక సమయంలో సీఎం సహా అందరూ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఒకేసారి ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రం దాటి వెళ్లడం ఉండదు. ఇప్పుడు వీరెవరూ రాష్ట్రంలో లేకపోవడంతో ముఖ్యమైన నిర్ణయాలు ఎవరు తీసుకుంటారన్న ప్రశ్న ఎదురవుతున్నది. ముఖ్యమంత్రి అయిన 8 నెలల్లోనే రెండుసార్లు విదేశీ పర్యటన చేసిన రికార్డు రేవంత్‌కే దక్కుతుందని చెప్తున్నారు.

వెళ్లింది వీరే..

శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే గత శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికాకు బయల్దేరి వెళ్లారు. ఆ తర్వాత మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అమెరికా బాటపట్టారు. త్వరలోనే మరో మంత్రి దామోదర రాజనర్సింహ కూడా అమెరికా వెళ్తున్నారని సమాచారం. ముఖ్యమంత్రి తాను వెళ్లడమే కాకుండా తనతోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్‌ను వెంటపెట్టుకెళ్లారు. పరిశ్రమలశాఖ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎంవో అధికారులు శేషాద్రి, అజిత్‌రెడ్డి తదితరులుకూడా వెళ్లారు.



న్యూయార్క్‌లో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు. చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి (ఫైల్)

అమెరికా పర్యటనలో సీఎస్ కూడా!

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా సీఎంతో అమెరికా పర్యటనకు వెళ్లారు. గతంలో ఎన్నడూ ఈ తరహాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీఎంతో విదేశీ పర్యటనలకు వెళ్లిన సందర్భాలు లేవు. సీఎం రాష్ట్రంలో లేని సమయంలో అత్యవసర అంశాలను హ్యాండిల్ చేయడం, యంత్రాంగానికి సంబంధించి నిర్ణయాలను తీసుకోవడం సీఎస్ విధి. కేంద్రంలో ప్రధాని లేని సమయంలో క్యాబినెట్ సెక్రటరీ ఆ విధులను పర్యవేక్షిస్తారు. సీఎస్ వెళ్తే ఆ స్థానంలో మరో అధికారికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో రోజువారీ కార్యకలాపాలను అమెరికా నుంచే సీఎస్ పర్యవేక్షిస్తున్నారు. రోజువారీగా చూడాల్సిన ఫైళ్లు, ఇవ్వాల్సిన సూచనలు, సమావేశాలు సీఎస్ తిరిగి వచ్చేవరకు నిలిపివేసినట్టే. చీఫ్ సెక్రటరీ తర్వాత ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పోస్టు కీలకమైంది. ఇద్దరూ అందుబాటులో లేకపోవడంతో అటు సీఎస్ వద్ద, ఇటు ఆర్థికశాఖలో అనేక ఫైళ్లు నిలిచిపోయినట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయం వద్ద ప్రతీ రోజు వందలాది మంది ఉద్యోగులు, చిన్న చిన్న కాంట్రాక్టర్లు తమ బిల్లులను విడుదల చేయించుకోవడానికి వేచి ఉంటున్న పరిస్థితి కనిపిస్తున్నది. మరో వారం రోజులపాటు అధికారుల విదేశీ పర్యటనలున్నాయి. వాళ్లు వచ్చేవరకు ఇదే విధమైన పరిస్థితి ఉంటుందని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి.

మా భూములు ఇవ్వాలని రేవంత్ బెదిరింపు

మొదటిపేజీ తరువాయి...

బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరని అండగా నిలవాలని కేటీఆర్‌ను కోరారు. రూ.కోట్ల విలువ చేసే భూములను అప్పనంగా ప్రభుత్వం లాక్కునేందుకు కుట్ర చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. తమ కుటుంబాలకు ఈ భూమి జీవనాధారం అని, వీటిని గుంజుకుంటే జీవితాలు సర్వనాశనం అవుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి,మహిపాల్ ముదిరాజ్ తదితరులు కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

సీఎం అల్లుడి కంపెనీ కోసమేనా?: బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్

కొడంగల్‌లో ఫార్మా కంపెనీలకు 3వేల ఎకరాల భూ సమీకరణపై బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్ అనుమానం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే భూములను గుంజుకుంటున్నారని ఆరోపించారు. 'ఏ ఫార్మా కంపెనీ కోసం కొడంగల్‌లో రైతులపై దాడులు చేస్తున్నారు? ఎనుముల ఇంటి అల్లుడికి చెందిన మాక్స్‌బిన్ ఫార్మా కోసమేనా?' అని శుక్రవారం ఎక్స్ వేదికగా క్రిశాంక్ ప్రశ్నించారు. కంపెనీకి చెందిన వివరాలను జత చేశారు.

పరిష్కారంలేని 'ప్రజాపాలన?

- **డిసెంబర్‌లో దరఖాస్తుల స్వీకరణ**
- **భారీగా అప్లికేషన్లు గాయబ్**
- **అధికారుల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు**

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా బోనకల్ మండలం కలకోటకు చెందిన తోటపల్లి రవికుమార్ జనవరి 3న 'ప్రజాపాలన'లో దరఖాస్తు చేసుకున్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల పథకాలు వర్తింపజేయాలని కోరారు. అధికారులు రసీదు ఇచ్చారు. అయినా ఏ పథకం ఆయనకు వర్తించలేదు. అధికారులను అడిగితే తమకు వివరాలు అందలేదని చెప్పారు. మండల కార్యాలయానికి వెళితే ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని చెప్పేశారు.అధికారుల చుట్టూ తిరిగి వేసారిన ఆయన హైదరాబాద్ ప్రజాభవన్ ప్రజావాణిలోనూ ఫిర్యాదులు చేశారు. అయినా ఫలితం కనిపించడం లేదు.

భారీగా దరఖాస్తులు మిస్సింగ్

ప్రజాపాలన దరఖాస్తులను ప్రభుత్వం గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు తీసుకున్నది. 1.25 కోట్ల దరఖాస్తులు వచ్చినట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మరుసటిరోజు నుంచే మండల కేంద్రాలు, మున్సిపాలిటీల వారీగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రారంభించారు. 1.25 కోట్ల దరఖాస్తుల డాటా ఎంట్రీకి ప్రభుత్వం 10 రోజుల సమయమే ఇచ్చింది. కొన్నిచోట్ల దరఖాస్తులను ఇండ్లకు పంపించి డాటా ఎంట్రీ చేయించారు. హైదరాబాద్ హయత్‌నగర్‌లో బైక్‌పై తీసుకెళ్తుండగా పత్రాలన్నీ రోడ్డుపై పడిపోయాయి. 12వ తేదీకే డాటా ఎంట్రీ పూర్తయినట్టు అధికారులు ప్రకటించారు. ప్రత్యేకంగా వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఫిబ్రవరి ఒకటిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించగా అధికారులు 1,09,01,255 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. 2.82 లక్షల దరఖాస్తులకు ఆధార్, రేషన్ నంబర్ జతచేయలేదని, వివరాలు తప్పుగా రాశారని చెప్పారు. వీటిని కూడా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, అర్హులైతే పథకాలు వర్తింపజేయాలని సీఎం ఆదేశించారు. దరఖాస్తుల సంఖ్య 1.25 కోట్ల నుంచి 1.09 కోట్లకు పడిపోవడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. నకిలీ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకున్నా.. సుమారు 13 లక్షల అప్లికేషన్లు తగ్గాయి.

వివరాలన్నీ గుట్టుగా..


ప్రజాపాలన దరఖాస్తులపై ప్రభుత్వం మొదటి నుంచీ వివరాలు వెల్లడించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రజాపాలన ఆధారంగా గృహలక్ష్మి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నది. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎంత మందికి అమలు చేస్తున్నారు? వంటి వివరాలేవీ బహిర్గతం చేయడం లేదని చెప్తున్నారు. దరఖాస్తులకు, అమలుకు మధ్య భారీగా వ్యత్యాసం ఉండటం వల్లే దాచిపెడుతున్నారని విమర్శిస్తున్నారు.

దరఖాస్తు నమోదు కాలేదు

ప్రభుత్వం ఉచిత విద్యుత్తు, రూ.500కే ఉచిత సిలిండర్ పథకాన్ని ప్రారంభించినా వర్తించకపోవడంతో బాధితులు విద్యుత్తు గ్యాస్ కార్యాలయాలకు పరుగులు తీశారు. అధికారులు వెబ్ పోర్టల్‌లో తనిఖీ చేసి 'మీ పేరు లేదు' అంటూ సమాధానం ఇచ్చారు. మండల కార్యాలయాలకు వెళ్లినా అదే సమాధానం. అప్పటినుంచి బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మండల స్థాయి నుంచి ప్రజాభవన్ వరకు ప్రజావాణిలో దరఖాస్తులు ఇచ్చినా పరిష్కారం కావడంలేదని చెప్తున్నారు.

నాలుగు నెలలన్నారు.. ఊసే లేదు

ప్రజాపాలన దరఖాస్తులు 'ప్రతి నాలుగు నెలలకు ఒకసారి దరఖాస్తులు స్వీకరిస్తాం' అని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు పెడతామని ఆర్భాటంగా చెప్పింది. ఇప్పటికి ఏడు నెలలు గడిచిపోయినా రెండో దఫా దరఖాస్తుల స్వీకరణ ఊసెత్తడం లేదు. మొదటి దఫా దరఖాస్తులు చేసుకున్నా నమోదు కానివారు, అనివార్య కారణాల వల్ల దరఖాస్తు చేసుకోలేకపోయినవారు రెండో అవకాశం కోసం ఎదు రు చూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రెండో దఫా దరఖాస్తులు ప్రారంభించాలని కోరుతున్నారు.



గర్భిణి దర్మూబాయిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

ఆదివాసీ ప్రసవ వేదన

వాగుకు అటు అంబులెన్స్.. ఇటు గర్భిణి


కవలల్లో ఒకరి మృతి.. మరొకరి జననం

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వెంకటాపూర్ పరిధిలోని టిమ్రన్ మోవాడ్ బండగూడకు చెందిన దర్మూబాయికి శుక్రవారం పురిటి నొప్పులు వచ్చాయి. వాగుపై వంతెన లేక ఒడ్డుపైనే అంబులెన్స్ ఆగింది. 7 నెలల గర్భిణీ దర్మూబాయ్ కిలోమీటరున్నర నడుచి వాగు దాటింది. నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్ సిబ్బంది ప్రసవం చేశారు. ఆడ శిశువుకు జన్మనివ్వగా, గర్భంలో మరో శిశువు ఉందని అంబులెన్స్ సిబ్బంది ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా శిశువు మరణించింది. వైద్యులు మంచిర్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించగా దర్మూబాయి మరో పాపకు జన్మనిచ్చింది. ఆదివాసీ దినోత్సవం రోజే ఆదివాసీ గర్భిణి ప్రసవ వేదన కలిచివేసింది. **- ఆసిఫాబాద్ టౌన్**

రోగికి గడువు తీరిన సెలైన్

ఖానాపూర్ ప్రభుత్వ దవాఖాన సిబ్బందిపై రోగుల ఆగ్రహం

ఖానాపూర్ టౌన్, ఆగస్టు 9: ప్రభుత్వ దవాఖానకు వచ్చిన రోగికి శుక్రవారం వైద్య సిబ్బంది గడువు ముగిసిన సెలైన్ బాటిల్‌ను ఎక్కించారు. నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూర్‌కు చెందిన అజారుద్దీన్ జ్వరంతో ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో అడ్మిట్ అయ్యాడు. వైద్యులు సెలైన్ బాటిల్ పెట్టారు. అతనితో వచ్చిన తమ్ముడు సెలైన్ బాటిల్‌పై ఎక్స్‌పైరీ తేదీ మార్చి 2024 ఉండడం చూసి వెంటనే వైద్యుల దృష్టికి తీసుకెళ్లాడు. నర్సు వచ్చి ఆ సెలైన్ బాటిల్ తీసేసి మరో సెలైన్ ఎక్కించింది. దవాఖానలో గడువు తీరిన మందులు కనిపించడంతో రోగులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సింగ్ అధికారి వాటిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వంశీమాధవ్‌ను వివరణ కోరగా సెలైన్‌లో 2 ఎంఎల్ మాత్రమే రోగిగి ఎక్కిందని వెంటనే తొలగించినట్టు తెలిపారు. బాధ్యులపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.



ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానలో రోగికి పెట్టిన గడువు తీరిన సెలైన్ బాటిల్

బ్రెజిల్‌లో కూలిన విమానం ›8

62 మంది ప్రయాణికులు మృతి



మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA



అమన్‌కు కాంస్యం

రెజ్లింగ్‌లో పతక కాంతులు

57కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో కంచు పట్టు ›11

క్రజ్ డెరియన్‌పై అద్భుత విజయం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఐదో కాంస్యం

శనివారం SATURDAY 10.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 66 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



కాళేశ్వర జలాలు ఇవి కావా?

రైతుల ఆందోళన, బీఆర్ఎస్ నేతల హెచ్చరికతో దిగివచ్చిన రాష్ట్రప్రభుత్వం ఎట్టకేలకు కాళేశ్వరం నీటి ఎత్తిపోత చేపట్టింది. దీంతో సిద్దిపేట జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులు కాళేశ్వరం జలాలతో నిండుతున్నాయి. ప్రధాన జలాశయాల్లోకి ఆరు రోజులుగా నీటి లిఫ్టింగ్ కొనసాగుతున్నది. కాళేశ్వర జలాలు కొండపోచమ్మ సాగర్‌లో పరవళ్లు తొక్కుతున్నాయి.

నిన్నటివరకు కాళేశ్వరం దండగ అన్న కాంగ్రెస్ ప్రభుత్వమే.. ఆ ప్రాజెక్టుల ద్వారానే ఇప్పుడు మెతుకు సీమకు నీటిని అందిస్తున్నది. నాడు అడ్డంకులు సృష్టించినోళ్లే ప్రాజెక్టుల వద్ద ఇప్పుడు హారతులిచ్చి నీళ్లు వదులుతున్నారు. ఎట్టకేలకు గోదావరి జలాలు తరలి రావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. వరినాట్లలో వారంతా తలమునకలయ్యారు.



దవాఖానలో అవస్థ.. ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్స!

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని 50 పడకల ప్రభుత్వ దవాఖానలో బెడ్ల కొరతతో రోగులు అవస్థలు పడుతున్నారు. కొద్దిరోజులుగా విజృంభిస్తున్న విషజ్వరాలతో దవాఖానలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది.కేవలం 50 బెడ్లు మాత్రమే ఉండటంతో బెడ్‌కు ఇద్దరు చొప్పున రోగులకు చికిత్స అందిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా బెడ్లు ఏర్పాటు చేయలేదని రోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా 50 పడకల ప్రభుత్వ దవాఖానను వంద పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. – ఖానాపూర్ టౌన్

గురుకులాల్లో చావుకేక

పెద్దాపూర్‌లో విద్యార్థి అనుమానాస్పద మృతి.. 15 రోజుల్లో ఇద్దరు



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం అనిరుధ్ మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి ప్రియాంక

- మరో ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- పాముకాటే కారణమని అనుమానాలు
- ఘటనపై ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం
- ములుగులో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
- నంచర్లలో 25 మంది విద్యార్థులకు అస్వస్థత

మెట్‌పల్లి/ మెట్‌పల్లి రూరల్/ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 9: ఒక్కగానొక్క కొడుకు.. చదువులో చురుకు.. అని గురుకులానికి పంపిస్తే విగతజీవిగా మారాడు. పక్షం రోజుల క్రితమే ఓ విద్యార్థి మరణించినా.. గురుకుల పాఠశాల సిబ్బంది అదే నిర్లక్ష్యం చూపడంతో మరో ప్రాణం పోయిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వేములవాడ మండలం మర్రిమడ్లకు చెందిన ఎడ్మల కృష్ణారెడ్డి – ప్రియాంక దంపతులకు ఒక్కగానొక్క కొడుకు అనిరుధ్ (12)ను రెండేండ్ల క్రితం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో చేర్పించారు. కృష్ణారెడ్డి బతుకుదెరువు కోసం సౌదీలో ఉంటుండగా ప్రియాంక కొడుకుతో › 5వ పేజీలో



వీధికుక్కల దాడిలో మరో బాలుడి మృతి

ప్రాణాలు బలిగొంటున్న కుక్కలు

- రాయపోల్‌లో నెల క్రితం దాడి.. ఇన్ఫెక్షన్‌తో మృతి
- కోకాపేటలో నిద్రిస్తున్న బాలుడి మర్మాంగంపై దాడి
- వరంగల్ ఎంజీఎం దవాఖానలో మరో దారుణం
- వదిలేసిన శిశువు మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు
- ఎల్లారెడ్డిపేటలో 8 మందిని కరిచిన పిచ్చికుక్క › 5



దాడుల్లో భారీగా నోట్ల కట్టలు, నగలతో పట్టుబడిన ఉద్యోగి నరేందర్

మున్సిపల్ అధికారి ఇంట్లో నోట్ల గుట్టలు

- రూ.2.93 కోట్ల నగదు.. 51 తులాల బంగారం!
- అధికారి అక్రమార్జన చూసి నివ్వెరపోయిన ఏసీబీ బృందం
- మిషన్లతో నోట్లు లెక్కించేందుకే 6 గంటలకుపైగా సమయం
- నిజామాబాద్ బల్దియా సూపరింటెండెంట్ నివాసాల్లో ఏకకాలంలో సోదాలు
- రూ.6 కోట్లకు పైగా ఆస్తులు సీజ్
- దశాబ్దకాలంగా ఒకేచోట తిష్టవేసిన దాసరి నరేందర్ › 4
- బిల్ కలెక్టర్‌గా మొదలై సూపరింటెండెంట్ స్థాయికి..

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

రష్యా భూభాగంలోకి ఉక్రెయిన్ సైన్యం



ఆర్టిలరీ, డ్రోన్లతో దాడులు.. రష్యా అప్రమత్తం

కుర్స్కలో ఎమర్జెన్సీ ప్రకటించిన పుతిన్ సర్కారు

సురక్షిత ప్రాంతాలకు 3 వేల మంది తరలింపు

› 8

నిపుణ

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

శనివారం SATURDAY 10.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 66 ‖ వెల (Price) రూ.6.50 | షష్ఠి

శనివారం, సూర్యోదయం: 5-58, సూర్యాస్తమయం: 6-45. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: షష్ఠి తెల్లవారుజామున 5-46 వరకు. నక్షత్రం: చిత్త తెల్లవారుజామున 5-49 వరకు. వర్జ్యం: పగలు 11-46 నుంచి పగలు 1-35 వరకు. రాహుకాలం: ఉదయం 9-10 నుంచి ఉదయం 10-45 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 5-58 నుంచి ఉదయం 7-40 వరకు. అమృతకాలం: రాత్రి 10-35 నుంచి రాత్రి 12-23 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



సిసోడియా విడుదల

› 7

మద్యం పాలసీ కేసులో సుప్రీం బెయిల్

17 నెలల తర్వాత జైలు నుంచి బయటకు

నియంతృత్వానికి చెంపపెట్టు: సిసోడియా

సత్యమే గెలిచిందంటూ ఆప్ సంబురాలు



విచారణ పూర్తయ్యేదాకా జైల్లోనే మగ్గాలా?

చార్జిషీట్ల పేరిట ఇంకెంత కాలయాపన చేస్తారు?

సత్వర విచారణ కోరడం నిందితుడి హక్కు

జైలు నుంచి ఉపశమనం పొందేహక్కూ ఉన్నది

బెయిల్ ఓ నియమం.. జైలు మినహాయింపు

అందరూ గుర్తించాల్సిన సమయం రానేవచ్చింది

మద్యం కేసులో ఈడీ, సీబీఐకి సుప్రీం తలంటు

› 7



సుంకిశాల వద్ద రెండో టన్నెల్ గేటును అధికారులు ఓపెన్ చేయడంతో సాగర్ జలాల ప్రవాహ ఉధృతికి రిటైనింగ్ వాల్ ఒక్కసారిగా కుప్పకూలిన ఘటన దుమారం రేపుతున్నది. ప్రభుత్వ వైఫల్యంపై విపక్షం విరుచుకుపడుతుంటే.. ఆత్మరక్షణలో పడిన అధికారపక్షం పూటకో వివరణ ఇచ్చుకోవాల్సి వస్తున్నది. ప్రమాదస్థలిలో కూలీలు మాత్రం ఇలా నీటిలోనే నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు.

'సుంకిశాల'.. సీఎం అసమర్థతే

జ్యుడీషియల్ విచారణ జరపాలి..నిర్మాణసంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి: కేటీఆర్



ప్రమాదంపై సీఎంకు సమాచారం లేదా?

ఉద్దేశపూర్వకంగానే రహస్యంగా ఉంచారా?

సమాచారం తెలిస్తే అసెంబ్లీలో చెప్పలేదేం?

ప్రభుత్వం తప్పు లేకుంటే దాపరికమెందుకు?

కాంగ్రెస్ ఆలోచన విధానంలోనే లోపం

ఇది మూర్ఖపు ప్రభుత్వం: కేటీఆర్ ఫైర్

సుంకిశాల ప్రాజెక్టులో ఇంజినీరింగ్ లోపం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన విధానంలోనే లోపం ఉన్నది. సుంకిశాల ప్రమాదానికి కారణమై రాష్ట్ర ప్రజల సొమ్మును ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. ఇది మూర్ఖ, కుత్సిత మనస్తత్వం ఉన్న ప్రభుత్వం. -కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): సుంకిశాల ప్రమాదానికి మున్సిపల్ శాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యమే కారణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తీవ్ర ఆరోపణ చేశారు. ఈ ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ చేయించాలని, నిర్మాణ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ప్రమాదంపై ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి సమాచారం లేదా? సమాచారం ఉండి ఉంటే అసెంబ్లీలో ఎందుకు ప్రకటన చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ది మూర్ఖపు ప్రభుత్వమని ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి అసమర్థత, చేతగానితనం, › 2వ పేజీలో

కూలిన ఘటన మా వరకు రాలేదు!

ఇది చాలా చిన్నది.. నష్టం చాలా తక్కువ

చిన్న ఘటన కాబట్టే ఇంజినీర్లు చెప్పలేదు

ప్రమాదంపై మారిన సర్కార్ స్వరం

వచ్చే వేసవికి నీళ్లివ్వాలనే తాపత్రయంలోనే ఘటన జరిగిందంటున్న తుమ్మల, ఉత్తమ్

మొన్న బీఆర్‌ఎస్ పాపమేనన్న భట్టి

సోషల్‌మీడియాలో చూసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందన్న మంత్రులు

సీఎంతో చర్చించి కమిటీ వేస్తామని వెల్లడి

సుంకిశాల వాల్ కూలిన ప్రదేశం పరిశీలన

› 2



తమ భూములు కోసం సీఎం రేవంత్, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి విన్నవిస్తున్న కొడంగల్ రైతులు

మా భూములు ఇవ్వాలని రేవంత్ బెదిరింపు

ఫార్మా కంపెనీలకు భూములు ఇవ్వాలని ఒత్తిడి

3 వేల ఎకరాల కోసం తిరుపతిరెడ్డి దౌర్జన్యం

భూములు ఇవ్వం.. మాకు అండగా నిలవండి

కేటీఆర్‌కు కొడంగల్ రైతుల వినతి

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): తమ భూములను ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెదిరింపులకు గురిచేస్తున్నారని కొడంగల్ రైతులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుతో మొరపెట్టుకున్నారు. ఈ విషయంలో తమకు అండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో సీఎం సొంత నియోజకవర్గంలోని రైతులు కేటీఆర్‌ను కలిశారు. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలంలోని హకీంపేట, పోలెపల్లి, లకచర్ల గ్రామాల్లో దాదాపు మూడువేల ఎకరాల భూమిని రైతుల నుంచి బలవంతంగా తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్‌కు వివరించారు. ఫార్మా కంపెనీలు వస్తే కాలుష్యం పెరుగుతుందని, తమకు ఈ ఫ్యాక్టరీలు వద్దని రైతులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నా సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి › IIవ పేజీలో

రేవంత్ టూర్ అట్టర్‌ఫ్లాప్

రుణమాఫీ కాలయాపన కోసమే పర్యటన › 3

ఫ్యామిలీతోనే పెట్టుబడులు: ఎన్నారై తిరుపతిరెడ్డి

సీఎం తమ్ముడిపై అరెస్టు వారెంట్?

› 8

న్యూజెర్సీ కోర్టు జారీ: ఎన్నారై డేవిడ్

• **నాడు:** టిమ్‌కుక్, కేసీఆర్‌తో కేటీఆర్ సెల్ఫీ



హైదరాబాద్ నానక్‌రాంగూడలోని వేవ్‌రాక్ బిల్డింగ్‌లో ఆపిల్ కార్యాలయం ప్రారంభోత్సవంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆపిల్ సీఈవో టిమ్‌కుక్‌తో మాజీ మంత్రి కేటీఆర్ సెల్ఫీ (19.05.2016)

• **నేడు:** ఆపిల్ ఆఫీసు బయట రేవంత్



అమెరికా కాలిఫోర్నియాలోని ఆపిల్ కేంద్ర కార్యాలయం బయట సీఎం రేవంత్ రెడ్డి (09.08.2024)

తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్

ఇకపై అలాగే పిలుద్దాం • సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు • అడోబ్ సీఈవోతో భేటీ

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఇకపై తెలంగాణ రాష్ట్రాన్ని 'ఫ్యూచర్ స్టేట్ (భవిష్యత్తు రాష్ట్రం)' అని పిలుద్దామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రం 'ది ఫ్యూచర్ స్టేట్'కు పర్యాయపదంగా నిలుస్తుందని చెప్పారు. అమెరికా పర్యటనలో భాగంగా కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్ టేబుల్‌లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెక్ యూనికార్న్స్ సీఈవోలను ఉద్దేశించి మాట్లాడారు. ఆయా సంస్థలను తెలంగాణకు ఆహ్వానించారు. 'మీ భవిష్యత్తును ఆవిష్కరించుకోండి. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం' అని పిలుపునిచ్చారు. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం, దానిని సూచించే నినాదం ఉన్నదని, ఇదే తరహాలో తెలంగాణను ఫ్యూచర్ స్టేట్ ట్యాగ్ లైన్‌తో పిలుద్దామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ప్రఖ్యాత అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో భేటీ అయ్యారు. హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ నిర్మాణం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటు ప్రణాళికలను వివరించారు. హైదరాబాద్‌లో పెట్టుబడులపై ఆయన ఆసక్తి కనబరిచారని సీఎంవో తెలిపింది. టెక్ విజనరీ శంతను నారాయణ్‌ను కలుసుకోవటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అమెరికాలోనే అతి పెద్ద బయోటెక్నాలజీ కంపెనీ ఆమ్జెన్ తెలంగాణలో కార్యకలాపాలను విస్తరించనున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆమ్జెన్ ఆర్‌అండ్‌డీ కేంద్రంలో కంపెనీ ఎండీ డాక్టర్ డేవిడ్‌రీస్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ సోమ్ చటోపాధ్యాయతో సమావేశమయ్యారు. అనంతరం.. హైదరాబాద్‌లో కొత్తగా రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ప్రారంభించనున్నట్టు కంపెనీ ప్రకటించింది. హైటెక్ సిటీలో ఆరు అంతస్తుల భవనంలో ఈ సెంటర్ ఏర్పాటు కానున్నది. దాదాపు 3 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికం నుంచే కంపెనీ తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నట్టు సీఎంవో తెలిపింది. ఈ పెట్టుబడులపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. దీంతో తెలంగాణలోని నిరుద్యోగులకు భారీ ఎత్తున ఉద్యోగాలు లభిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



కమిటీ వేసెయ్.. కాలరాసెయ్!

సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ సర్కారు స్కెచ్

జలమండలి కమిటీతో చేతులు దులుపుకొనే యత్నం

నిపుణుల కమిటీతో వైఫల్యం బయటపడుతుందని కాంగ్రెస్ ప్రభుత్వ భయం

సంఘటనను ప్రభుత్వానికి చెప్పకుండా దాచిపెట్టిన వారికే విచారణ బాధ్యతలు

పనులను పర్యవేక్షించాల్సిన జలమండలి ప్రకటనలో ఏజెన్సీదే వైఫల్యమని నెపం

ఏజెన్సీయే నిర్ణయాలు తీసుకుంటే ఇంజినీర్లు ఏం చేశారని రిటైర్డ్ ఇంజినీర్ల నిలదీత

సభ్యుడిగా ఉన్న పీడీపై కమిటీ వ్యతిరేక నివేదిక ఇస్తుందా? అని సందేహాలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): 'అవకాశం దొరికితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మీద నెపం నెట్టెయ్.. లేదంటే వ్యవహారాన్ని గుట్టుగా కాలరాసెయ్!' ఇదీ.. సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ సర్కారు వైఖరి. అందుకే ఎనిమిది నెలలుగా చీమ చిటుక్కుమన్నా న్యాయ విచారణ కమిటీలు అంటూ ప్రకటన చేసే ప్రభుత్వ పెద్దలు సుంకిశాలపై మాత్రం దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు. ముందుగా ఇది బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాపమేనంటూ దబాయింపునకు దిగి జలమండలి వివరణతో వెనక్కి తగ్గి.. ఇదేదో తిరిగి సర్కారు మెడకు చుట్టుకుందనే భయంతో జలమండలి కమిటీతో సరిపెట్టారు. ఒక దశలో కాంగ్రెస్ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీతో కలిపి నిపుణుల కమిటీ వేయాలని అనుకున్నా ఈ వ్యవహారాన్ని గుట్టుగా మూసేసేందుకు జలమండలి ఇంజినీర్లతో కమిటీ వేసి చేతులు దులుపుకొన్నది. మరోవైపు పనులను పర్యవేక్షించాల్సిన ఇంజినీర్లకు ఎలాంటి బాధ్యతా లేనట్టుగా ఏజెన్సీపై నెపం నెట్టి ఆ పాపాన్ని ఆకస్మిక వరదలమీదికి నెట్టారు. చిత్రమైన విషయం ఏమిటంటే ఘటనను ప్రభుత్వానికి చెప్పకుండా దాచిన వారికే విచారణ బాధ్యతలు అప్పగించారు. ఇది కాలయాపనతో గుట్టుగా సుంకిశాల ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టే వ్యూహమేనని నిపుణులు చెబుతున్నారు.

బీఆర్‌ఎస్‌పై నెట్టేందుకు తంటాలు పడి..తారుమారు

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎనిమిది నెలలుగా నానా యాగీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చివరికి ఆ ప్రాజెక్టుతోనే గోదావరి జలాలను ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా వచ్చిపడిన సుంకిశాల ఘటనతో ప్రభుత్వ పెద్దలు ఉలిక్కిపడ్డారు. వాస్తవానికి ఘటన జరిగి వారం రోజులైనా కించిత్తు సమాచారం లేకుండా ప్రభుత్వం ఒకవిధంగా అంధకారంలోనే ఉండిపోయింది. 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చిన తర్వాత కలవరపాటుకు గురైన ప్రభుత్వ పెద్దలు, నెపాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నెట్టేసేందుకు నానా తంటాలు పడ్డారు. తొలుత మంత్రి పొన్నం ప్రభాకర్ 'ఇది బీఆర్‌ఎస్ పాపమే'నని ఆరోపించడంతో పాటు కమిటీ వేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. ఇందుకు కొనసాగింపుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఈ పాపాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వేసేందుకు తీవ్రంగానే ప్రయత్నించారు. ఓవైపు సుంకిశాల గోడ కుప్పకూలిన ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తిన విమర్శలను తాళలేక ఈ పథకం పనులు బీఆర్‌ఎస్ హయాంలోనే మొదలయ్యాయని పాతమాటలు వల్లించారు. విలేకరుల సమావేశానికి ముందే జలమండలి ఎండీని, ఇంజినీర్లను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఇంజినీర్లు వాస్తవాలను ఆయనకు వివరించినట్టు తెలిసింది. దీంతో ఇదేదో ప్రభుత్వ మెడకే చుట్టుకునేలా ఉన్నదనే భావనతోనే ఆయన విలేకరుల సమావేశంలో నెపాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేశారు. కానీ జలమండలి అధికారులు మాత్రం డిప్యూటీ సీఎంకు చెప్పిన వాస్తవ వివరాలతోనే అధికారిక పత్రికా ప్రకటన విడుదల చేయడంతో సీన్ ఒక్కసారిగా తారుమారైంది.

నిపుణల కమిటీపోయి.. జలమండలి కమిటీ..

సుంకిశాల ఘటనపై విచారణ కమిటీ వేస్తామని మంత్రి పొన్నం ప్రకటించిన తర్వాత ప్రభుత్వపరంగా కొంత కసరత్తు జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో భాగంగా నీటిపారుదల శాఖ, జలమండలి అధికారులతో నిపుణుల కమిటీ వేయాలని నిర్ణయించారు. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ హరిరాంతో పాటు జలమండలి ఈడీ సత్యనారాయణ, జేఎన్‌టీయూకు చెందిన మరో నిపుణుడితో కమిటీ వేయాలని ప్రాథమికంగా అనుకున్నట్టు సమాచారం. కానీ జలమండలి అధికారులు డిప్యూటీ సీఎంను కలవడం, ఆపై అదేరీతిన తాము అధికారిక ప్రకటన విడుదల చేయనున్నట్టు ప్రభుత్వానికి సమాచారం ఇవ్వడంతో ఒక్కసారిగా నిపుణుల కమిటీ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్టు సమాచారం. నిపుణుల కమిటీ అయితే వాస్తవాలను నివేదిక రూపంలో ఇస్తే ప్రభుత్వం ఇరకాటంలో పడుతుందని భావించిన పెద్దలు జలమండలి ఇంజినీర్లతో కమిటీ వేసి చేతులు దులుపుకొనేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఈడీ, ఇద్దరు డైరెక్టర్లతో కమిటీ వేశారు. దీనిద్వారా సుంకిశాల కథ కంచికేనని తేటతెల్లమవుతున్నది.

కొత్తగా తేల్చేదేమున్నది?

జలమండలి గురువారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలోనే ఘటనకు కారణమేమిటన్నది పూసగుచ్చినట్టు వివరించింది. కాకపోతే ఆ తప్పిదాన్ని ఏజెన్సీపై నెట్టింది. ముఖ్యంగా పథకం పనులు ఈపీసీ విధానంలో కాంట్రాక్టర్‌కు ఇవ్వలేదనే వాస్తవాన్ని ఇంజినీర్లు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు. తద్వారా నాన్ ఈపీసీ కింద ఇచ్చిన టెండర్ పనులు కావడంతో పర్యవేక్షణ బాధ్యత జలమండలి ఇంజినీర్లదే. అంటే గేటు బిగింపు, పంపుహౌస్ స్లాబ్ నుంచి టైబీమ్స్ నిర్మాణం మొదలు ఎగువ వరదను అంచనా వేయడం, సొరంగాన్ని ఓపెన్ చేయడం వరకు ఇంజినీర్లు పర్యవేక్షించాలి. ఒక్కో దశను తమ కనుసన్నల్లోనే నిర్ధారిస్తూనే ఏజెన్సీ ముందుకెళ్లాలి. ఇక్కడ అలా జరిగిందా? లేదా? అనేది కీలకం కాదని, ఏజెన్సీనే అన్ని నిర్ణయాలు తీసుకుంటే మరి ఇంజినీర్లు ఏం చేశారని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. కచ్చితంగా వారు తమ విధులను విస్మరించారనేది జలమండలి అధికారిక ప్రకటనలోనే స్పష్టమైందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జలమండలి ఇంజినీర్లతోనే కమిటీ వేస్తే కొత్తగా తేల్చేదేమున్నదని? చర్యలు ఎవరిపై తీసుకుంటారని పలువురు రిటైర్డ్ ఇంజినీర్లు ప్రశ్నిస్తున్నారు. పైగా కమిటీలో సుంకిశాల పథకం పనులను పర్యవేక్షించాల్సిన ప్రాజెక్టు డైరెక్టర్ కూడా ఉన్నారని, ఈ క్రమంలో కమిటీ ఆయనకు వ్యతిరేకంగా ఎలా నివేదిక ఇస్తుందనే సందేహాన్ని వ్యక్తంచేస్తున్నారు. ఇదంతా గుట్టుగా వ్యవహారాన్ని ముగించేందుకే తప్ప బాధ్యులపై చర్యలకు కాదని స్పష్టం చేస్తున్నారు.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబిత, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే వివేకానంద

'సుంకిశాల'.. సీఎం అసమర్థతే

> మొదటిపేజీ తరువాయి...

చేవలేనితనం వల్లనే సుంకిశాల ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. ప్రభుత్వం తప్పు లేకుంటే ఎందుకు వారంపాటు ప్రమాదాన్ని రహస్యంగా ఉంచారని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాగానే అసెంబ్లీలో సీఎం ప్రకటన చేశారని, సుంకిశాలపై ఎందుకు ప్రకటన చేయలేదని నిలదీశారు. ప్రభుత్వానికి ప్రమాదం విషయం తెలియదా? తెలిసినా పట్టించుకోలేదా? అని నిలదీశారు. ప్రభుత్వానికి విషయం తెలియలేదంటే సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ప్రమాదం గురించి సీఎంకు, ప్రభుత్వానికి సమాచారం తెలుసునని, వారంపాటు గోప్యంగా ఉంచారని మండిపడ్డారు. అధికారులు చెప్పినా వినకుండా గేట్లు అమర్చడంతో ప్రమాదం జరిగిందని ఆరోపించారు. అదృష్టవశాత్తు కూలీలు షిఫ్ట్ మారినప్పుడు ప్రమాదం జరిగిందని, లేకుంటే చాలా ప్రాణనష్టం జరిగేదని ఆవేదన వ్యక్తంచేశారు. మంచి జరిగితే తమ ఘనత, చెడు జరిగితే బీఆర్‌ఎస్ తప్పు అంటూ తప్పుడు ప్రచారం చేసే చిల్లర ప్రయత్నాలు వద్దని హితవు చెప్పారు.

కేసీఆర్ విజయాలను అంగీకరించలేక..

ఎన్నికల్లో ప్రయోజనం కోసం కాళేశ్వరంపై చేసిన అడ్డగోలు వాదన వీగిపోయిందని, 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాజెక్టు చెక్కుచెదరకుండా ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిజంగానే పూర్తిగా విఫలమైతే, ఇప్పుడు ఏవిధంగా రిజర్వాయర్లను నింపుతున్నదని ప్రశ్నించారు. 'వీళ్లకు సరుకు లేదు. సబ్జెక్ట్ లేదు. బరాజ్ గేట్లు ఎప్పుడు దించుతారో కూడా తెలియదు' అని మండిపడ్డారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోయడానికి ఇబ్బంది లేదని, ఇంత మంచి ప్రాజెక్ట్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇంజనీర్లే ఆవేదన వ్యక్తంచేస్తున్నారని చెప్పారు.

> కాళేశ్వరంలో ప్రమాదం జరిగితే ఎన్డీఎస్‌ఏ వస్తది, ఆగమేఘాల మీద రిపోర్ట్ ఇస్తది, మరి సుంకిశాలకు ఎందుకు కేంద్ర సంస్థ వస్తలేదు. ఇది కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయారనడానికి నిదర్శనం. -కేటీఆర్

పరిపాలన చేతకాక...

ఎస్సెల్బీసీ టన్నెల్ పనులను కూడా వేగంగా చేశామని, సాగునీటితోపాటు తాగునీటికి కూడా ప్రాధాన్యం ఇవ్వడంతోనే రైతులు ఆందోళన చేయలేదని కేటీఆర్ వివరించారు. పేర్లు మార్చుడామేనా మార్పు అంటే? అని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క తన ఆలోచనా విధానం మార్చుకోవాలని సూచించారు. తాము కూడా సుంకిశాలకు వెళ్లి అన్ని విషయాలు అక్కడ నుంచి వివరిస్తామని ప్రకటించారు. నీళ్ల విషయంలో కేసీఆర్‌కు పేరు వస్తదనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పరిపాలన రాక ప్రతి దానికి కేసీఆర్ మీద తప్పుడు ప్రచారం చేసున్నారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ సరిగా లేదని, వారి బాకా ఊదే పత్రికలే శాంతిభద్రతల మీద కథనాలు రాస్తున్నాయని చెప్పారు.

> నీళ్ల విషయంలో కేసీఆర్ విజయాలను అంగీకరించలేని కురచ మనస్తత్వంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. మేడిగడ్డ మీద విచారణ చేస్తున్నారు. పది లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా సరే మేడిగడ్డకు ఏమీ కాలేదు. ఇన్నాళ్లు కాళేశ్వరంపై చిల్లర, దివాలాకోరు ప్రచారాలు చేశారు. ప్రకృతే తప్పుడు ప్రచారాలకు సమాధానం చెప్పింది. -కేటీఆర్

జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

సుంకిశాల ప్రమాదంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలని, ఘటన స్థలంలోనే భట్టి విక్రమార్క పకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మేడిగడ్డ అంశంపై తాము జాప్యం చేయలేదని, ఎన్నికల కోడ్ ఉన్నా సరే ప్రమాదం జరిగిన విషయాన్ని చెప్పామని గుర్తుచేశారు. ఘటన జరిగిన గంటల్లోనే లోపాలు సరిదిద్దుతామని ఎల్‌అండ్‌టీ చెప్పిందని, రహస్యంగా ఉంచాల్సిన అవసరం లేదని కేటీఆర్ స్పష్టంచేశారు. కానీ, సీఎం సుంకిశాల విషయాన్ని ఎందుకు దాచారని ప్రశ్నించారు. ప్రమాదం జరిగినప్పుడు సీఎం హైదరాబాద్‌లోనే ఉన్నారని, ఆ మరునాడే దాని మీద పర్యవేక్షణ, సమీక్ష లేకుండా అమెరికా వెళ్లారని ఆరోపించారు. భట్టి విక్రమార్క ఇతరులపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని, ఒకవేళ సీఎంకు విషయం తెలియకపోతే ఆయనకు పరిపాలనపై పట్టు లేనట్టేనని కేటీఆర్ స్పష్టంచేశారు.

సుంకిశాల చరిత్ర ఇది.

మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి హయాంలో సుంకిశాల ప్రతిపాదన చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. అప్పట్లో తమకు అన్యాయం చేయొద్దంటూ రైతులు అడ్డుకోవడంతో ఎస్‌ఐ కూడా చనిపోయారని, గత ప్రభుత్వాల హయాంలో రెండు, మూడు దశ లు అంటూ ప్రతిపాదనలు తెచ్చారని వివరించారు. రైతులు మళ్లీ అడ్డుకోవడంతో ప్రాజెక్ట్ ఆగిపోయిందని చెప్పారు. ఆ తరువాత రైతు ల్లో విశ్వాసం నింపడంతో సుంకిశాలను అడ్డుకోలేదని తెలిపారు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు ఎత్తిపోయాలంటే నాగార్జునసాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం ఉంటే నే సాధ్యమవుతుందని, సుంకిశాలలో 462 అడుగులున్నా సరే నీళ్లు తీసుకోవచ్చని, రాబో యే 50 ఏండ్లలో హైదరాబాద్ నీటి అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్ట్‌ను కేసీఆర్ చేపట్టారని వివరించారు. నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రజా ప్రతినిధులందరితో కలిసి దీనికి శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. మూడు పైప్‌లైన్ల ద్వారా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతున్నదని, కృష్ణానదికి మూడు, నాలుగేండ్లు వరద రాకపోయినా డెడ్‌స్టోరేజీ నుంచి సుంకిశాల ద్వారా నీళ్లు తేవచ్చని చెప్పారు. ఓఆర్‌ఆర్ చుట్టూ ఒక రింగ్ మెయిన్ చేయాలనే ఉద్దేశంతో గోదావరి, కృష్ణా నీళ్లు తీసుకొచ్చే ప్రయత్నం చేశామని కేటీఆర్ వివరించారు.

మహానగరాల్లో కొరత కానీ,

ఢిల్లీ, బెంగళూరు లాంటి మహానగరాల్లో భారీగా నీటి కొరత ఉన్నదని, నీళ్ల కోసం యుద్ధాలు జరిగే పరిస్థితి హైదరాబాద్‌లో లేదని కేటీఆర్ గుర్తుచేశారు. హైదరాబాద్‌కు తాగునీటి కొరత లేకుండా చేసేందుకే సుంకిశాల ప్రాజెక్ట్ చేపట్టామని వివరించారు.. సుంకిశాల పనులు చాలా వేగంగా పూర్తి చేశామని, ఒక్క మోటర్ ఫిట్టింగ్ పనులు మాత్రమే మిగిలిపోయాయని, 2024 వేసవికాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం పనులను పెండింగ్‌లో పెట్టిందని మండిపడ్డారు. మొన్నటి ఎండకాలంలో హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లు తెప్పించుకోవాల్సిన దుస్థితి రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు వచ్చాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద కూడా విమర్శలు రావడంతో రెండు, మూడు నెలల క్రితం దున్నపోతు నిద్రవీడారని ఎద్దేవా చేశారు. ఆ తర్వాత అధికారులపై ఒత్తిడి పెట్టి ఆగమాగంగా పనులు చేపట్టారని, ఈ ప్రమాదం ఎందుకు జరిగిందనే అంశంపై జలమండలి అధికారితో వివరంగా మాట్లాడానని కేటీఆర్ తెలిపారు. 'సీతారామ ప్రాజెక్ట్ గురిం చి భట్టివిక్రమార్క బిల్డప్ ఇచ్చారు. ఆ ప్రాజెక్ట్‌ను చేపట్టింది, పూర్తి చేసింది కూడా కేసీఆరే. కేసీఆర్ పూర్తి చేసిన పథకాన్ని కాంగ్రెస్ పూర్తి చేసినట్టు చెప్పుకున్నా ప్రజలకు అన్ని విషయాలు తెలుసు' అని కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే వివేకానంద పాల్గొన్నారు.

> సుంకిశాల ప్రాజెక్టులో ఇంజనీరింగ్ లోపం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన విధానంలోనే లోపం ఉన్నది. సుంకిశాల ప్రమాదానికి కారణమైె రాష్ట్ర ప్రజల సొమ్మును ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. ఇది మూర్ఖ, కుత్సిత మనస్థత్వం ఉన్న ప్రభుత్వం. -కేటీఆర్

కూలిన ఘటన మాదాకా రాలేదు!

- **చిన్న ఘటన కాబట్టే జలమండలి ఇంజినీర్లు చెప్పలేదు**
- **సుంకిశాల ప్రమాదంపై మారిన కాంగ్రెస్ సర్కారు స్వరం**
- **మొన్న బీఆర్‌ఎస్ పాపమన్న భట్టి**
- **సోషల్ మీడియాలో చూసి ప్రభుత్వం స్పందించిందన్న మంత్రులు**
- **సీఎంతో చర్చించి ఉన్నతస్థాయి కమిటీ వేస్తామని వెల్లడి**
- **చైర్మన్ గుత్తాతో కలిసి వాల్ కూలిన ప్రదేశం పరిశీలన**

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ సర్కారు తెల్లముఖం వేసింది. వారం కింద జరిగిన ఘటనపై జలమండలి, ఏజెన్సీ గోప్యత పాటించాయని అందరికీ తెలిసిన సత్యం!. కానీ ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న ప్రభుత్వ పెద్దలకు ఘటనపై సమాచారమే లేదట! మీడియాలో వస్తే గానీ ప్రభుత్వానికి తెలవలేదట! అవును.. సాక్షాత్తూ ఇద్దరు మంత్రివర్యులే శుక్రవారం ఈ అంశంపై కుండబద్దలు కొట్టారు. అంతేకాదు.. 'ఇది చాలా చిన్న సంఘటన అయినందున, ఇంజినీర్లు వాళ్ల స్థాయిలోనే పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వానికి చెప్పలేదు' అని గోప్యత పాటించిన జలమండలి అధికారుల భుజం కూడా తట్టారు. ఇక.. ప్రమాదానికి కారణాన్ని కూడా మంత్రులు మీడియాకు సెలవిచ్చారు. వేసవిలో నీళ్లివ్వాలనే తాపత్రయంతోనే పనులు త్వరితగతిన చే పట్టారని, దీంతో ప్రమాదం జరిగిందని తేల్చిపారేశారు. ప్రమాదంతో నష్టమేమీలేదని, కాం ట్రాక్టు సంస్థనే నష్టాన్ని భరిస్తుందంటూ సర్కా రు ఖజానాకు భరోసా ఇచ్చారు. మరి దశాబ్దాలుగా అరిగోస తీస్తున్న రైతులకు సాగునీరివ్వాలనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం కేవలం మూడేండ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన దరిమిలా చోటుచేసుకున్న చిన్న లోపా న్ని మాత్రం ఈ మంత్రులే భూతద్దం పెట్టి చూ పించడం గమనార్హం. మరోవైపు సుంకిశాల ఘటనపై గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 'రాంగ్.. ఇదంతా బీఆర్‌ఎస్ పాపమే' అని వ్యాఖ్యానించగా శుక్రవారం సుంకిశాల పర్యటనలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల 'త్వరితగతిన నీళ్లివ్వాలనే తాపత్రయంలోనే ప్రమా దం జరిగింది' అంటూ స్వరం మార్చారు. శుక్రవారం సుంకిశాల సందర్శనకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా వస్తున్నారంటూ ముందుగా సమాచారం విడుదల చేసినా ఆయన మాత్రం సొంత జిల్లాలోనే ఉండిపోయి, సందర్శనకు రాకపోవడంపై గుసగుసలు వినిపిస్తున్నాయి. శుక్రవారం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని సుంకిశాల ప్రాజెక్టు ను భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సందర్శించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి కోదాడకు వెళ్లి అక్కడ తుమ్మల నాగేశ్వర్‌రావును ఎక్కించుకొని సుంకిశాలకు చేరుకున్నారు. ముందుగా పంపుహౌస్ వద్ద గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరంమీడియాతో మాట్లాడారు.



నల్లగొండ జిల్లాలోని సుంకిశాల ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ప్రభుత్వం దృష్టికి రాలేదు : తుమ్మల

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ 'వచ్చే వేసవికి నీళ్లివ్వాలి కాబట్టి థర్డ్ టన్నెల్ ఓపెన్ చేసి పనులను ఆలస్యం కాకుండా చూడాలని తొందరపడి ఉండొచ్చు. నీళ్లివ్వాలన్న తాపత్రయం ఉండొచ్చు. కానీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకున్నారా? పనిలో ఉన్న నాణ్యత ఏమిటి? ఘటనకు కారణం ఏమిటి? అన్నది తేలాల్సి ఉన్నది. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం దృష్టికి రాలేదు. చిన్న సంఘటన కాబట్టి రెక్టిఫై చేసుకుంటామనే ఉద్దేశంతో ఇంజినీర్లు లేదా ఏజెన్సీ, అధికారులు ప్రభుత్వం దృష్టికి తేలేదు' అని వెల్లడించారు. ఎప్పుడైతే మీడియా దృష్టికి వచ్చిందో ప్రభు త్వం స్పందించి కమిటీ వేసి రిపోర్ట్ ఇవ్వాలని చెప్పామని, బాధ్యులెవరనేది ప్రభుత్వం గుర్తిస్తుందని చెప్పుకొచ్చారు. 'ప్రభుత్వాలు కంటిన్యూస్ ప్రాసెస్ కాబట్టి.. తప్పు జరిగినా ఒప్పు జరిగినా పూర్తి చేయాల్సిందే. ఈ పథకాన్ని ప్రభుత్వం కంటిన్యూ చేస్తుంది' అని చెప్పారు.

సీఎంపై విమర్శలు సరికాదు : గుత్తా

సుంకిశాల ఘటనపై దురుద్దేశపూర్వకంగా రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ శాఖ సీఎం వద్ద ఉన్నంత మాత్రాన ఆయనపై విమర్శలు చేయడం పాత మున్సిపల్ మంత్రి(కేటీఆర్)కి తగదన్నారు. 'హైదరాబాద్‌లో అసలు నీళ్ల కొరత లేదు.. సుంకిశాల ప్రాజెక్టు అవసరమే లేదు.. నిన్నటి దాక ప్రభుత్వంలో ఉండి నిరుపయోగమైన ప్రాజెక్టును ప్రజల మీద రుద్దుతూ ఇపుడున్న ప్రభుత్వం మీదనో.. సీఎం మీదనో దుమ్మెత్తి పోస్తాననడం సరికాదు. కాబట్టి జరిగిన ఘటనలో మంచి గానీ, చెడుగానీ మీ ఖాతాలోనే ఉంటుంది' అని గుత్తా వ్యాఖ్యానించారు. రూ.1400 కోట్ల అంచనాతో ప్రారంభించిన ప్రాజెక్టు ప్రస్తుతం రూ.2200 కోట్లకు చేరిందని, రానున్న కాలంలో నాలుగు వేల కోట్లకు చేరినా ఆశ్చర్యం అక్కరలేదని తెలిపారు. ఈ ప్రాజెక్టును కేసీఆర్, కేటీఆర్ ఎందుకు ప్రారంభించారో వారికి గాని, కాంట్రాక్టు సంస్థకు గాని తెలవాల్సి ఉందన్నారు. 'ఏదేమైనా ఒక ప్రభుత్వం ప్రారంభించి రూ.840 కోట్లు ఖర్చు చేసింది. డిసెంబర్ నుంచి ఈ ప్రభుత్వం రూ.1100 కోట్లు ఖర్చు చేసింది. వాస్తవంగా రూ.2200 కోట్లు పెట్టి టన్నెల్ పూర్తి చేస్తే గ్రావిటీతో నీళ్లు వస్తాయి. ఈ ఘటనలో టెక్నికల్‌గా కాంట్రాక్టరే కడుతాడు. ప్రభుత్వం మీద భారం పడనియ్యం అనేది మరో విషయం. దీనంతటికీ కారణం బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే'నని వ్యాఖ్యానించారు.

ఘటన చిన్నది.. నష్టం తక్కువ : మంత్రి ఉత్తమ్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వాస్తవ పరిస్థితిని ఫీల్డ్‌లో పరిశీలించి, ఫీల్డ్ ఇంజినీర్లు, ఏజెన్సీతో మాట్లాడి ప్రభుత్వం ఎలా ముందుకు పోవాలో తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు. 'జరిగిన సంఘటన చిన్నది, జరిగిన నష్టం చాలా తక్కువ. అది కూడా బాధాకరమే. కానీ ఒకట్రెండు నెలలు పనుల ఆలస్యం తప్పితే ఎంత నష్టం జరిగినా అది కాంట్రాక్టు సంస్థనే భరిస్తుంది. ప్రభుత్వానికి నష్టమేమీ లేదు. ఈ ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. నిర్మాణంలో ఉన్నది. ఈ ప్రాజెక్టు అన్ని విధాలా పూర్తయ్యాక ప్రభుత్వానికి అప్పజెప్పాల్సిన బాధ్యత వాళ్లదే. జరిగిన సంఘటన దురదృష్టకరం. ఈ ఘటన వల్ల ఒకట్రెండు నెలలు ఆలస్యమవుతుంది. ప్రాణనష్టం జరగలేదు. జరిగిన నష్టం ఎంతైనా సరే కాంట్రాక్టరే భరిస్తారు. ఈ పరిస్థితి రావడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణం' అని చెప్పారు. 'ఎందుకు ప్రతిపక్ష నేతలు మొత్తుకుంటున్నారో అర్థం కావడం లేదు. డిజైన్ చేసింది మీరు.. కాంట్రాక్ట్ ఇచ్చింది మీరు.. నిర్మాణం జరిగింది మీ హయాంలో.. మీ కమీషన్ కక్కుర్తో ఏమో గానీ రిటైనింగ్ వాల్ కూలిపోయింది. ఒక్కసారి ఆలోచన చేయాలి. 2014లో అధికారంలోకి వస్తే ఎన్నికలకు ఒకట్రెండు ఏండ్ల ముందు పనులు మొదలుపెట్టడంలో మతలబేమిటో ఆలోచించాలి. ఇదంతా మీరే చేసినా పడిపోవడం దురదృష్టకరం అంటున్నం. దీని వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు నష్టమేం లేదు. మొత్తం ఖర్చు కాంట్రాక్టర్ భరిస్తారు' అని ఉత్తమ్ చెప్పుకొచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉత్తర తెలంగాణకు, కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇచ్చిన ప్రాధాన్యత కృష్ణాబేసిన్‌కు, దక్షిణ తెలంగాణకు ఇవ్వలేదని ఆరోపించారు. 'దీనికారణంగానే ఎల్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తికాలేదు, ఈ ప్రభుత్వం పక్షాన.. సీఎం పక్షాన స్పష్టమైన హామీ ఇస్తున్నం.. మా హయాంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎల్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేస్తం. డిండి ఎత్తిపోతల పథకాన్ని కూడా పూర్తిచేస్తం' అని చెప్పారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానిదే బాధ్యత

- డిజైన్, నిర్మాణ లోపం వల్లనే సైడ్‌వాల్ కూలింది
- సుంకిశాల ఘటనపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- శాఖ తనది కానందున అవగాహన లేదని వ్యాఖ్య



నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): సుంకిశాలలో జరిగిన ఘటనకు గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే బాధ్యత అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డిజైన్ లోపమో లేక నిర్మాణ లోపం వల్లనో సైడ్‌వాల్ కూలిపోయిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోనే డిజైన్‌ను ఫైనలైజ్ చేసి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారని, రిటైనింగ్ వాల్ నిర్మాణం కూడా అప్పుడే జరిగిందని అందువల్ల ఆ ఘటనకు గత ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పురపాలక మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సుంకిశాల పర్యటనకు వచ్చిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడారు. గడిచిన తొమ్మిది నెలల్లో సుంకిశాల పనులపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్ష చేసిందనే తాను భావిస్తున్నానని చెప్పారు. తాను పురపాలక శాఖ మంత్రిని కానందున ఈ పథకంపై అవగాహన లేదని స్పష్టంచేశారు. అంతకు ముందు మీడియాతో మాట్లాడిన ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఇంజినీర్లు, ఇతర అధికారులు ప్రాజెక్టు మంచి ఉద్దేశంతో చేపట్టారని స్పష్టం చేశారు. 'ఆల్మట్టి, జూరాల గేట్లు ఎత్తారు, వరద వస్తుందని తెలుసు, అయినా టన్నెల్ ఎందుకు తెరిచారు అని మంత్రి తుమ్మల ప్రశ్నించగా.. తాము గేట్లు మూసే ఉంచామని, అన్ని జాగ్రత్తలు తీసుకున్నా వరద తీవ్రతకు గేట్లు కొట్టుకుపోయాయని ఇంజినీర్లు చెప్పారు.

ఈ సందర్భంగా మీడియా ప్రశ్నలకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు.

మీడియా: ఈ ఘటనను గోప్యంగా ఉంచారన్న ఆరోపణలకు ఏమంటారు?

ఉత్తమ్: గోప్యంగా ఉంచారని అనుకోను. ఇంజినీర్ల లెవల్‌లో వాళ్లు డీల్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఆరో తేదీనో తర్వాతనో వచ్చాక ఇది ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వెంటనే చర్యలు తీసుకున్నం. రిటైనింగ్ వాల్ పడిపోవడంపై ఏజెన్సీ వాళ్లు పునఃనిర్మాణం చేస్తామని చెప్పారు.

మీడియా: తొందరగా పనులు చేయాలని మీరు అధికారుల మీద ఒత్తిడి తేవడం వల్లనే ఇలా జరిగిందన్న ఆరోపణలున్నాయి.?

ఉత్తమ్: ఇవన్నీ లేనిపోని మాటలు. ఎవ్వరూ ఎవ్వరి మీద ఒత్తిడి తేలేదు. నార్మల్ కోర్స్‌లోనే పనులు జరుగుతున్నాయి.

మీడియా: జరిగిన ఘటనపై విచారణ జరుగుతుందా?

ఉత్తమ్: తప్పనిసరిగా విచారణ జరుగుతుంది. వాటర్ వర్క్స్ వాళ్ల లెవల్‌లో ఎంక్వైరీ చేస్తున్నారు. సీఎంతో చర్చించి ప్రభుత్వం తరఫున కూడా ఒక ఉన్నత స్థాయి కమిటీ వేసి ఎంక్వైరీ చేస్తం.

మీడియా : కాంట్రాక్టు సంస్థది తప్పని తేలితే బ్లాక్‌లిస్టులో పెడతారా?

ఉత్తమ్: విచారణ రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం ఆలోచిస్తది. ఎంక్వైరీ కానివ్వండి... అయ్యాక మాట్లాడుతాం.

మీడియా : గత ప్రభుత్వ వైఫల్యం అని భట్టి విక్రమార్క, ఇప్పుడు మీరు అంటున్నారు? జలమండలి వివరణలో ఏజెన్సీ సంస్థ అంచనాలో లోపమని తెలిపింది? ఇందులో ఏది కరెక్టు అని భావిస్తున్నారు?

ఉత్తమ్ : గత ప్రభుత్వంలో చేసిన ఏజెన్సీనే ఇది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వాళ్లు చేసిన డిజైన్ లోపమో... లేదా నిర్మాణంలో లోపమో వల్లనో ఈ ఘటన జరిగింది. వాళ్ల(బీఆర్ఎస్)కు ఇంకొకర్ని విమర్శించే అర్హత లేదు. డిజైన్, కాంట్రాక్ట్, నిర్మాణం అంతా వాళ్ల టైంలోనే జరిగింది. కాబట్టి ఏది జరిగినా వాళ్లే బాధ్యత వహించాలి.

మీడియా: మీ ప్రభుత్వం వచ్చాక ఈ 9 నెలల్లో ఎప్పుడైనా సుంకిశాలపై సమీక్ష చేశారా?

ఉత్తమ్ : సుంకిశాల ప్రాజెక్టుపై ప్రభుత్వం సమీక్ష చేసి ఉంటుందనే అనుకుంటున్నా. నేను ఇరిగేషన్ మంత్రిని. నాకు దీనిపై అవగాహన లేదు.

ఈ పర్యటనలో రాష్ట్ర జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఏజెన్సీ డైరెక్టర్ సుదర్శన్, సుంకిశాల ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, ప్రాజెక్టు సీజీఎం కిరణ్‌కుమార్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ప్రాజెక్టు ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఉంతో ఉపయోగకరం: డైరెక్టర్

ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోకరమైనదని ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ చెప్పారు. వరుసగా నాలుగేండ్లు కరువొచ్చినా హైదరాబాద్‌కు ఇప్పంది లేకుండా నీళ్లు అందించవచ్చని అన్నారు. 'ప్రస్తుతం ఉన్న స్కీమ్(పుట్టంగండి)తో సాగర్‌లో ఎండీడీఎల్ లెవల్‌లో ఎమర్జెన్సీ పంపింగ్ చేసేవాళ్లం. ఇలాంటి సమస్య రాకుండా ఈ పథకాన్ని 1994లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. దీని నిర్మాణం సంక్లిష్టంగా క్రిటికల్ స్ట్రక్చర్‌తో ఉండటం వల్ల సాగునీటిని తాగునీటిగా ఇప్పటివరకు వాడుకుంటూ వస్తున్నం. కానీ తాగునీటికే ప్రత్యేక వ్యవస్థ ఉండాలన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం సుంకిశాల ప్రాజెక్టును 2022లో ప్రారంభించింది. దీని పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు కేవలం తాగునీటి కోసమే ప్రత్యేకం. తీవ్ర వేసవిలోనూ ఎమర్జెన్సీ పంపింగ్‌తో పనిలేకుండా డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీళ్లు తీసుకోవచ్చు. నాలుగేండ్లు కరువు వచ్చినా ఇబ్బంది ఉండదు. సాగర్‌లో 450 ఫీట్ల వరకు డ్రా చేసుకోవచ్చు. ప్రస్తుతం 510 అడుగుల వరకే డ్రా చేయడానికి వీలు ఉంది' అని సుదర్శన్ వివరించారు.

పర్యవేక్షణ లోపమే కారణమా?

సుంకిశాలపై నిపుణుల అభిప్రాయం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): సుంకిశాల ప్రాజెక్టులో నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ లేకపోవడం వల్లనే రిటైనింగ్‌వాల్ కూలినట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జలమండలి చేపట్టే ప్రతి ప్రాజెక్టుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించుకుంటుంది. గతంలో శివారు మున్సిపాలిటీలలో హడ్కో రుణంతో చేపట్టిన రూ.1200 కోట్ల తాగునీరు, మురుగు నీటి పారుదల ప్రాజెక్టు పనులు, మురుగునీటి శుద్ధి పనులపై క్షేత్రస్థాయి అధికారులపై ఆధారపడలేదు. పనులు జరుగుతున్న ప్రతి సైట్లలో సీసీ కెమెరాలను బిగించి ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలోని సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం చేశారు. రోజూ ప్రాజెక్టు డైరెక్టర్, ఎండీలు తమ చాంబర్‌లో ఏర్పాటు చేసిన బిగ్ స్ర్కీన్ ద్వారా పనులను పర్యవేక్షించారు. తద్వారా పనుల నాణ్యతతోపాటు సంబంధిత ఏజెన్సీ లోపాలను పసిగట్టడం మందలించడం, చర్యలు తీసుకోవడం లాంటి వాటితో ప్రాజెక్టులను పూర్తి చేశారు. సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో మాత్రం అధికారులు ఇవేవీ చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెట్టుబడులు బోగస్

- సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన అట్టర్‌ఫ్లాప్
- రుణమాఫీ కాలయాపన కోసమే అమెరికా టూర్
- కుటుంబసభ్యులతోనే పెట్టుబడులు పెట్టించారు
- ఎన్ఆర్ఐ డాక్టర్ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అట్టర్‌ఫ్లాప్ అయిందని, పెట్టుబడులు అన్నీ బోగస్‌గా మారాయని ఎన్ఆర్ఐ డాక్టర్ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో పాల్గొన్నవారిలో 90% మంది సీమాంధ్రులే ఉన్నారని, తెలంగాణకు స్థానం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని రియల్‌ఎస్టేట్ దొంగలు మాత్రమే వచ్చారని పేర్కొన్నారు. సీఎం తన కుటుంబసభ్యులతో కంపెనీలు పెట్టించి, రూ.1,000 కోట్లు, రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెడితే లాభం ఏమిటని ప్రశ్నించారు. అమెరికాలో ఉన్న స్నేహితులు, ఎన్నికల్లో సహాయం చేసినవారిని కలుసుకోవడానికి వచ్చారని మండిపడ్డారు. మంత్రి దుద్దిళ ఔన్నత్యం ఉన్న నాయకుడని, ఆయన ఇలాంటి సమావేశాలకు రాకూడదని హితవుపలికారు. రైతు రుణమాఫీపై కాలయాపనకే అమెరికా పర్యటన తలపెట్టారని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల పేరు చెప్పి రుణమాఫీని వాయిదా వేస్తారని చెప్పారు. తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

'స్వచ్ఛ్'ను సమర్థించేదెలా?

- ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ పెద్దల మల్లగుల్లాలు
- పెట్టుబడి ఎవరు పెడితే తప్పేంటని ఎదురుదాడి

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వంలో, కాంగ్రెస్ పార్టీలో 'స్వచ్ఛ్ బయో' ప్రకంపనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని ఎలా సమర్థించుకోవాలో తెలియక నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. మొదట కంపెనీ పేరును సగం మాత్రమే బయటికి చెప్పి కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించినా.. క్రమంగా ఎంవోయూ కుదుర్చుకున్నది 'స్వచ్ఛ్ బయోగ్రీన్'తోనే అని పరోక్షంగా తేల్చి చెప్పారు. కేవలం 15 రోజుల కిందట ప్రారంభమైన కంపెనీతో ఎలా ఒప్పందం చేసుకున్నారన్న ప్రశ్నలను ఎలా ఎదుర్కోవాలో తెలియక వింత వాదనకు దిగుతున్నారు. సీఎం సోదరుడి కంపెనీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటే తప్పేముందని ఒకరు ప్రశ్నించగా..'పెట్టుబడులు ఎవరు పెడితే తప్పేముంది? అంటూ మరొకరు సందేహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నేతలు బట్టకాల్చి మీదేస్తున్నారని ఓ మంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్టుబడులు ఎవరు పెట్టారనేది ముఖ్యం కాదని.. ఆ సంస్థ పరపతి ఏమిటనేది ముఖ్యమని నెటిజన్లు ఎత్తిచూపుతున్నారు.

పెట్టుబడుల కోసమే సీఎం పర్యటన: మంత్రి కొండా సురేఖ

పెట్టుబడులు రావాలి.. రాష్ట్రం బాగుపడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన సాగుతున్నదని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

తెలంగాణను దోచుకుంటలేరు కదా: సంపత్‌కుమార్

సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి స్వచ్ఛ్ బయో కంపెనీ ఉన్నదని, వాళ్లే వచ్చి తెలంగాణలో పెట్టుబడులు పెడతామని చెప్పారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ చెప్పారు. వాళ్లు పెట్టుబడులు పెడతామన్నారే తప్ప తెలంగాణ ఆస్తిని దోచుకుంటామని అనలేదని వ్యాఖ్యానించారు.

ఎవరు పెడితే ఏంది?: చామల

రాష్ట్రంలో పెట్టుబడులు ఎవరు పెడితే ఏమిటి? అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. తనకు లండన్‌లోనో, ఆస్ట్రేలియాలోనో ఉన్న దగ్గరి దోస్తులు వ్యాపారం చేయడానికి తెలంగాణకు వస్తే తప్పా అని అడిగారు. వారిని తాను తీసుకొస్తే తప్పా అని అన్నారు.

• రంగనాయక సాగర్..



అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి చంద్లాపూర్ పంప్‌హౌస్ ద్వారా సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌లోకి వస్తున్న గోదావరి జలాలు

• మల్లన్న సాగర్..



రంగనాయక్‌సాగర్ నుంచి తుక్కాపూర్ సర్జ్‌పూల్ ద్వారా మల్లన్న సాగర్‌లోకి పరుగులు తీస్తున్న జలాలు

• కొండపోచమ్మ సాగర్..



మల్లన్నసాగర్ నుంచి మర్కుక్ పంప్‌హౌస్ ద్వారా కొండపోచమ్మ సాగర్‌లోకి దుంకుతున్న గోదావరి జలాలు

లోకం పోకడ



నీటి పారుదలశాఖ గదా, చేతులు తడుపందే పనికాదంటున్నాడు సార్!

26 గేట్లు ఎత్తి సాగర్ నీటి విడుదల

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 9 : కృష్ణానదికి వరద పోటెత్తుండటంతో నాగార్జునసాగర్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. ఈ నెల 5న క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల ప్రారంభం కాగా, రోజూ 2 నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శుక్రవారం నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు 2,94,009 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా అవుట్‌ఫ్లో 2,77,453 క్యూసెక్కులు ఉంది. 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,29,886 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గాను 587.30 (305.6838 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉన్నది.

జూరాలలో 39 గేట్లు ఎత్తివేత

జూరాల ప్రాజెక్టుకు శుక్రవారం 2.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 2,91,936 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పూర్తి స్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీకు గాను ప్రస్తుతం 8.300 టీఎంసీలుగా ఉన్నది. శ్రీశైలం ప్రాజెక్టుకు 3,92,415 క్యూసెక్కుల వరద వస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మేడిగడ్డ బరాజ్‌కు వరద క్రమంగా తగ్గుతున్నది. శుక్రవారం 3,10,080 క్యూసెక్కుల ప్రవాహం రాగా, 85 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. అన్నారం బరాజ్‌కు మానేరు, కాల్వల ద్వారా 3800 క్యూసెక్కుల నీరు వస్తున్నది.

నీళ్లను వాడుకునే తెలివిలేదా?

- **బంగారంలాంటి నీళ్లు బంగాళాఖాతంలోకి**
- **అవగాహనలేక వదిలేస్తున్న సర్కార్**
- **రాజకీయ కక్షతో రైతుల్ని ఆగం చేస్తున్నది**
- **మన రిజర్వాయర్లు వెలవెలబోతున్నయ్ ఆంధ్రాలో కళకళలాడుతున్నయ్**
- **ధ్వజమెత్తిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్**



తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, విజయార్య క్షేత్రియా

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : అవగాహన, రైతులపై చిత్తశుద్ధి లేక కాంగ్రెస్ ప్రభుత్వం బంగారం లాంటి నీళ్లను బంగాళాఖాతంలోకి వదులుతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పాలమూరు జిల్లాలో రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారని, కృష్ణా జలాలు సగటున రోజుకు 30 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల వ్యవస్థ పూర్తి సిద్ధంగా ఉన్నదని, నార్లాపూర్ నుంచి ఏదుల మీదుగా వట్టెం వరకు 27 టీఎంసీల నీటిని ఒడిసిపట్టే అవకాశం ఉన్నదని తెలిపారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదని, కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు అన్న కారణంతోనే నీళ్లివ్వడం లేదని, పనులు మిగిలి ఉంటే ఈ 8 నెలల్లో పూర్తిచేసి నీరెందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉన్న వ్యవస్థను వాడుకోకపోవడం ఎంత తెలివితక్కువ తనమో రైతులు ఆలోచించాలని సూచించారు. కాళేశ్వరం విషయంలో మొదట ఇలాగే చేసి ఇప్పుడు నీటిని ఎత్తిపోస్తున్నారని గుర్తుచేశారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉన్నది కాబట్టే పెండింగ్ ప్రాజెక్టులు, పాలమూరు-రంగారెడ్డి పనులను వేగవంతం చేశారని చెప్పారు. కరివెన నుంచి నీరు ముందుకుపోయేలా కాల్వల కోసం టెండర్లు పిలిస్తే వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. నాలుగు పంప్ హౌస్‌లు, ఐదు రిజర్వాయర్ల పనులు పూర్తిచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి వాడుకునే తెలివి లేదని విమర్శించారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద గతంలో కాంగ్రెస్ కేవలం 3.9 టీఎంసీల జలాశయాలను మాత్రమే ప్రతిపాదించారని గుర్తుచేశారు. కల్వకుర్తి కింద సొరంగ వ్యాసం చాలా తక్కువ పెట్టి ద్రోహం చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి కింద దాదాపు 60 టీఎంసీల జలాశయాలు నిర్మించామని చెప్పారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఉన్న ఐదు పంపులు ఒకేసారి నడిపే అవకాశం లేకుండా కాల్వల సామర్థ్యం తగ్గించి ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. పాలమూరు బిడ్డను అని పదేపదే చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ రైతులు ఇబ్బందులు పడుతుంటే అమెరికాలో మిసిసిపి అందాలు చూస్తూ కూర్చుంటారా ? అని ప్రశ్నించారు. 'వీరా పాలమూరు బతుకులను మార్చేది?' అంటూ ఎద్దేవాచేశారు.

తెలంగాణ రైతులపై కుట్ర: ఆర్‌ఎస్పీ

తెలంగాణ రైతులపై కుట్ర జరుగుతున్నదని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కంటే ఎక్కువ సామర్థ్యమున్న పంపులతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కేసీఆర్ చేపట్టారని, ప్రపంచంలో అద్భుతాన్ని అధోగతి పాలుచేసే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని మండిపడ్డారు. పాలమూరు బిడ్డ అని పదేపదే చెప్పుకొనే సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు ప్రాజెక్టు వద్దకు వెళ్లలేదని ఎద్దేవాచేశారు. ఇక్కడ రోజుకు 30 టీఎంసీలకు పైగా నీళ్లు సముద్రంలో కలుస్తుంటే రేవంత్‌రెడ్డి అమెరికాలోని మిసిసిపి అందాలను ఆస్వాదిస్తున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణ రిజర్వాయర్లు వెలవెలబోతున్నాయని, ఆంధ్రా రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయని, చంద్రబాబు ఆదేశాలమేరకే పనిచేస్తున్నారా? అని రేవంత్‌రెడ్డిని నిలదీశారు. 2016లో పాలమూరు-రంగారెడ్డి, డిండి ఉండరాదని నాడు కేంద్ర మంత్రి ఉమాభారతి వద్ద చంద్రబాబు పట్టుబట్టారని గుర్తుచేశారు. తాజా బడ్జెట్‌లో పాలమూరు ప్రాజెక్టులకు కనీస కేటాయింపులు లేవని విమర్శించారు. సాగునీటి బడ్జెట్‌ను రూ.44వేల కోట్ల నుంచి 22వేల కోట్లకు కుదించారని చెప్పారు. మూసీ సుందరీకరణ మీద ఆసక్తి చూపుతున్న రేవంత్‌రెడ్డి ఆ ప్రాజెక్టు మూలంగా ఎంతమంది జీవితాలు బాగుపడతాయో?, ఎన్ని ఎకరాలకు నీరందుతుందో? రాష్ట్ర జీడీపీ ఎంత పెరుగుతుందో చెప్పాలని ప్రశ్నించారు. 1.50 లక్షల కోట్లతో మూసీని సుందరీకరిస్తామంటున్న రేవంత్‌రెడ్డి పాలమూరు మీద ఎందుకు ప్రేమ చూపడం లేదని నిలదీశారు. డ్రోన్ విషయంలో కేటీఆర్‌పై కేసు పెట్టారని, రాష్ట్రంలో రోజూ ఎన్ని డ్రోన్లు ఎగరడం లేదు? అని ప్రశ్నించారు. ఇది ప్రజాపాలనా? ప్రజలపై ప్రతీకార పాలనా? తెలంగాణ అంటేనే రేవంత్‌రెడ్డికి ఎందుకంత కోపమంటూ ధ్వజమెత్తారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెల్ల ఏనుగులు అంటూ చంపే ప్రయత్నం చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.3°c	24.6°c
ఖమ్మం	33.0°c	24.0°c
కరీంనగర్	32.0°c	25.0°c
హైదరాబాద్	31.6°c	23.4°c
రంగారెడ్డి	31.6°c	21.9°c
మహబూబ్‌నగర్	31.2°c	23.5°c
వరంగల్	31.0°c	24.0°c
నిజామాబాద్	30.3°c	24.2°c
నల్లగొండ	30.0°c	23.4°c
మెదక్	22.5°c	31.6°c



ఏసీబీ దాడుల్లో పట్టుబడిన నగదు, నగలు లెక్కిస్తున్న అధికారులు

మున్సిపల్ అధికారి ఇంట్లో నోట్ల గుట్టలు

- **రూ.2.93 కోట్ల నగదు, 51 తులాల బంగారం**
- **రూ.6 కోట్లపైగా ఆస్తులు సీజ్ చేసిన ఏసీబీ**
- **లెక్కింపునకు ఆరు గంటల సమయం**
- **నిజామాబాద్‌లోని ఇంటిపై ఏసీబీ దాడులు**

వినాయక్‌నగర్, ఆగస్టు 9: నిజామాబాద్ మున్సిపాలిటీ సూపరింటెండెంట్ ఇంట్లో నోట్ల గుట్టలు బయటపడ్డాయి. పట్టుబడ్డ నగదు, నగలు చూసి ఏసీబీ అధికారులే విస్తుపోయారు. కార్పొరేషన్‌లో బిల్ కలెక్టర్ స్థాయి నుంచి ఆర్‌ఐగా, తర్వాత సూపరింటెండెంట్ వరకు సుమారు దశాబ్ద కాలంగా ఇక్కడే పని చేస్తున్న దాసరి నరేందర్.. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడని నేరుగా ఏసీబీ డైరెక్టర్ సీవీ ఆనంద్‌కు సమాచారం అందింది. ఈ మేరకు దాసరి నరేందర్ నివాసంతోపాటు సంబంధీకుల ఇండ్లు, ఆఫీస్ చాంబర్‌లో శుక్రవారం తెల్లవారుజామున 25 మందితో కూడిన ఏసీబీ అధికారుల బృందాలు ఏకకాలంలో దాడులు చేశాయి. ఈ దాడుల్లో రూ.6 కోట్లకు పైగా విలువైన ఆస్తులు వెలుగుచూశాయి. జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్ ఏరియాలో ఆర్‌ఐ నివాసమంటున్న అపార్ట్‌మెంట్‌లో, కోటగల్లిలో ఉంటున్న తల్లి నివాసంలో, నిర్మల్ జిల్లాలోని అత్తగారింట్లో సోదాలు జరిగాయి. నరేందర్ నివాసంలో ఎక్కడ చూసినా రూ.500 నోట్ల కట్టలు లభ్యమయ్యాయి. వాటిని కౌంటింగ్ మిషన్లతో లెక్కించడానికే ఐదు గంటలకు పైగా సమయం పట్టినట్టు తెలిసింది. 11 గంటలకు పైగా జరిగిన తనిఖీల్లో రూ.2.93 కోట్ల నగదుతోపాటు రూ.6 లక్షల విలువైన 51 తులాల బంగారు ఆభరణాలు, భార్య, తల్లి పేరిట బ్యాంకుల్లో ఉన్న బ్యాలెన్స్ రూ.1.10 కోట్లు, రూ.1.98 కోట్ల విలువ చేసే ఆస్తిపత్రాలను సీజ్ చేసినట్టు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరించారు. మరిన్ని సోదాలు జరుగుతున్నాయని, నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచామని తెలిపారు. ఓ స్థాయి ఉద్యోగి వద్ద ఇంత భారీ మొత్తంలో అక్రమాస్తులు లభించడం ఏసీబీ రికార్డులో ఇదే మొదటిసారి అని అధికారులు చెప్తున్నారు.

లింక్-2లో గోదావరి పరుగులు

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 9: కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా పెద్దపల్లి జిల్లాలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, శుక్రవారం ఒక మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ సైతం ఒకే మోటర్‌ను నడిపిస్తున్నారు. మొత్తం 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తూ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 12.75 టీఎంసీల జలాలు మధ్య మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ జలాశయంలో 27.54 టీఎంసీల నీటికి ప్రస్తుతం 17.15 టీఎంసీల నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

రంగనాయకసాగర్‌కు పరవళ్లు

మధ్యమానేరు నుంచి సిరిసిల్ల జిలా అన్నపూర్ణ ప్రాజెక్టుకు చేరుతున్న జలాలు రంగనాయకసాగర్ వైపు పరుగెడుతున్నాయి. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడ పంప్‌హౌస్‌లో రెండు మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నారు. ఇక్కడ జలాశయం గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయకసాగర్‌కు వదులుతున్నారు. అన్నపూర్ణ జలాశయంలో 3.5 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 1.25 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

జలాశయాల్లో గోదావరి గలగలలు

హరీశ్‌రావు లేఖతో దిగివచ్చిన ప్రభుత్వం.. ఈనెల 4 నుంచి ఎత్తిపోతలు ప్రారంభం

సిద్దిపేట, ఆగస్టు 9 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన జలాశయాల్లో గోదావరి జలాలు గలగలాపారుతున్నాయి. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖతో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి జలాశయాలను నింపుతున్నది. ఈనెల 4 నుంచి ఎత్తిపోతలు ప్రారంభం కాగా, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లకు గోదావరి జలాలు చేరుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ రిజర్వాయర్లు నిర్మించడం వల్లనే సాగు నీరు వస్తున్నదని రైతులు వరినాట్లు వేసే పనిలో బిజీబిజీగా గడుపుతున్నారు.

జలాశయాల్లో నీటి సామర్థ్యం ఇలా...

జలాశయం	సామర్థ్యం	ప్రస్తుత సామర్థ్యం	ఇన్‌ఫ్లో	అవుట్ ఫ్లో
అన్నపూర్ణ	3.50 టీఎంసీలు	1.22 టీఎంసీలు	6400క్యూసెక్కులు	6600 క్యూసెక్కులు
రంగనాయక	3 టీఎంసీలు	2.05 టీఎంసీలు	6,600క్యూసెక్కులు	5,200 క్యూసెక్కులు
మల్లన్నసాగర్	50 టీఎంసీలు	8.06 టీఎంసీలు	5,200 క్యూసెక్కులు	2,600 క్యూసెక్కులు
కొండపోచమ్మ	15 టీఎంసీలుల	4.07 టీఎంసీలు	2,600క్యూసెక్కులు	2,500 క్యూసెక్కులు

అర్హులందరికీ రుణమాఫీ

- **పంట పండిస్తేనే రైతుభరోసా**
- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**



కోదాడ, ఆగస్టు 9 : అర్హులందరికీ రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతితో కలిసి రైతులు, కాంగ్రెస్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. రైతు భరోసా, రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్‌పై చర్చించారు. రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. 3వ విడత రుణమాఫీ ఆగస్టు 15కల్లా పూర్తవుతుందని మంత్రి చెప్పారు. వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. రైతు భరోసాపై మాట్లాడుతూ.. నాలుగు జిల్లాల్లో రైతుల అభిప్రాయాలు సేకరించాల్సిన ఉందని, పంట పండించే రైతులకే భరోసా ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కౌలు రైతులను గుర్తించే అంశంపైనా అభిప్రాయాలు సేకరించాకే నిధులు విడుదల చేస్తామన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసేవారికి ప్రభుత్వం ఎకరాకు రూ.55 వేల సబ్సిడీ అందజేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదును దాటుతున్నా నీళ్లేవీ?

- **సూర్యాపేటలో కాళేశ్వరం ఆయకట్టు ప్రశ్నార్థకం**
- **రెండున్నర లక్షల ఎకరాలపై తీవ్రప్రభావం**
- **పంపులు ముందే నడిపిస్తే ఇప్పటికి చేరేవి**
- **షెడ్యూల్ ప్రకటించక ఆందోళనలో రైతులు**

సూర్యాపేట, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ప్రాజెక్టును పనికిరానిదిగా చూపాలనే పంతానికి పోయి కాంగ్రెస్ సర్కారు రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టింది. రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేసుకొని అన్నదాతల నోట్లో మట్టికొడుతున్నది. ప్రభుత్వ నిర్వాకంతో సూర్యాపేట జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాల కాళేశ్వరం ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాకు ఓవైపు కృష్ణా, మరోవైపు గోదావరి జలాలు అందుతాయి. నాగార్జునసాగర్ ఇప్పటికే నిండడంతో దాని ఆయకట్టుకు ఢోకా లేకపోయినా కాళేశ్వరం ఆయకట్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేసీఆర్ సర్కారు మాదిరి ప్రణాళికాబద్ధంగా మేడిగడ్డ పంపులను ముందే ఆన్ చేసి ఉంటే ఇప్పటికే జలాలు జిల్లాకు చేరుకునేవి. బీఆర్‌ఎస్ పోరాటాల ఫలితంగా ఇటీవల మోటర్లను ఆన్ చేసినా ఆ నీళ్లు జిల్లాకు ఎప్పుడు చేరుతాయో అధికారులకే తెలియటం లేదు. అదును దాటుతున్నా నీటి విడుదల షెడ్యూల్ లేక ఆందోళన నెలకొన్నది.

ఐదేండ్ల పాటు ఏటా 30 టీఎంసీలు

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సూర్యాపేట జిల్లాకు 2019 నుంచి 2023 వరకు ఐదేండ్ల పాటు ఏడాదికి రెండు సీజన్లకు గాను 24 నుంచి 30 టీఎంసీల నీళ్లు కాళేశ్వరం నుంచి అందాయి. ప్రతి సీజన్‌కూ కాల్వల్లో 1,200 నుంచి 1,700 క్యూసెక్కుల చొప్పున అవసరాన్ని బట్టి సీజన్‌కు 65 రోజుల నుంచి 100 రోజుల పాటు నిరంతరాయంగా విడుదల చేశారు. బయ్యన్నవాగు నుంచి కాల్వల ద్వారా నేరుగా పంట పొలాలకు సీజన్‌కు 12 క్యూసెక్కులతో పాటు జిల్లాలో గోదావరి ఆయకట్టు పరిధిలోని దాదాపు 1,200 చెరువులు, కుంటలు నింపేందుకు మరో 2 టీఎంసీలు కలిపి సీజన్‌కు 12 నుంచి 15 టీఎంసీల చొప్పున విడుదల చేశారు. దీంతో ఏడాదంతా ఆయకట్టు చెరువులు జలకళతో ఉండేవి. ఐదేండ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం జూలై రెండు నుంచి ఆగస్టు మొదటి వారంలోనే నీటిని అందించింది.

వానకాలాన్ని కూడా ముంచుతుందా?

కాళేశ్వరంతో కేసీఆర్‌కు వచ్చిన గుర్తింపును తొలగించే కుట్రలకు దిగి కాంగ్రెస్ సర్కారు సూర్యాపేట జిల్లా రైతుల నోట్లో మట్టికొట్టింది. గోదావరి ఉగ్రరూపం దాల్చి వరద పోటెత్తినా మేడిగడ్డ బరాజ్ తట్టుకొని నిలబడటంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి పంపులు ఆన్ చేసింది. మేడిగడ్డ వద్ద పంపులను నెల ముందు ఆన్‌చేసి ఉంటే ఇప్పటికే సూర్యాపేటకు నీళ్లు చేరేవని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా నీటి షెడ్యూల్ ప్రకటించాలని కోరుతున్నారు.

• నీళ్ల కోసం ఎదురుచూస్తున్నం



ఈ వానకాలానికి సంబంధించి సాగు పనులు మొదలైనయ్. నీటి వసతి ఉన్న రైతులు పొలాలు దున్నుతుంటే గోదావరి జలాలపై ఆధారపడి పంటలు వేసే నాలాంటోళ్లు కాళేశ్వరం నీళ్లకోసం చూస్తున్నం. నీటి విడుదల షెడ్యూల్ త్వరగా ప్రకటిస్తే పంటలు సాగు చేసుకుంటం. షెడ్యూల్ రానిదే రైతులు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉన్నది.

-మిర్యాల వెంకన్న, రైతు, పర్సాయపల్లి, అర్వపల్లి

సమ్మక్కసాగర్ నుంచే గోదావరి-కావేరి లింక్

- **బారాజ్ 83-87మీటర్ల మధ్య నీటి తరలింపు!**
- **సూత్రప్రాయంగా అంగీకరించిన తెలంగాణ**
- **మళ్లించే జలాల్లో 50శాతం వాటాకు పట్టు**
- **రాష్ట్ర అధికారులతో చైర్మన్ భోపాల్‌సింగ్ భేటీ**



హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టును సమ్మక్కసాగర్ నుంచే చేపట్టేందుకు తెలంగాణ సూత్రప్రాయంగా అంగీకరించి పలు డిమాండ్లను ముందుపెట్టింది. అధ్యయనం తర్వాత నిర్ణయం తీసుకుంటామని, జీసీ రివర్ లింక్‌కు పెద్దమనసుతో అంగీకరించాలని తెలంగాణకు ఎన్‌డబ్ల్యూడీఏ విజ్ఞప్తి చేసింది. జీసీ లింక్ ప్రాజెక్టు ఎక్కడి నుంచి చేపట్టాలనే అంశంపై కొంతకాలంగా తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో తెలంగాణ అనేక సాంకేతిక అంశాలను ఎత్తిచూపుతున్నది. ఈ నేపథ్యంలో జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం కొనసాగింది. సంస్థ డైరెక్టర్ తరఫున జనరల్ (డీజీ) భోపాల్‌సింగ్, దక్షిణాది విభాగం చీఫ్ ఇంజినీర్ దేవేందర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు హాజరుకాగా తెలంగాణ నుంచి సాగునీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ (జనరల్) జీ అనిల్‌కుమార్, అంతర్రాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజినీర్ మోహన్‌కుమార్, డీడీ గోదావరి సుబ్రహ్మణ్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అభ్యంతరాలు, డిమాండ్లను ఎన్‌డబ్ల్యూడీఏకు రాహుల్ బొజ్జా నివేదించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చంపల్లిలో రిజర్వాయర్ నిర్మాణంతో ఇబ్బందులున్నాయని అధ్యయనంలో తేలినట్టు వెల్లడించారు. 83 మీటర్ల ఎత్తుతో కట్టిన సమ్మక్క బరాజ్‌నులో 83-87 మీటర్ల మధ్య నీటిని నిల్వచేసి, వాటిని మాత్రమే జీసీ లింక్‌లో తరలించాలని ప్రతిపాదించారు. 83మీటర్ల దిగువన ఉన్న నీటిని ముట్టుకోరాదని, దీంతో సీతమ్మ ప్రాజెక్టు కింద 70 టీఎంసీలు, సమ్మక్క కింద 50 టీఎంసీలు, దేవాదుల కింద 38 టీఎంసీలు కలుపుకొని 158 టీఎంసీల అవసరాలున్నాయని, ఆ హక్కులకు రక్షణ కల్పించాలని కోరారు. జీసీ లింక్ కాలువలు, టన్నెళ్ల నిర్మాణ మార్గంలో రెండు పంటలు పండే భూములున్నాయని, వాటిని ఇచ్చేందుకు రైతులు ముందుకు రాకపోవచ్చని, కాబట్టి సమ్మక్క బరాజ్‌కు చెందిన కన్వేయర్ సిస్టమ్‌నే వాడుకోవాలని తెలంగాణ ప్రతిపాదించింది. కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ పూర్తయి నీటివాటాలు, ఆపరేషనల్ ప్రొటోకాల్ తేలిన తర్వాతే నాగార్జునసాగర్ రిజర్వాయర్‌ను జీసీ లింక్‌కు వినియోగించుకోవాలని కేంద్రానికి స్పష్టంచేశారు. జీసీ లింక్ ఎంవోఏపై సంతకాల గురించి తొందరవద్దని సూచించారు. ఛత్తీస్‌గఢ్ వాడుకోని వాటాను జీసీ లింక్‌లో తరలిస్తున్న నేపథ్యంలో ముందుగా ఆ రాష్ట్ర సమ్మతి తీసుకోవాలని, సమ్మక్క బరాజ్ ఎత్తును 87 మీటర్లకు పెంచుకునేందుకు కాన్సంట్ పొందాలని స్పష్టంచేశారు. తెలంగాణ అభ్యంతరాలపై అధ్యయనం చేస్తామని, ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భూపాల్‌సింగ్ వెల్లడించారు. గోదావరి-కావేరి లింక్‌లో 50 శాతం వాటాపై పట్టు సడలించాలని, సాధ్యమైనంత మేర తెలంగాణకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వలకు 431.30కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): గౌరవెల్లి ప్రాజెక్ట్ కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం రూ.431.30 కోట్లతో పరిపాలన అనుమతులిస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. రిజర్వాయర్ నిర్మాణం ఇప్పటికే పూర్తికాగా దీనిద్వారా హుస్నాబాద్, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని 1,06,000 ఎకరాలకు నీరందించాల్సి ఉన్నది. రిజర్వాయర్ నుంచి 47.75 కిలోమీటర్ల ఎడమ కాల్వ నిర్మించాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎస్సారెస్పీ-ఇందిరమ్మ వరద కాల్వ ప్యాకేజీ నంబర్7 మిగిలిన పనుల కోసం రూ.431.30 కోట్లు తాజాగా విడుదల చేసింది.

5 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏఈ



చెన్నూర్, ఆగస్టు 9: మంచిర్యాల జిల్లా చెన్నూర్ నీటిపారుదల శాఖ ఏఈ జాడి చేతన్ రూ.5 వేల లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీకి చిక్కారు. చెన్నూర్ మండలం కిష్టంపేట బొమ్మ చంద్రశేఖర్‌రెడ్డి 2016-17లో మిషన్ కాకతీయలో దుగ్నెపల్లి సాలేకుంట పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈఎండీ, ఎఫ్‌ఎస్‌డీ బిల్లుల చెల్లింపుల కోసం ఎంబీ సమర్పించేందుకు ఏఈ చేతన్ రూ.5 వేలు డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. చెన్నూర్ కార్యాలయంలో చంద్రశేఖర్‌రెడ్డి నుంచి ఏఈ రూ.5 వేలు తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు.

సిసోడియా విడుదల


- ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్
- 17 నెలల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి
- నియంత్రృత్వానికి చెంపపెట్టు: సిసోడియా
- సత్యమే గెలిచింది: ఆప్ హర్షాతిరేకం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయ్యి, 17 నెలలకు పైగా జైలు జీవితం అనుభవిస్తున్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) కీలక నేత మనీశ్ సిసోడియా ఎట్టకేలకు విడుదలయ్యారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ నమోదు చేసిన కేసుల్లో సిసోడియాకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం సిసోడియా తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. అంతకు ముందు.. రూ.10 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో, ఇద్దరు ష్యూరిటీ తీసుకొని ఆయనను విడుదల చేయాలని కోర్టు జైలు అధికారులను ఆదేశించింది. ఈ సందర్భంగా సిసోడియా తన పాస్‌పోర్ట్‌ను అప్పగించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని, ప్రతీ సోమవారం, గురువారం ఏజెన్సీల అధికారుల ముందు హాజరుకావాలని ధర్మాసనం కొన్ని షరతులు విధించింది. కాగా, ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో కిందటేడాది ఫిబ్రవరి 26న సీబీఐ అధికారులు అప్పుడు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సిసోడియాను అరెస్టు చేశారు. అప్పటినుంచి ఆయన జైలులోనే ఉన్నారు.

ఇప్పటికిప్పుడు డిప్యూటీ సీఎం కాబోరు
సీబీఐ అరెస్టు చేసిన రెండు రోజుల తర్వాత సిసోడియా ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అయితే, తాజాగా సిసోడియా జైలు నుంచి విడుదలైనప్పటికీ, ఇప్పటికిప్పుడు ఆయన డిప్యూటీ సీఎం పదవిని చేపట్టబోరని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సిసోడియా సతీమణి ఆరోగ్యం సరిగా లేదని, ఆమె ఆరోగ్యంపైనే ఆయన ప్రధానంగా దృష్టిసారించనున్నారని పార్టీ నేత ఒకరు తెలిపారు.

సిసోడియాకు ఘన స్వాగతం పలికిన ఆప్ కార్యకర్తలు
17 నెలల జైలు జీవితం తర్వాత శుక్రవారం బయటకు వచ్చిన మనీశ్ సిసోడియాకు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు, ఆయన మద్దతుదారులు ఘనంగా స్వాగతం పలికారు. జైలు వద్దకు భారీగా చేరుకొని సిసోడియా రాగానే భుజాలపై ఆయనను ఎత్తుకున్నారు. డీడీయూ మార్గ్‌లోని ఆప్ కార్యాలయంతో పాటు మనీశ్ సిసోడియా ఇంటి వద్దకు కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు చేరుకొని మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.

నిజం గెలిచింది.. నిజమే గెలుస్తుంది: ఆప్
మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్ట్ బెయిల్ మంజూరు చేయడంపై ఆమ్ ఆద్మీ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఇవాళ నిజం గెలిచిందని, ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని 'ఎక్స్'లో పేర్కొన్నది. భగవంతుడి సన్నిధిలో ఎప్పుడూ న్యాయం ఉంటుందని కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్ పేర్కొన్నారు. బెయిల్ ప్రకటన వచ్చిన వెంటనే 'సత్యమేవ జయతే' అని ఆప్ నేత, ఢిల్లీ విద్యా శాఖ మంత్రి ఆతిశీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ప్రియమైన చిన్నారులారా.. మీ మనీశ్ మావయ్య తిరిగొచ్చారు' అని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బెయిల్ ఇవ్వాలన్న కోర్టు తీర్పు కేంద్రం నియంతృత్వానికి చెంపపెట్టని మరో ఎంపీ సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు.



'ఈ తీర్పు నియంతృత్వానికి పెద్ద చెంపపెట్టు. ఇందుకు నేను సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. ఏ నియంతృత్వ ప్రభుత్వం కూడా అమాయకుడిని జైలులో పెట్టలేదు. నాతో మీరూ బాధను అనుభవించారు. ప్రతి స్కూలు విద్యార్థి నేను బయటకు రావాలని ఎదురుచూశారు. ఈ తీర్పు తర్వాత నేను బాబాసాహెబ్ అంబేద్కర్‌కు రుణపడి ఉన్నట్టు అనిపిస్తున్నది. రాజ్యాంగం ద్వారానే ఈ న్యాయపోరాటానికి తార్కిక ముగింపు దక్కింది'.
–మనీశ్ సిసోడియా

ఆహ్వానించదగ్గ పరిణామం

- మనీశ్ సిసోడియా బెయిల్‌పై కేటీఆర్ స్పందన
- అభియోగాలు మోపి ఎన్నాళ్లు జైల్లో ఉంచుతారు?
- నేరం రుజువు కాకుండా దర్యాప్తు పేరుతో జైల్లో ఉంచడం హక్కులను హరించడమే
- కవిత బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశాం



హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన ఆప్ నేత మనీశ్ సిసోడియాకు బెయిల్ లభించడం ఆహ్వానించదగ్గ పరిణామం అని బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. 17 నెలలుగా మనీశ్ సిసోడియా జైల్లో ఉన్నారని, ఇప్పటివరకూ ఆయనపై మోపిన నేరాభియోగాలను దర్యాప్తు సంస్థలు రుజువు చేయలేకపోయాయని అన్నారు. నేరం రుజువు కాకుండా దర్యాప్తు పేరుతో ఏండ్లకు ఏండ్లు వ్యక్తులను జైల్లో పెట్టడం సరికాదని, దర్యాప్తు ప్రక్రియను వేగంగా ముగించి నిర్దోషులను వదిలేయాలని పేర్కొన్నారు. ఇదొక్క ఢిల్లీ మద్యం కేసు గురించే కాదని.. దేశంలోని అన్ని కేసులకూ ఇది వర్తిస్తుందని అన్నారు. 'జస్టిస్ డిలేయిడ్ ఈజ్ జస్టిస్ డినైయిడ్' అని, ఏండ్లకు ఏండ్లు జైల్లో పెట్టి చివరకు నిర్దోషి అని విడుదల చేస్తే ఉపయోగం ఉండదని పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థలు తమ దర్యాప్తు ప్రక్రియకు కాలపరిమితిని నిర్దేశించుకోవాలని, న్యాయస్థానాలు కూడా కాలపరిమితిని నిర్ధారించి, నిర్దోషులకు ఉపశమనం కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

కవితది రాజకీయ ప్రేరేపిత అరెస్టు
సిసోడియాకు బెయిల్ వచ్చిన నేపథ్యంలో ఇదే కేసులో తన సోదరి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కూడా బెయిల్ వచ్చే అవకాశం ఉందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీ మద్యం కేసులో కవితను అరెస్టు చేయడం కేవలం రాజకీయ ప్రేరేపితమేనని కేటీఆర్ ఆరోపించారు. కవిత బెయిల్ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, సోమవారం లేదా మంగళవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించే అవకాశం ఉందన్నారు. కవిత, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌లకు కూడా త్వరలోనే బెయిల్ వస్తుందని భావిస్తున్నామని, వీరు కూడా అరెస్టు అయ్యి సుదీర్ఘకాలం అవుతున్నదని అన్నారు.

కవిత 11 కిలోల బరువు తగ్గారు..
తాను ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లానని, కవితతో ములాఖాత్ అయ్యానని కేటీఆర్ మీడియా ప్రతినిధులతో చెప్పారు. అయిదు నెలల్లో కవిత 11 కిలోల బరువు తగ్గారని, బీపీతో బాధపడుతున్నారని, ఇతర అరోగ్య ఇబ్బందులు కూడా ఉన్నాయని అన్నారు.

విచారణ ఎప్పుడు పూర్తయితది?

- అప్పటిదాకా నిందితుడు జైల్లో మగ్గాల్సిందేనా?
- చార్జిషీట్ల పేరిట ఇంకెంత కాలయాపన చేస్తారు?
- వేగవంతమైన విచారణ కోరడం నిందితుడి హక్కు
- జైలు నుంచి ఉపశమనం పొందే హక్కూ వాళ్లకుంది
- బెయిల్ ఓ నియమం.. జైలు అనేది మినహాయింపు
- ఇది అందరూ గుర్తించాల్సిన సమయం రానేవచ్చింది
- ఢిల్లీ మద్యం కేసులో ఈడీ, సీబీఐకి సుప్రీం తలంటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియాకు శుక్రవారం బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు.. ఈ కేసు విషయమై ఈడీ, సీబీఐ వైఖరిని తప్పుబట్టింది. ఏదైనా కేసు విషయమై ఏ నిందితుడినీ ఎల్లకాలం జైల్లో ఉంచకూడదని తీవ్ర స్వరంతో హెచ్చరించింది. చార్జిషీట్ల పేరిట కాలయాపన చేస్తున్న ఈడీ, సీబీఐ తీరును ఈ సందర్భంగా ఎండగట్టింది. రెండు ఏజెన్సీల వైఖరితో వేగవంతమైన విచారణ లభించే హక్కును నిందితుడు కోల్పోయాడని ఆగ్రహం వ్యక్తం చేసింది. బెయిల్ అనేది నియమమని, జైలు అనేది మినహాయింపుగా గుర్తించాలంటూ స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం 38 పేజీల తీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది.

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

- ఏ కేసు అయినా కానివ్వండి. నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచకూడదు.
- కేసు విచారణలో పురోగతి లేని సమయంలో లేదా ఒక పరిమితి దాటిన తర్వాత వ్యక్తిని జైల్లో ఉంచడం సరైన చర్య అనిపించుకోదు.
- పైవిషయాలను పక్కనబెట్టి ఆ వ్యక్తిని అలాగే జైల్లో ఉంచాలనుకొంటే.. అది ఆ వ్యక్తి ప్రాథమిక హక్కులను హరించడమే అవుతుంది. వేగవంతమైన విచారణ, స్వేచ్ఛాహక్కు ఎంతో పవిత్రమైనవని గుర్తించాలి.
- బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవడం, జైలు శిక్ష నుంచి ఉపశమనం పొందడం నిందితులకు ఉండే హక్కు.



జస్టిస్ కేవీ విశ్వనాథన్



జస్టిస్ బీఆర్ గవాయ్

- 'బెయిల్ అనేది ఓ నియమం.. జైలు అనేది మినహాయింపు' అనే విషయాన్ని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.
- ఇక, ఈ కేసులో సిసోడియా 17 నెలలకు పైగా జైలు శిక్ష అనుభవిస్తున్నారు. విచారణ ఇంకా మొదలు కాలేదని మీరు (ఈడీ, సీబీఐ) ఇప్పుడు చెప్తున్నారు. ఇది ముమ్మాటికీ.. 'వేగవంతమైన విచారణ కోరే హక్కు'ను ఆ వ్యక్తికి (సిసోడియా) దూరం చేయడమే. ఇది ఒకవిధంగా విచారణ లేకుండానే వ్యక్తిని శిక్షించడమే అవుతుంది.
- కేసు తీవ్రమైనదని, నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దని ఏజెన్సీలు చెప్తున్నాయి. అయితే, కేసు అంత తీవ్రమైనప్పుడు వేగవంతమైన విచారణ ఎందుకు చేయలేదు? త్వరితగతిన విచారణ పూర్తిచేయని మీరు (సీబీఐ, ఈడీ) నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దని చెప్పడం సరికాదు.
- ఈ కేసులో 495 మంది సాక్ష్యులు ఉన్నారని చెప్తున్నారు. లక్షల పేజీల ది డాక్యుమెంట్లు సమర్పించారు. ఇలాంటి సమయంలో మీ (సీబీఐ, ఈడీ) విచారణ ఎప్పుడు పూర్తవుతుంది? ఈ సారంగానికి (కేసు) ముగింపు ఎక్కడ ఉంది? అంతవరకూ నిందితుడు జైల్లోనే ఉండాలా? రాజ్యాంగంలో ఆర్టికల్ 21 ప్రకారం.. ఇది నిందితుడి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కును కాలరాయడమే అవుతుంది.
- ఇప్పటికే ఈ కేసులో అన్ని డాక్యుమెంట్లను, ఆధారాలను సేకరించాం అని చెప్తున్నారు. అలాంటప్పుడు నిందితుడు వాటిని ట్యాంపరింగ్ చేసే అవకాశమే లేదు. పైగా నిందితుడు సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి. షరతులతో కూడిన బెయిల్ ఇస్తే తప్పేంటి?
- (ఈడీ, సీబీఐతో..) ఇంతజరిగాక ఇప్పుడు విచారణ వేగవంతం చేస్తామని చెప్తున్నారు. అనుబంధ చార్జిషీట్ దాఖలుకు మరో నెల సమయం కావాలని జూన్ 4న చెప్పారు. మరో 6–8 నెలల్లో విచారణ పూర్తిచేస్తామని 2023 అక్టోబర్‌లో చెప్పారు. మీ స్టేట్‌మెంట్స్ అన్నీ గందరగోళంగా ఉన్నాయి. చార్జిషీట్ల పేరిట కాలయాపన చేయడమేంటి?
- బెయిల్ కోసం సిసోడియా ట్రయల్ కోర్టుకు వెళ్లాల్సిందిగా మీరు (సీబీఐ, ఈడీ) ఇప్పుడు చెప్తున్నారు. ఇదేమైనా వైకుంఠపాళి (స్నేక్స్ అండ్ లాడర్ గేమ్) ఆటనా? బెయిల్ కోసం ట్రయల్ కోర్టు, ఆ తర్వాత హైకోర్టు.. ఇలా దేశంలో పౌరుడు తన వ్యక్తిగత స్వేచ్ఛా హక్కు కోసం కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకూ తిరుగుతూ ఉండాల్సిందేనా? దీన్ని మేం ఒప్పుకోబోం. అందుకే షరతులతో కూడిన బెయిల్ ఇస్తున్నాం.

ఈడీపై సుప్రీం గరం

ఈడీ వైఖరిపై సుప్రీంకోర్టు గుర్రుగా ఉన్నట్టు అర్థమవుతున్నది. గడిచిన కొద్దిరోజుల్లో జరిగిన కేసుల విచారణే ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. పీఎంఎల్‌ఏ చట్టం పేరిట ఈడీ దుందుడుకు చర్యలను ఇటీవల విమర్శించిన అత్యున్నత ధర్మాసనం.. అదే పీఎంఎల్‌ఏ చట్టం కింద ఈడీ నమోదు చేసిన 5 వేల కేసుల్లో నేరారోపణలు రుజువైనవి 40కి మించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా సిసోడియా బెయిల్ పిటిషన్‌పై ఈడీతో పాటు సీబీఐ వైఖరిని తప్పుబట్టింది.

నీట్ అవసరం ఇక ఉండదా?

- 12వ తరగతి కోసం ఎన్‌సీఈఆర్‌టీ ప్రతిపాదన
- 9, 10, 11 తరగతుల మార్కులూ కలిపే విధానం
- అన్ని బోర్డుల్లోనూ ఒకే తరహా మార్కుల వ్యవస్థ
- కేంద్ర విద్యా శాఖకు పరఖ్ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: దేశంలోని ఏ బోర్డు పరిధిలోనైనా ఒకే తరహా మార్కుల వ్యవస్థ ఉండాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన పరఖ్ (పర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్, రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవెలప్‌మెంట్) అన్ని కేంద్ర, రాష్ట్రాల విద్యా బోర్డులను అధ్యయనం చేసి కేంద్ర విద్యా శాఖకు పలు ప్రతిపాదనలు చేసింది. పరీక్షలు, మార్కుల విధానాన్ని అన్ని బోర్డుల పరిధిలో ఒకే తరహాలో మార్చాలని సూచించింది. 12వ తరగతి ఫలితాల్లో 9, 10, 11వ తరగతి ఫలితాలనూ చేర్చడం ద్వారా విద్యార్థుల ప్రతిభను సరిగ్గా మూల్యాంకనం చేయవచ్చని పేర్కొన్నది. ఇందుకుగానూ 12వ తరగతిలో 9వ తరగతి మార్కులపై 15 శాతం, 10వ తరగతిపై 20 శాతం. 11వ తరగతిపై 25 శాతం వెయిటేజీ ఇవ్వాలని, మిగతా 40 శాతాన్ని 12 తరగతి మార్కుల వెయిటేజీ ఉండాలని ప్రతిపాదించింది. ఈ కొత్త విధానం అమలులోకి వస్తే ఇక నీట్, సీయూఈటీ వంటి పరీక్షల అవసరం ఉండకపోవచ్చని విద్యారంగ నిపుణులు భావిస్తున్నారు.

ఏ బోర్డు అయినా ఒకే వ్యవస్థ
రాష్ట్రాలకు ఆయా రాష్ట్రాలు ఏర్పాటు చేసుకున్న విద్యా బోర్డులతో పాటు జాతీయ స్థాయిలో ఐసీఎస్‌ఈ, సీబీఎస్‌ఈ, ఎన్‌ఐఓఎస్ వంటి బోర్డులు ఉన్నాయి. పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల తయారీ, మార్కుల కేటాయింపు వంటివి ఒక్కో బోర్డులో ఒక్క రకంగా ఉంది. ఈ నేపథ్యంలో వివిధ బోర్డులకు చెందిన దాదాపు 18 వేల ప్రశ్నాపత్నాలను పరఖ్ బృందం అధ్యయనం చేసింది. అన్ని బోర్డుల పరిధిలో ఒకే రకమైన విధానాన్ని తీసుకురావాలని, తద్వారా విద్యార్థులు ఒక బోర్డు పరిధి నుంచి ఇంకో బోర్డు పరిధిలోకి మారడం సులువు అవుతుందని ప్రతిపాదించింది.

నీట్-పీజీ వాయిదా వేయలేం

విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టలేం
పిటిషన్‌ను తిరస్కరించిన సర్వోన్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: నీట్–పీజీ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ నెల 11న జరగనున్న ఈ పరీక్షకు పలువురు అభ్యర్థులకు దూరప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారని పేర్కొంటూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం తిరస్కరించింది. 'ఇలాంటి పరీక్షను మేము ఎలా వాయిదా వేయగలం. ఈ రోజుల్లో కొందరు కేవలం పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ వస్తున్నారు. మేము విద్యా సంబంధ నిపుణులం కాదు. ఈ పరీక్ష షెడ్యూల్‌ను మార్చలేం. పరీక్షను వాయిదా వేస్తే వారాంతంలో రెండు లక్షల మంది విద్యార్థులు, నాలుగు లక్షల మంది తల్లిదండ్రులు రోదించాల్సి వస్తుంది. ఇంతమంది అభ్యర్థుల కెరీర్‌ను ప్రమాదంలో పెట్టలేం. ఈ పిటిషన్ల వెనుక ఎవరున్నారో మాకు తెలియదు' అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, ఈ పరీక్ష జూన్ 23న జరగాల్సి ఉండగా, పోటీ పరీక్షల్లో అక్రమాల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా కేంద్ర వైద్య శాఖ పరీక్షను వాయిదా వేసింది.

'హిజాబ్‌పై నిషేధం సరికాదు'

న్యూఢిల్లీ: కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థినులు హిజాబ్, బురఖా, టోపీ, నఖాబ్ వంటి వాటిని ధరించడంపై నిషేధం విధిస్తూ ముంబైలోని ఓ కళాశాల ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే విధించింది. విద్యాసంస్థలు నిబంధనలను వాటి ఇష్టానుసారం విద్యార్థులపై బలవంతం చేయకూడదని, ఏ దుస్తులు ధరించాలనే విషయంలో విద్యార్థినులకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజీవ్ కుమార్ ధర్మాసనం స్పష్టం చేసింది. విద్యార్థుల మతపరమైన విశ్వాసాలు బయటకు తెలియకుండా ఉండాలని భావిస్తే నుదుటన బొట్టు లేదా తిలకం పెట్టుకోవడంపై ఎందుకు నిషేధం విధించలేదని ప్రశ్నించింది. అయితే తరగతి గదిలో విద్యార్థినులు బురఖా ధరించడాన్ని అనుమతించకూడదని స్పష్టం చేసింది.

క్రిమీలేయర్‌కు కేంద్రం 'నో'

- రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు క్రిమీలేయర్ అనే నియమం లేదు
- రాజ్యాంగం మేరకే నడుచుకోవాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం



న్యూఢిల్లీ, ఆగస్టు 9: రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లో క్రిమీలేయర్ నియమం లేదని కేంద్ర మంత్రివర్గం శుక్రవారం స్పష్టం చేసింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లలో క్రిమీలేయర్ విధానం ఉండాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పులో చేసిన సూచనలపై శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగినట్టు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాజ్యాంగ నిబంధనలకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ విషయంలో రాజ్యాంగం మేరకు ప్రభుత్వం నడుచుకుంటుందని స్పష్టం చేశారు.

పలు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం
దేశంలో రూ.24,657 కోట్ల అంచనాతో ఎనిమిది రైల్వే ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపినట్టు అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహ ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 14 జిల్లాల పరిధిలో ఈ ప్రాజెక్టులు వస్తాయని, 900 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ వస్తుందని తెలిపారు.

'పీఎంఏవై–జీ'కి ఆమోదం
గ్రామీణ ప్రాంతాల్లో రానున్న ఐదేండ్లలో రెండు కోట్ల ఇండ్లు నిర్మించాలనే లక్ష్యంతో చేపట్టనున్న ప్రధానమంత్రి అవాస్ యోజన – గ్రామీణ(పీఎంఏవై–జీ) పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కాగా, దేశంలో ఉద్యాన రంగాన్ని పెంపొందించేందుకు రూ.1,766 కోట్ల వ్యయంతో క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్(సీపీపీ)ను క్యాబినెట్ ఆమోదించింది.

క్రిమీలేయర్‌పై ప్రధానితో బీజేపీ ఎంపీల భేటీ
ఎస్సీ, ఎస్టీలలో క్రిమీలేయర్ గుర్తింపునకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవలి వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ ఎంపీల బృందం శుక్రవారం ప్రధాని మోదీతో సమావేశమైంది. ఈ సందర్భంగా ఎంపీలు క్రిమీలేయర్ అంశంపై మోదీ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీల్లో కూడా క్రిమీలేయర్‌ను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఒక పాలసీని రూపొందించాలని, తద్వారా వారికి రిజర్వేషన్ల లబ్ధి నిరాకరించాలని ఈ నెల 1న జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్న విషయం తెలిసిందే. మోదీతో భేటీ అనంతరం బీజేపీ రాజ్యసభ ఎంపీ సికందర్ కుమార్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై తాము ఆందోళన వ్యక్తం చేస్తున్నామని, దీనిపై ప్రజల నుంచి కూడా తమకు ఫోన్లు వస్తున్నాయని తెలిపారు. న్యాయస్థానం వ్యాఖ్యలను ప్రభుత్వం అమలు చేయబోదని ప్రధాని మోదీ తమకు హామీ ఇచ్చారని వెల్లడించారు.

ధన్‌కర్ వర్సెస్ జయాబచ్చన్

- పేరు విషయంలో మరోసారి వాగ్వాదం
- 'టోన్' ఆమోదనీయంగా లేదన్న ఎంపీ
- 'ఇక చాలు' అని ఆగ్రహించిన చైర్మన్





న్యూఢిల్లీ: రాజ్యసభలో శుక్రవారం చైర్మన్ జగదీప్ ధన్‌కర్, ఎంపీ జయాబచ్చన్ మధ్య పేరు విషయంలో మరోసారి వాగ్వాదం చోటుచేసుకొన్నది. కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేపై బీజేపీ ఎంపీ ఘనశ్యామ్ తివారీ చేసిన వ్యాఖ్యలపై చైర్మన్, విపక్ష సభ్యుల మధ్య చర్చ జరుగుతున్న క్రమంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయాబచ్చన్ మాట్లాడేందుకు అవకాశం కోరారు. దీనికి చైర్మన్ ధన్‌కర్ అనుమతిస్తూ 'జయా అమితాబ్ బచ్చన్ మీ పాయింట్ ఏంటో చెప్పండి' అని అన్నారు. తనను జయా అమితాబ్ బచ్చన్ అని సంబోధించడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నేను జయా అమితాబ్ బచ్చన్‌ను ఒకటి చెప్పాలని అనుకొంటున్నా.. మీ గొంతు టోన్ ఆమోదనీయంగా లేదు. నేను ఒక ఆర్టిస్టును. బాడీ లాంగ్వేజ్, వ్యక్తీకరణలను నేను అర్థం చేసుకోగలను' అంటూ మాట్లాడుతుండగా జోక్యం చేసుకొన్న చైర్మన్ ధన్‌కర్ 'ఇక చాలు' అని అన్నారు. 'మీరు సెలబ్రిటీ కావొచ్చు లేదా మరెవరైనా కావొచ్చు. మీరు మంచి ప్రవర్తనను పాటించాల్సిందే' అని పేర్కొన్నారు. జయాబచ్చన్ ఒక సీనియర్ ఎంపీ అని, చైర్మన్ ఆమెను ఒక సెలబ్రిటీ అని ఎలా పిలుస్తారని విపక్ష పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ధన్‌కర్, జయాబచ్చన్ మధ్య వాగ్వాదం తర్వాత ప్రతిపక్ష పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయి. గత 10 రోజుల వ్యవధిలో ఆమె పేరు విషయంలో వాగ్వాదం జరగడం ఇది మూడోసారి.

పార్లమెంట్ నిరవధిక వాయిదా

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. లోక్‌సభ, రాజ్యసభలను స్పీకర్, చైర్మన్‌ను నిరవధిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 12 వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగాల్సి ఉండగా, మూడు రోజుల ముందుగానే నిరవధికంగా వాయిదా పడటం గమనార్హం. ఈ సమావేశాల్లో వక్ఫ్ చట్టం–1995ను సవరిస్తూ కేంద్రం ఓ బిల్లును ప్రవేశపెట్టడంపై వివాదం రేగిన విషయం తెలిసిందే.

ఉపరాష్ట్రపతిపై అభిశంసన తీర్మానం?

ఉప రాష్ట్రపతిగా జగదీప్ ధన్‌కర్‌ను తొలగించేలా అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్ష ఇండియా కూటమి పార్టీలు యోచిస్తున్నాయి. ఇందుకు సంబంధించి నోటీసు సమర్పించే సమయంపై పార్టీలు చర్చించనున్నాయని, తీర్మానం ఆమోదం పొందకపోయినప్పటికీ, సభలో చైర్మన్ ధనకర్ పక్షపాత తీరును హైలెట్ చేసినట్టు అవుతుందని భావిస్తున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. విపక్ష నేతల మైక్‌ను పదేపదే కట్ చేస్తున్నారని, రూల్స్‌కు అనుగుణంగా సభ నడవడం లేదని విపక్ష పార్టీలు అంటున్నాయి.

గుడ్ మార్నింగ్ బదులు జై హింద్

స్వాతంత్య్ర దినోత్సవం నుంచి హర్యానా స్కూళ్లలో అమలు

చండీగఢ్, ఆగస్టు 9: ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నుంచి హర్యానాలోని పాఠశాలల్లో 'గుడ్ మార్నింగ్' బదులు 'జై హింద్' చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయభావాన్ని పెంపొందించేందుకు ఈ చర్య చేపట్టినట్టు తెలిపింది. దేశ స్వాతంత్ర్య సమరంలో సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన జై హింద్ పిలుపును ఆ తర్వాతి కాలంలో సైనిక దళాలు నమస్కారంగా(సెల్యూట్) స్వీకరించాయని పాఠశాల విద్యా విభాగం తెలిపింది. గుడ్ మార్నింగ్ బదులు జై హింద్ అనడం వల్ల విద్యార్థులు ప్రతి రోజూ జాతీయ సమైక్యతతో స్ఫూర్తి పొందుతారని, దేశ ఘన చరిత్రను గౌరవిస్తారని వెల్లడించింది. 'దేశ అభివృద్ధికి కృషి చేసేలా యువ భారతీయులకు 'జై హింద్' స్ఫూర్తి కలిగిస్తుంది' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

ట్రావెల్ ఏజెంట్లతో జాగ్రత్త

- ప్రవాస భారతీయులకు న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం హెచ్చరిక



న్యూయార్క్: అమెరికాలోని ప్రవాస భారతీయులు మోసపూరిత ట్రావెల్ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం హెచ్చరించింది. ఈ మేరకు కాన్సుల్ జనరల్ బినయ ప్రధాన్ ఒక ప్రకటన జారీ చేశారు. రాయబార కార్యాలయం నుంచి పొందే సేవలకు గానూ కొందరు ట్రావెల్ ఏజెంట్లు విపరీతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, ప్రజల నమ్మకాన్ని వీరు వమ్ము చేస్తున్నారని పేర్కొన్నారు. ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డులు, వీసాలు, పాస్‌పోర్టులు, ఎమర్జెన్సీ సర్టిఫికెట్లు ఇప్పించేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారని తెలిపారు. ఉదాహరణకు, ఎమర్జెన్సీ సర్టిఫికెట్ కోసం రాయబార కార్యాలయం 17 డాలర్లు తీసుకుంటుండగా, కొందరు ట్రావెల్ ఏజెంట్లు 450 డాలర్ల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కొందరు ట్రావెల్ ఏజెంట్లు కాన్సులేట్ నుంచి సేవలు ఇప్పించేందుకు నకిలీ డాక్యుమెంట్లు సమర్పిస్తున్నారని తెలిపారు. గుర్తింపు, నివాస ధ్రువీకరణ, యుటిలిటీ బిల్లులకు సంబంధించి దరఖాస్తుదారుల తరపున, వారికి తెలియకుండా నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారని చెప్పారు. వీటి వల్ల దరఖాస్తుదారులు అమెరికాలో న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొనే ముప్పు ఉందని తెలిపారు.

నేరుగా కార్యాలయానికే రావొచ్చు
రాయబార కార్యాలయం నుంచి అందే సేవల కోసం ట్రావెల్ ఏజెంట్లను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, నేరుగా కార్యాలయానికి వచ్చి సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ–వీసా సేవలకు సంబంధించి కూడా 140కి పైగా నకిలీ వెబ్‌సైట్‌లను గుర్తించామని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రవాస భారతీయులకు సూచించారు. అమెరికాలోని భారతీయ విద్యార్థులకు సులభంగా సేవలు అందించేందుకు ప్రమిత్, భారతి చాట్‌బోట్ వంటి టూల్స్‌తో పాటు మొబైల్ యాప్ అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు, న్యాయ, వైద్య సమాచారం కూడా అందిస్తున్నట్టు చెప్పారు.

యూకేలో తగ్గుతున్న భారతీయ విద్యార్థులు

లండన్, ఆగస్టు 9: కఠినతరమైన వీసా నిబంధనలు, వలసదారులపై ఆందోళనల కారణంగా బ్రిటన్ విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతున్నది. హయ్యర్ ఎడ్యుకేషన్ స్టాటిస్టిక్స్ ఏజెన్సీ (హెచ్‌ఈఎస్‌ఏ) గురువారం విడుదల చేసిన డాటా ప్రకారం 2022–23 విద్యా సంవత్సరంలో మిగిలిన దేశాల విద్యార్థుల కన్నా మనదేశ విద్యార్థులే అధికంగా యూకేకు వెళ్లారు. 2018–19 నుంచి చూస్తే మొత్తం మీద భారత విద్యార్థుల సంఖ్య 1,45,650కి పెరిగింది. అయితే ఇటీవల వలసదారులను వ్యతిరేకిస్తూ ఆ దేశంలో జరుగుతున్న ఆందోళనలు, హింస కారణంగా విద్యార్థులకు ఆ దేశంపై ఆసక్తి తగ్గింది. నిపుణులైన ఉద్యోగులు, విద్యార్థులు వీసాల కోసం చేసే దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గిందని తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి. స్టూడెంట్ వీసాల సంఖ్య 16 శాతం, డిపెండెంట్ వీసా దరఖాస్తులు 81% తగ్గినట్టు ఆ లెక్కలు వెల్లడించాయి.

నిధుల్లేకుండా స్వచ్ఛత ఎట్లా..?

- తూతూ మంత్రంగా 'స్వచ్ఛదనం పచ్చదనం'
- అంతంతమాత్రంగా ప్రజాప్రతినిధులు హాజరు
- అప్పులపాలవుతున్న పంచాయతీ కార్యదర్శులు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం పచ్చదనం' మొక్కుబడిగా సాగుతున్నది. కనీస స్థాయిలో నిధులు విడుదల చేయకుండా పనులు ఎలా సాధ్యమని గ్రామ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా పాల్గొనడం లేదని విశ్లేషకులు విమర్శలు చేస్తున్నారు. గతంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు కచ్చితంగా నిధులు విడుదల చేసిన తరువాతే కార్యక్రమానికి శ్రీకారం చుట్టేవారని గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవేవీ పట్టించుకోకుండా ప్రతిపక్షాల విమర్శలకు తలొగ్గి మొక్కుబడిగా కార్యక్రమాన్ని ప్రకటించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్వచ్ఛదనం పచ్చదనం ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించాలని నిర్ణయించారు. పలు పారిశుధ్య పనులు, ఇంకుడు గుంతల నిర్మాణం ప్రధాన ఎజెండాగా కార్యక్రమాన్ని రూపొందించారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనేందుకూ డబ్బులు విడుదల చేయలేదని మాజీ ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు విమర్శిస్తున్నారు.

అప్పుల పాలైన కార్యదర్శులు

ఒక్కో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇప్పటికే లక్షల్లో అప్పుల పాలై ఉన్నారని, అదనం గా డబ్బులు పెట్టే పరిస్థితి లేదని చెప్పారు. త మ కుటుంబాలు గడవటమే కష్టంగా ఉందని, ఇంకెక్కడినుంచి డబ్బులు తేవాలని పంచాయతీ కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. అనేక మంది కార్యదర్శులు గతంలో పనిచేసిన పంచాయతీల నుంచి బదిలీ అయ్యామని, పాత పంచాయతీలో పెట్టిన డబ్బులు వస్తా యా? రావా? అనే ఆందోళనలో ఉన్నారు. కొత్త పం చాయతీలో డబ్బులు పెడితే వస్తాయో? రా వో?అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులన్నీ చేయకపోతే అధికారులు మెమోలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

హరితహారంతో అటవీ విస్తీర్ణం వృద్ధి

- రాజ్యసభ సాక్షిగా వెల్లడించిన కేంద్రప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హయాంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన 'హరితహారం' కార్యక్రమం వల్ల రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించింది. గత పదేండ్లలో దేశవ్యాప్తంగా 1,700 చదరపు కిలోమీటర్ల అటవీ భూమి తగ్గినప్పటికీ తెలంగాణలో 647 చ.కి.మీ. పచ్చదనం పెరిగినట్టు ప్రకటించింది. 2015 జూలైలో ప్రారంభమైన హరితహారంలో భాగంగా 9 విడతల్లో మొత్తం 273.33 కోట్ల మొక్కలను నాటారు. ఇందుకోసం ప్రభుత్వం తొమ్మిదేండ్లలో దాదాపు రూ.10,822 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 14,864 నర్సరీలు, 13,657 ఎకరాల్లో 19,472 పల్లె ప్రకృతి వనాలు, 6,298 ఎకరాల్లో 2,011 బృహత్ ప్రకృతి వనాలు, 1,00,691 కి.మీ. రహదారి వనాలు ఏర్పాటు చేసింది.



మెట్రో నగరాల్లో హైదరాబాద్ టాప్

అటవీ విస్తీర్ణాన్ని పెంచుకున్న మెట్రో నగరాల జాబితాలో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచినట్టు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2019- 2021 మధ్య అటవీ విస్తీర్ణం ఎక్కువగా పెరిగిన రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ (647 చ.కి.మీ.), తెలంగాణ (632 చ.కి.మీ.), ఒడిశా (537 చ.కి.మీ.) వరుస స్థానాల్లో నిలిచాయి.

హరితహారానికి గుర్తింపు, అవార్డులు

- ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ 2020, 2021లో హైదరాబాద్‌ను 'ట్రీ సిటీ ఆఫ్ ద వరల్డ్'గా గుర్తించి అర్బన్ డే ఫౌండేషన్ అవార్డు ప్రదానం చేసింది.
- నీతి ఆయోగ్ సమీకృత అభివృద్ధి లక్ష్యాల సూచీల్లో (2020- 21) అడవుల పెంపు విభాగంలో ప్రథమ స్థానం.
- 2022లో ఐఏహెచ్‌పీ హైదరాబాద్‌కు 'వరల్డ్ గ్రీన్ సిటీ' అవార్డు ఇచ్చింది.
- వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) నిర్వహించిన 'సిటీ నేచర్ చాలెంజ్-2023లో హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచి, అత్యధిక జీవ వైవిధ్య నగరంగా గుర్తింపు పొందింది.
- పచ్చదనం పెంపులో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉన్నట్టు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ (సీఎస్ఈ) సంస్థ వెల్లడించింది.

హరితహారం కొనసాగించాలి



భారత్‌లో గత దశాబ్ద కాలంగా 1,700 చ.కి.మీ. అటవీ భూమి తగ్గినప్పటికీ తెలంగాణలో పచ్చదనం గణనీయంగా పెరిగింది. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన హరితహారం కార్యక్రమం విజయవంతమైందనడానికి ఇదే నిదర్శనం. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆశిస్తున్నా.

-సంతోష్ కుమార్, మాజీ ఎంపీ

- ప్రధాని మోదీకి మందకృష్ణ కృతజ్ఞతలు



ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మోదీ మందకృష్ణను ఆలింగనం చేసుకున్నారు.

ఎక్సైజ్‌శాఖలో కమీషన్ దందా

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిరోజూ కోట్లాది రూపాయలను అందించే ప్రధాన ఆదాయ వనరుల్లో అబ్కారీ శాఖ ముఖ్యమైనది. ఈ శాఖలో డబ్బుల గలగలపై కొన్ని కమీషన్‌రాయుళ్ల కండ్లు పడ్డాయి. కొత్త ప్రభుత్వంలో అక్రమార్జనపై దృష్టిపెట్టిన కొందరు ఆ శాఖలో అడుగుపెట్టిన దగ్గర్నుంచి.. 'పెండింగ్ బిల్లులకు పేమెంట్ చెయ్యాలా? అయితే మరి మాకేంటి?' అంటూ డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్ క్లియరెన్స్‌కు పేమెంట్ ఇవ్వాల్సిన దుస్థితి దాపురించింది.

- ముడుపులు ఇచ్చే సప్లయర్స్‌కే పేమెంట్?
- 5 నుంచి 10 శాతం వరకు కమీషన్!
- ఎంత త్వరగా ఇస్తే.. అంత త్వరగా పేమెంట్?
- రూ.6 వేల కోట్ల వరకు సప్లయర్స్‌కు బాకీ

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ పేమెంట్లు ఆపకుండా.. రెగ్యులర్‌గా డబ్బులు రావాలంటే ఆ సప్లయర్స్ కొత్తగా కమీషన్ ఇచ్చుకోవల్సి వస్తుంది. వాళ్ల పెండింగ్ అమౌంట్‌ను బట్టి కమీషన్ ధర ఫిక్స్ చేస్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా అబ్కారీశాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపులలో 'కమీషన్' అనే పదం వినిపిస్తుండటంతో సప్లయర్స్ కంగుతింటున్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని మద్యం వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. పెండింగ్ బిల్లులు రావాలంటే ఎంతోకొంత ఇవ్వాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. ఈ నయా దందా రికార్డుల ప్రకారం అంతా సక్రమంగానే జరిగినా.. బయట మాట్లాడుకునే కమీషన్‌పైనే ఆధారపడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మద్యం కృత్రిమ కొరత వ్యవహారం బయటికి పొక్కడంతో.. ఈ కమీషన్ దందాకు తెరలేపారని వ్యాపారులు చెబుతున్నారు.

ఇదీ ఆ కమీషన్ కహానీ..!

మద్యం సరఫరా చేసే సంస్థల నుంచి డబ్బులు చెల్లించి ప్రభుత్వం మద్యం తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈ డబ్బును చెల్లించేందుకు 45 రోజుల వరకు గడువు ఉంటుంది. కొత్త ప్రభుత్వానికి సంక్షేమ పథకాలు అమలుకు డబ్బులు అవసరం ఉండటంతో.. ఎక్సైజ్‌శాఖ నుంచి వచ్చే డబ్బులను ఆయా పథకాలకు మళ్లించింది. దీంతో మద్యం సప్లయర్స్‌కు చెల్లించాల్సిన బకాయిలు పెరిగిపోయాయి. ప్రభుత్వం ఎలాగైనా డబ్బులు చెల్లిస్తుందనే నమ్మకంతోనే సప్లయర్స్ మద్యం సరఫరా చేస్తున్నారు. ఇప్పుడా బకాయిలు సుమారు రూ.6వేల కోట్ల వరకు ఉన్నట్టు తెలిసింది. ఈ బకాయిల క్లియరెన్స్‌పై కొందరు ప్రభుత్వ పెద్దల కన్ను పడిందని వ్యాపారులు చెబుతున్నారు. ఏ సప్లయర్స్ అయితే తమతో సఖ్యతగా ఉండి, అడిగినంత కమీషన్ ఇస్తారో.. వారికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులను చెల్లిస్తున్నట్లు మిగతా వ్యాపారులు వాపోతున్నారు. కమీషన్ ఇవ్వని వ్యాపారులకు చెల్లింపులు ఆపుతున్నారని వాపోతున్నారు.

5 నుంచి 10 శాతం కమీషన్..

ఎక్సైజ్‌శాఖకు మద్యం సరఫరా చేస్తున్న సప్లయర్స్ వారి పెండింగ్ బిల్లును బట్టి.. సుమారు 5 నుంచి 10శాతం వరకు కమీషన్ ఇవ్వాల్సి వస్తుందని అంటున్నారు. లేకపోతే.. 'ప్రభుత్వం ఇంకా డబ్బులు విడుదల చేయలేదు. రాగానే మీకు చేస్తాం' అంటూ కొందరిని పెండింగ్‌లోనే పెడుతున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల లోంచి ప్రభుత్వం ప్రతినెలా సప్లయర్స్‌కు రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు చెల్లిస్తున్నది. ఆయా సప్లయర్ పెండింగ్ బిల్లును బట్టి కమీషన్ అంటే.. దీంట్లోనుంచే కోట్లాది రూపాయలను తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఈ ఏడాది మే నాటికి రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి సుమారు రూ.3వేల కోట్ల వరకు పెండింగ్ బకాయిల చెల్లింపులకు నిధులు విడుదలైనట్టు సమాచారం. మే నాటికి సుమారు రూ.1500 కోట్లను ఆయా సప్లయర్స్‌కు చెల్లించినట్టు తెలిసింది. వీటిల్లో ఎంత కమీషన్ ప్రభుత్వ పెద్దలకు చేరిందో.. ఆ పెరుమాళ్లకే ఎరుక అంటున్నారు సప్లయర్స్.

గిరిపుత్రులది కపటం లేని ఆత్మీయత

కేటీఆర్ శుభాకాంక్షలు



హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. 'కల్లా కపటం లేనిత నం.. ఆత్మీయతల్లో అమ్మగుణం.. గి రులనే నివాసాలుగా మలుచుకొని.. ప్రకృతితో మమేకమైన జీవనం గడిపే అడవిబిడ్డలకు.. హృదయపూర్వకంగా అంతర్జాతీయ గిరిజన దినోత్సవ శు భాకాంక్షలు' అంటూ ట్వీట్ చేశారు. కొండకోనల్లోని ఆవాసాలకు.. మిషన్ భగీరథతో జలాలు అందించిన ఘన త కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. 'పోడు భూముల గోడును మాత్రమే తీర్చలేదు.. రైతుబంధును అందించడం తో ఆగలేదు.. రాష్ట్ర రాజధానిలో ఆత్మగౌరవ భవనాలు.. గిరిబిడ్డల అస్థిత్వానికి ప్రతీకలు.. అడవి బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే సంకల్పం.. చరిత్రలో చెరగని సంతకం' అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల ప్రస్థా నం.. వారి అభ్యున్నతిలో సువర్ణ అధ్యాయం' అని ట్వీట్ చేశారు.

ఆదివాసీల కలను నిజం చేసిన ఘనత కేసీఆర్‌దే

- 10 శాతం రిజర్వేషన్లు అమలు చేశాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఆదివాసీ గిరిజనుల కలను సాకారం చేసిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. గిరిజన బిడ్డల దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చారని తెలిపారు. 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం' సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'విధ్వంసపు దారుల నుంచి వికసిత తోవలు. మోడువారిన బతుకుల్లో మోదుగు పూల పరిమళాలు' అని ఆదివాసీ గిరిజనుల కోసం కేసీఆర్ సర్కార్ చేసిన ప్రయత్నాలను అభివర్ణించారు. 'మావ నాటే మావ రాజ్... మా తండాలో మా రాజ్యం' అనే ప్రజాస్వామిక ఆకాంక్షను సాకారం చేస్తూ 3146 గూడేలను, తండాలను పంచాయతీలుగా చేశారని గుర్తు చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో గిరిజనుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారని, 'జల్..జంగల్.. జమీన్' నిజం చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఉదహరించారు.

గిరిజన చట్టాలకు కేంద్రం తూట్లు

- రాష్ట్ర మంత్రి సీతక్క ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): గిరిజన చట్టాలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్‌లోని కుమ్రంభీం ఆదివాసీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టాన్ని కేంద్రం గతేడాది సవరించి నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు. గ్రామసభల అనుమతులు లేకుండానే ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో యథేచ్ఛగా మైనింగ్ చేసేలా కేంద్రం చట్ట సవరణ చేయటాన్ని ఆమె తప్పుబట్టారు. ఈ ప్రయత్నాలను అడ్డుకునేందుకు కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ తనకు 8 మంది అక్కాచెల్లెండ్లు ఉన్నారని, సీతక్క తొమ్మిదో సోదరి అని పేర్కొన్నారు. పలువురిని సన్మానించారు.

కోర్టులో చూసుకోండి

- జీవో ప్రకారమే నడుచుకోండి
- మీరు హరీశ్‌రావును కలిశారు కదా?
- జీవో 33లో మార్పులు కోరిన
- తల్లిదండ్రులపై మంత్రి దామోదర ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): జీవో-33లో మార్పులు చేయాలని కోరేందుకు వెళ్లిన తమపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తంచేశారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. శుక్రవారం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లో కలిశారు. తమ పిల్లలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతిపక్ష నేతలను కలుస్తారా? అని తమపై కసురుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఓ ఆడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. 'మీరు హరీశ్‌రావును కలిశారు కదా, విమర్శిస్తున్నారు కదా.. జీవో ప్రకారం నడుచుకోండి, ఏదైనా ఉంటే కోర్టులో చూసుకోండి' అని సీరియస్‌గా మాట్లాడారని పేర్కొన్నారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో లేరని, రాగానే ఆయనతో మాట్లాడుతానని చెప్పి పంపించారని తెలిపారు.

జీవో 33ను రద్దు చేయాలి

జీవో 33ను రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ శుక్రవారం డిమాండ్ చేశారు. స్థానికత నిర్ధారణ ప్రక్రియలో చేసిన మార్పు కారణంగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, స్వరాష్ట్రంలోని విద్యార్థులే స్థానికేతరులుగా మారే దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర సరిహద్దుల్లోని జిల్లాలకు చెందిన విద్యార్థులు వారికి ఉన్న వెసులుబాటు, ఇతర కారణాలవల్ల పక్క రాష్ట్రంలో ఇంటర్ పూర్తి చేసి, తిరిగి మన ప్రాంతానికి వచ్చి వైద్య విద్యను అభ్యసించాలనుకుంటారని చెప్పారు. జీవో 33తో వారంతా స్థానికతను కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులకు న్యాయం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జీవో-46పై ప్రభుత్వాన్ని వదలం

- పోరాటం చేస్తున్న అభ్యర్థులకు అండగా ఉంటాం
- జీవో 46 బాధిత అభ్యర్థులకు కేటీఆర్ అభయం

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విధంగా జీవో-46 అభ్యర్థులకు న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరుతూ జీవో-46 అభ్యర్థులు శుక్రవారం కేటీఆర్‌ను నందినగర్‌లోని నివాసంలో కలిశారు. ఎన్నికలకు ముందు జీవో-46ను రద్దు చేస్తామని నమ్మబలికితే కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు సహకరించామని, అయితే ఆ పార్టీ నాయకులు గెలిచిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యాత్మకంగా మారిన జీవో-46 అంశంపై తాను గతంలో సీఎస్‌తో మాట్లాడిన విషయాన్ని కేటీఆర్ వారికి గుర్తుచేశారు. ఇందుకోసం బీఆర్‌ఎస్ నుంచి కావాల్సిన సహకారాన్ని అందిస్తామని అభయమిచ్చారు. ఈ విషయంలో తమ పార్టీ నాయకులు గత కొన్ని రోజులుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కోర్టు కేసుల పేరు చెప్పి తప్పించుకుంటూ అభ్యర్థులకు అన్యాయం చేసే ప్రయత్నం మంచిదికాదని హితవు పలికారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ విషయంపై ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ధైర్యమిచ్చిన కేటీఆర్‌కు అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జీవో-46 వల్ల తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి చేపట్టే ఉద్యోగ నియామకాలతోపాటు తొమ్మిది శాఖల ఉద్యోగాల భర్తీలో గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు నష్టం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

జీవో46పై విచారణకు 25 సార్లు డుమ్మా?

- వరస వాయిదాలు కోరుతున్న అడ్వకేట్ జనరల్
- 25 వాయిదాలతో విచారణ మళ్లీ వాయిదా
- 19న తప్పనిసరిగా హాజరుకావాల్సిందేన్న కోర్టు
- మా సమస్యను త్వరగా పరిష్కరించండి
- ముఖ్యమంత్రికి కానిస్టేబుల్ అభ్యర్థుల వినతి

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి రాగానే 46 జీవోను రద్దు చేసి, కానిస్టేబుల్ పరీక్షల్లో మెరిట్ సాధించిన వారికి న్యాయం చేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తక్షణం అడ్వకేట్ జనరల్‌ను హైకోర్టుకు పంపి, తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కానిస్టేబుల్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. మెరిట్ వచ్చిన తమకు లేనిపోని ఆశలు కల్పించి.. ఉద్యమించేలా చేసి, తీరా కేసు హైకోర్టుకి రావడంతో ప్రభుత్వ పెద్దలు తప్పించుకొని తిరగడం ఏమాత్రం భావ్యంగా లేదని వాపోతున్నారు. ఎమ్మెల్యేల అనర్హత కేసులో హైకోర్టుకు హాజరవుతున్న ఏజీ.. వేలాది మంది అభ్యర్థుల భవిత్యాన్ని తేల్చే జీవో 46పై జరిగే వాదనలకు ఎందుకు హాజరు కావడంలేదని ప్రశ్నిస్తున్నారు.

ఈనెల 19న తుది విచారణ..

46 జీవో రద్దుపై హైకోర్టులో ఈనెల 19న తుది వాదనలు జరగనున్నాయని, దానికైనా అడ్వకేట్ జనరల్ వచ్చి ప్రభుత్వం తరపున వాదన ఏంటో స్పష్టంగా చెప్పాలని కానిస్టేబుల్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. 'నిరుద్యోగులు కొట్లాడితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని.. కానీ, ఆ నిరుద్యోగులకు మీ ప్రభుత్వంలో న్యాయం జరగడం లేదు సార్' అంటూ కానిస్టేబుల్ ఉద్యోగార్థులు తీవ్రఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కోర్టులోనే తేల్చుకుందామని, ఇప్పుడు కోర్టుకే న్యాయవాదులను పంపకపోతే మమ్మల్ని మోసం చేసినట్టు కాదా? అని ఆవేదన చెందుతున్నారు. 46 జీవో రద్దు గురించి రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ వేసిందని, అందులోనూ బాధిత జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే ఒక్క ప్రజాప్రతినిధిలేదని కానిస్టేబుల్ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కేవలం రెండు నెలల్లో రిపోర్టు ప్రభుత్వానికి ఇస్తామని చెప్పిన కమిటీ.. ఒక్కసారైనా తమ సమస్య కోసం కూర్చుందా? ప్రభుత్వంతో చర్చించిందా? రిపోర్టు ప్రభుత్వానికి ఇచ్చిందా? అని ప్రశ్నిస్తున్నారు.సబ్ కమిటీ త్వరగా రిపోర్టు ఇస్తే.. దానిని కోర్టులో సమర్పిస్తే.. తదుపరి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఈ విషయంలో ప్రస్తుత ప్రభుత్వం దగ్గర సరైన సమాధానం లేకపోవడంతోనే అడ్వకేట్ జనరల్ వరసగా వాయిదాలు కోరుతున్నారని అంటున్నారు. కోర్టుఫీజులు కట్టుకోలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.

ఇంజినీరింగ్ సీట్ల పెంపుపై ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్

- జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు
- 27 కాలేజీల పిటిషన్లు డిస్మిస్

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపు, కుదింపు, కొత్త కోర్సులకు అనుమతి ఇవ్వడం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. వివిధ కోర్సుల్లో సీట్ల పెంపుపై ప్రభుత్వ నిర్ణయమే అంతిమమని స్పష్టం చేసింది. కాలేజీలకు అనుబంధంగా ఆఫ్ క్యాంపస్‌ల ఏర్పాటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి ఇవ్వాలని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారు. కొత్త కోర్సుల ప్రారంభం, సీట్ల పెంపు, కుదింపు, కోర్సుల విలీనం, రద్దుకు ఉన్నత విద్యాశాఖ అనుమతి ఇవ్వకపోవడంపై 27 ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్లను తిరస్కరించారు.

వీధి కుక్కలా ? క్రూర మృగాలా ?

ఇబ్రహీంపట్నంరూరల్/తెలుగు యూనివర్సిటీ/ మణికొండ/వరంగల్ చౌరస్తా/ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 9 : రాష్ట్రంలో కుక్కల దాడిలో పసిప్రాణాలు రాలిపోతున్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని రాయపోల్‌కు చెందిన శివకుమార్ మాధురి దంపతుల కుమారుడు కియాన్ష్ (4) నెల రోజుల క్రితం వీధికుక్కల దాడిలో గాయపడ్డాడు. వెంటనే నగరంలోని దవాఖానలో చికిత్స చేయించగా వైద్యులు కుట్లువేశారు. ఇన్‌ఫెక్షన్ కారణంగా బాలుడు అనారోగ్యానికి గురికాగా నిలోఫర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నిలోఫర్ ఘటన మరువక ముందే నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట సబితానగర్‌లో మానసిక్థితి సరిగాలేని ఓ బాలుడి మర్మాంగంపై కుక్కలు దాడి చేశాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వలసకూలీలు రాజు, అంజమ్మ దంపతుల పెద్దకుమారుడు భరత్(07) మానసికవైకల్యంతో మంచానికే పరిమితమయ్యాడు. ఇంట్లో మంచంపై పడుకున్న భరత్‌పై వీధికుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా రక్తస్రావం అవుతున్న బాలుడిని నార్సింగిలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా వైద్యులు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం పరిస్థితి కొంతమెరుగ్గా ఉన్నా 48 గంటలు గడిస్తేకానీ చెప్పలేమని వైద్యులు తెలిపారు. వరంగల్ ఎంజీఎంలో మానవత్వం మంటగలిసేలా మూడురోజుల శిశువు మృతదేహాన్ని పోలీసు ఔట్‌పోస్టు పక్కనే గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. శుక్రవారం సాయంత్రం శిశువు మృతదేహాన్ని కుక్కలు పీక్కుతింటుడాన్ని గమనించిన ఔట్ పోస్టు సిబ్బంది విషయాన్ని వైద్యాధికారులు, మట్టెవాడ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎంజీఎం వైద్యాధికారులు మృతదేహాన్ని పరిశీలించి శిశువు వయస్సు మూడు నుంచి నాలుగు రోజులు ఉంటుందని, శిశువు జననం హాస్పిటల్‌లో జరిగినట్టుగా గుర్తించారు. శిశువు మృతదేహాన్ని వస్త్రంలో చుట్టి మార్చురీలో భద్రపరిచారు. శిశువు శరీర భాగాలను కుక్కలు చీల్చడంతో ఆడ, మగ అనే విషయాన్ని కూడా గుర్తించలేని స్థితికి చేరుకుందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని గురువారం ఒకేరోజు ఏడుగురు చిన్నారులపై పిచ్చి కుక్క దాడి చేసింది. శుక్రవారం మరొకరిపై దాడి చేసింది. గ్రామస్థులు కర్రలతో దాడి చేయగా కుక్క మృతి చెందింది.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- భవనం పైనుంచి దూకడంతో తీవ్రగాయాలు
- ములుగు జిల్లా కేంద్రంలో ఘటన

ములుగు, ఆగస్టు 9 (నమస్తేతెలంగాణ): గురుకులం విద్యార్థిని భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకున్నది. ములుగు మండలం జంగాలపల్లికి చెందిన కొయ్యడ కార్తీకశ్రీ గురుకులంలో 9వ తరగతి చదువుతున్నది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో విద్యార్థిని మెట్ల మార్గంలో భవనంపైకి ఎక్కి వెనుక వైపు దూకింది. చుట్టుపక్కల ఇండ్ల యజమానులు చూసి గురుకుల సిబ్బందికి తెలిపారు. చాలా సేపటి తర్వాత సదరు ఉపాధ్యాయినులు వచ్చి గురుకులం లోపలికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. గాయాలతో కదలలేని స్థితిలో ఉన్న బాలికను చూసిన చుట్టుపక్కల వారు దవాఖానకు తీసుకెళ్లాలని గొడవ చేయడంతో ఆటోలో ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు నడుముతోపాటు పక్కటెముకలు విరిగినట్టుగా గుర్తించి, మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు అంబులెన్స్‌లో తరలించగా ఎంజీఎంలో సైతం బెడ్లు ఖాళీ లేకపోవడంతో సుమారు గంటపాటు అంబులెన్స్ స్ట్రెచర్‌పైనే విద్యార్థిని అవస్థ పడినట్టు డ్రైవర్ తెలిపారు. అనంతరం వైద్యులు పరీక్షించి చికిత్స ప్రారంభించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు. కాగా, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులపై పర్యవేక్షణ లోపించడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు పేర్కొన్నారు. ఇటీవల బండారుపల్లి టీజీఆర్ గురుకులంలోనూ ఇలాంటి ఘటనే జరిగిందని అంటున్నారు.

గురుకులాల్లో చావుకేక

మొదటిపేజీ తరువాయి...

కలిసి తల్లిగారిల్లయిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఉంటున్నది. పంట పొలాల మధ్యలో ఉన్న పాఠశాల ఆవరణలో పాముల సంచారం ఉండడంతో విద్యార్థులు వణికిపోతున్నారు. పెద్దాపూర్ గురుకులంలో ఆరో తరగతి చదువుతున్న ఎడ్మల అనిరుధ్(11) గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి భోజనం చేశాడు. అనంతరం పక్కనే ఉన్న మూత్రశాలకు వెళ్లి పాఠశాలకు తిరిగొచ్చాడు. కొద్దిసేపటి తర్వాత కడుపు నొస్తుందని అనిరుధ్ ఏడ్చుకుంటూ చెప్పినట్టు తోటి విద్యార్థులు తెలిపారు. విద్యార్థులతో కలిసి నేలపై పడుకోగా, తెల్లవారుజామున కడుపునొప్పి ఎక్కువ కావడంతో తోటి విద్యార్థులు కేర్‌టేకర్లకు తెలిపారు. కేర్‌టేకర్లు, వాచ్‌మెన్ హుటాహుటిన విద్యార్థిని కోరుట్ల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో జగిత్యాల దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

మరో ఇద్దరికి అస్వస్థత

ఆరో తరగతికి చెందిన మరో ఇద్దరు విద్యార్థులు కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన మొండి మోక్షిత్, మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన అల్లి హేమంత్‌యాదవ్ అనే విద్యార్థులు కడుపునొప్పితో బాధపడగా, మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ దవాఖానకు తరలించారు. ఘటనపై కోరుట్ల పోలీసులు, అధికారులు పాఠశాలకు చేరుకొని విచారణ జరిపారు. జగిత్యాల ఇన్‌చార్జి డీఈవో జనార్దన్ రావు స్కూల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. వరుసగా జరుగుతున్న ఘటనలకు పాముకాటే కారణమన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. పక్షం రోజుల క్రితమే ఓ విద్యార్థి మరణించగా, విద్యార్థులను నూతన భవనంలోకి మార్చారు. శుక్రవారం మరో విద్యార్థి చనిపోయాడని తెసుకుని నమస్తే తెలంగాణ స్కూల్‌కు వెళ్లిన సమయంలోనూ పాము కనిపించడం గమనార్హం.

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం

పెద్దాపూర్ గురుకులానికి వెళ్లిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఘటనపై ఆరా తీయగా, తమకేమీ తెలియదని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది బదులివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పదిహేను రోజుల క్రితం ఓ విద్యార్థి మృతి చెందినా ఇంత నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా ఎలా ఉన్నారని ప్రశ్నించారు. అనంతరం మెట్‌పల్లి దవాఖానలో చికిత్స పొందుతున్న హేమంత్‌యాదవ్‌ను, నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న మోక్షిత్‌ను పరామర్శించారు. జగిత్యాలలోని ప్రభుత్వ దవాఖానలో అనిరుధ్ మృతదేహాన్ని ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనిరుధ్‌తోపాటు ఇటీవల మృతిచెందిన ఆరపేటకు చెందిన రాజారాపు గణాదిత్య కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఇలాంటి ఘటనలు జరగడం చాలా బాధాకరమని, విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ప్రభుత్వ విప్ నిలదీత

గురుకుల విద్యాలయ పరిశీలనకు వచ్చిన ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పిల్లల తల్లిదండ్రుల నుంచి చేదు అనుభవం ఎదురైంది. నెలకొన్న సమస్యలు, వరుసగా జరుగుతున్న ఘటనపై నిలదీశారు. పిల్లలకు పడుకునేందుకు బెడ్లు లేవని, మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు దూరంగా ఉన్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. అప్పటికే అదనపు కలెక్టర్ రాంబాబు అక్కడికి రావడంతో సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై 12న 'సుప్రీం' విచారణ

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈడీ, సీబీఐ కేసుల్లో తనకు బెయిల్‌ను నిరాకరిస్తూ గత నెల 1న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆమె సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ నెల 12న జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం విచారణ జరుపనున్నది.

6 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 10 ఆగస్టు 2024
www.ntnews.com

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

కుటుంబ పాలన ఎవరిది?

కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందన్నట్టుగా.. నిన్నటిదాక కేసీఆర్ ప్రభుత్వాన్ని కుటుంబపాలన అని విమర్శించిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు పూర్తిగా బరితెగించి రాష్ర్టాన్ని, రాష్ట్ర సంపదను కాంగ్రెస్ కుటుంబాలకు ధార పోస్తున్నది. కేసీఆర్ కుటుంబంలోని ప్రతి ఒక్కరూ 14 ఏండ్లు రాష్ట్రసాధన పోరాటంలో పాల్గొన్నారు. నిర్బంధాలు, జైళ్లు లెక్క చేయకుండా ఉద్యమించారు. కేసీఆర్ వారికి టిక్కెట్లిస్తే ప్రజల ముందుకు వెళ్లి ఒకటికి నాలుగు సార్లు వారి ఆశీర్వాదంతో చట్టసభల్లోకి వచ్చారు తప్ప బలవంతపు రుద్దుళ్లు కాదు. అయినా సరే.. కాంగ్రెస్ కుటుంబ పాలన అంటూ కోడై కూస్తే దానికి పచ్చ మీడియా, పచ్చక్ష మీడియా వంత పాడింది. బురద చల్లింది. మరి ఇవాళ జరుగుతున్నదేమిటి? సీఎం తమ్ముడు అనధికారిక ఎమ్మెల్యేగా కొనసాగుతాడు. ప్రభుత్వ కార్యక్రమాల్లో వేదికపై తిష్ట వేస్తాడు. మరో సోదరుడు తన వ్యాపారం కోసం క్విడ్ ప్రో కో అనదగిన రీతిలో ఎంవోయూలు చేసుకుంటాడు. ఇంకో సోదరుడు ప్రభుత్వ వ్యవహారాల్లో షాడో సీఎంగా చెలామణి అవుతాడు. మరి గల్లీ కాంగ్రెస్ నాయకుడి నుంచి మహారాజశ్రీ రాహుల్‌గారి వరకు అంతా కుటుంబ పాలన అంటూ చేసిన విమర్శలు ఏమైనట్టు? ఇవాళ రాష్ట్రంలో సగం జిల్లాల్లో కుటుంబాల పాలన కొనసాగుతున్నది. జిల్లాకు ఒకటి రెండు కుటుంబాలు అధికారాన్ని పంచుకుతింటున్నారు. కుటుంబపాలన విశ్వరూపం కళ్లముందు కనిపిస్తున్నది. ఎన్ని కుటుంబాలు? ఎంత అరాచకం? పైగా తప్పేమిటని ఆ పార్టీవారే దబాయిస్తున్నారు. ఎన్నికల సమయంలో కుటుంబ పాలన అంటూ రాష్ట్రమంతా ఊదరగొట్టిన రాహుల్ ఈ కుటుంబాల పాలన చూసి ఏం చేస్తున్నట్టు? పార్లమెంటులో నిద్రపోతే ఓకే. కానీ తమ పార్టీ ప్రభుత్వం ఎలాగుందో దాని పనితీరు ఏమిటో కూడా చూడాలిగదా? ఎదుటి వారికి చెప్పిన నీతి సూత్రాలు తాము పాటించాలి గదా!



ఎడిటోరియల్ డెస్క్

ఏ పార్టీ అయితే కేసీఆర్‌ది కుటుంబ పాలన అని ఆరోపించిందో, అదే కాంగ్రెస్ సర్కారులో కొందరు సీనియర్ నేతల కుటుంబాలే పెత్తనం చెలాయిస్తున్నాయి. అసలు ఆ మాటకొస్తే వారసత్వ రాజకీయాలపై పేటెంట్ హక్కు ఏ పార్టీకైనా ఉందంటే అది కాంగ్రెస్‌కే అన్నది చారిత్రక సత్యం. నెహ్రూ నుంచి రాహుల్‌గాంధీ వరకు కాంగ్రెస్‌లో రాజకీయ వారసత్వం కొనసాగుతూనే వస్తున్నది. రాష్ట్ర రాజకీయాల్లోకి వస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. కుటుంబ వారసత్వ రాజకీయాలకు, స్వీయ సామాజిక వర్గాన్ని జోడించి కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టింది. ఆయన తన సామాజికవర్గానికి చెందిన నాయకులు, అధికారులకే ప్రభుత్వంలో పెద్దపీట వేశారని సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నడూ ఈ పరిస్థితి లేదని చెప్పక తప్పదు. ప్రభుత్వంలో కీలక శాఖలు, బాధ్యతలు ఒకే సామాజికవర్గానికి చెందిన నాయకులు, అధికారులకు అప్పగించిన దాఖలాలు మునుపెన్నడూ లేవని పలువురు గుర్తుచేస్తున్నారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన పార్టీగా చెప్పుకొనే కాంగ్రెస్.. ప్రస్తుతం అగ్రకుల నేతల ఆధిపత్యంలోకి వెళ్లటం, ఉదయపూర్‌లో కాంగ్రెస్ ప్లీనరీ-2022లో చేసిన తీర్మానానికి తూట్లు పొడిచేలా ఉన్నదని ఆ పార్టీ అధిష్ఠానం కూడా కలవరపడుతున్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలో కనీసం పీసీసీ అధ్యక్ష పదవి అయినా బీసీ సామాజికవర్గానికి కట్టబెట్టకపోతే పార్టీకి ఓటు బ్యాంకుగా ఉంటున్న బడుగు, బలహీనవర్గాలు దూరం అవుతారేమోనని ఆందోళన చెందుతున్నట్టు చెప్పుకొంటున్నారు.

సగం జిల్లాల్లో కొన్ని కుటుంబాలదే పెత్తనం

ఉమ్మడి పది జిల్లాల్లో సగం జిల్లాల్లో కొన్ని కుటుంబాలే పదవులు, అధికారాన్ని అనుభవిస్తున్నాయి. ఖమ్మం, నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో ప్రభుత్వాన్ని కొన్ని కుటుంబాలే శాసిస్తున్నాయని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా కొనసాగుతూ పార్టీని, ప్రభుత్వాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. నామినేటెడ్ పోస్టులూ ఇతరులకు ఇవ్వకుండా మోకాలడ్డుతున్నారని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు.



• ఖమ్మంలోనూ మూడు కుటుంబాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంత్రివర్గంలో కొనసాగుతుండగా, ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురామిరెడ్డి ఉన్నారు. ఈయన పొంగులేటికి స్వయానా వియ్యంకుడు. రఘురామిరెడ్డిది కూడా కాంగ్రెస్ కుటుంబమే. ఈయన తండ్రి రామసహాయం సురేందర్‌రెడ్డి వరంగల్ మాజీ ఎంపీ. భట్టి విక్రమార్క తన భార్య నందినికి ఖమ్మం ఎంపీ టికెట్ ఇప్పించేందుకు చివరిదాకా తీవ్రంగా ప్రయత్నించారు. భట్టి సోదరుడు మల్లు రవికి నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీ టికెట్ ఇవ్వడంతో నందినికి ఖమ్మం టికెట్ దక్కలేదు. పొంగులేటి తన సోదరుడు ప్రసాద్‌రెడ్డి, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడు యుగంధర్ కోసం చివరిదాకా ప్రయత్నించినా ఆఖరికి పొంగులేటి తన వియ్యంకుడు రఘురామిరెడ్డికి టికెట్ ఇప్పించుకోవటంలో సఫలమయ్యారు.

• నల్లగొండలో ఫ్యామిలీ ప్యాక్!

కాంగ్రెస్‌లో కుటుంబ పాలన గురించి చెప్పుకోవాల్సి వస్తే మొదటగా వినిపించే పేరు ఉమ్మడి నల్లగొండ జిల్లానే. ఇక్కడి నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రులుగా కొనసాగుతుండగా.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భార్య పద్మావతి కోదాడ ఎమ్మెల్యేగా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడు రాజగోపాల్‌రెడ్డి మునుగోడు ఎమ్మెల్యేగా ఉన్నారు.

ఇదే జిల్లాకు చెందిన మరో సీనియర్ నేత కుందూరు జానారెడ్డి కుమారులలో జైవీర్‌రెడ్డి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే, మరో కుమారుడు రఘువీర్‌రెడ్డి నల్లగొండ ఎంపీ. ఇప్పటికే నల్లగొండ జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు ఉండగా, మూడో మంత్రి పదవి కూడా సోదరుడు రాజగోపాల్‌రెడ్డికి ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చేటట్టయితే తన భార్య పద్మావతికి కూడా మంత్రి పదవి ఇవ్వాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టుబడుతున్నారు. నల్లగొండ జిల్లాలో పదవులు, అధికారం ఈ మూడు కుటుంబాలకే పరిమితం కాగా, తాజాగా భువనగిరి ఎంపీగా గెలిచిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అరంగ్రేటం చేశారు. తన భార్య లక్ష్మికి భువనగిరి ఎంపీ టికెట్ ఇవ్వాలని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చివరిదాకా ప్రయత్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి చామల సన్నిహితుడు కావటంతో ఆయనకు టికెట్ దక్కింది. మున్ముందు ఈ జిల్లాలో చామల కుటుంబం కూడా పదవులు దక్కించుకుంటుందేమో చూడాలి.

• వరంగల్‌లో కడియం, కొండా ఫ్యామిలీ

ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ కాంగ్రెస్‌లో పెత్తనం రెండు కుటుంబాలదే. కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా, ఆయన కూతురు కావ్య వరంగల్ ఎంపీగా ఉన్నారు. మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి గతంలో ఎమ్మెల్సీగా పనిచేశారు. సురేఖ తన కూతురు సుస్మిత పటేల్‌కు పరకాల ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించిన విషయం తెలిసిందే.

• మెదక్‌లో దామోదర, జగ్గారెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లాలో మంత్రి దామోదర రాజనరసింహ, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి కుటుంబాలవీ రాజకీయ వారసత్వమే. మంత్రి దామోదర రాజనరసింహ తండ్రి రాజనరసింహ కూడా కాంగ్రెస్ నాయకుడే.

ఆయన 3 పర్యాయాలు అందోల్ ఎమ్మెల్యేగా పనిచేయగా, ఆయన మరణానంతరం వారసుడిగా దామోదర రాజనరసింహ రాజకీయాల్లోకి వచ్చారు. వైఎస్‌ఆర్ హయాంలో ఆయన ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇక జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డి గతంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీచేసి ఓడిపోయారు. గతంలో ఆమె జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారు. తాజాగా రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతులు, అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. జగ్గారెడ్డి వారసురాలిగా కూతురు జయారెడ్డి ఇప్పటికే రాజకీయ ప్రవేశం చేశారు. ప్రస్తుతం యువజన కాంగ్రెస్‌లో ఆమె పనిచేస్తున్నారు. ఇదే జిల్లాకు చెందిన గీతారెడ్డి ఉమ్మడి ఏపీలో మంత్రిగా పని చేశారు. ఈశ్వరీబాయి రాజకీయ వారసురాలిగా గీతారెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు.

• ఆదిలాబాద్‌లో వెంకటస్వామి కుటుంబ దర్బార్


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి వెంకటస్వామి కుటుంబ వారసత్వం దశాబ్దాలుగా కొనసాగుతున్నది. వెంకటస్వామి పెద్ద కుమారుడు వినోద్ గతంలో మంత్రిగా, చిన్న కుమారుడు వివేక్ ఎంపీగా పనిచేశారు.

ప్రస్తుతం చెన్నూరు నుంచి వివేక్, బెల్లంపల్లి నుంచి వినోద్ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. వెంకటస్వామి కుటుంబం నుంచి మూడవ తరం కూడా రాజకీయాల్లోకి వచ్చారు. వివేక్ కుమారుడు గడ్డం వంశీకృష్ణ ఇటీవల పెద్దపల్లి ఎంపీగా గెలుపొందారు. ఇదే జిల్లాకు చెందిన కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుది రాజకీయ వారసత్వమే. ఆయన ప్రస్తుతం మంచిర్యాల ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రేమ్‌సాగర్‌రావు భార్య సురేఖ కూడా కాంగ్రెస్‌లో చురుకైన రాజకీయ నాయకురాలే. ప్రస్తుతం ఆమె మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. గతంలో సురేఖ సిర్పూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. మంత్రివర్గ విస్తరణలో ప్రేమ్‌సాగర్‌రావుకు స్థానం లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

• రాజకీయ వారసత్వాలకు పుట్టినిల్లు పాలమూరు


ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయ వారసులకు పుట్టినిల్లు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు రాజకీయ వారసులుగానే రాజకీయాల్లోకి వచ్చారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఇరువురు వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చినవారే. సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ వారసత్వం లేకపోయినప్పటికీ బంధుత్వాలు ఉన్నాయి. దివంగత కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి సోదరుడు పద్మారెడ్డి కూతురు గీతారెడ్డిని రేవంత్‌రెడ్డి వివాహం చేసుకున్నారు.

రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయినా కొడంగల్ నియోజకవర్గానికి అనధికార ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. మరో సోదరుడు కొండల్‌రెడ్డి తెరవెనుక రాజకీయాలలో చురుకుగా ఉన్నారు. కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి అసెంబ్లీకి పోటీ చేసినప్పుడు అక్కడ కొండల్‌రెడ్డి ఇన్‌చార్జిగా పనిచేశారు. ఇక నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి దివంగత పీసీసీ అధ్యక్షుడు మల్లు అనంతరాములుకు స్వయానా సోదరుడు. మల్లు అనంతరాములు గతంలో నాగర్‌కర్నూల్ ఎంపీగా ఉండగా ఆయన మరణానంతరం ఆయన వారసుడిగా మల్లు రవి రాజకీయాల్లోకి వచ్చారు. మల్లు రవి మరో సోదరుడు భట్టి విక్రమార్క ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఉమ్మడి ఏపీలో మంత్రిగా పనిచేసిన కోనేరు రంగారావుకు మల్లు రవి స్వయానా అల్లుడు.





నేత	బంధుత్వం
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి-మంత్రి	పద్మావతి (భార్య)-ఎమ్మెల్యే
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి-మంత్రి	కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి(సోదరుడు)-ఎమ్మెల్యే
కుందూరు జానారెడ్డి-మాజీ మంత్రి	జైవీర్ రెడ్డి (కుమారుడు) - ఎమ్మెల్యే రఘువీర్ రెడ్డి (కుమారుడు)- ఎంపీ
మల్లు భట్టి విక్రమార్క-డిప్యూటీ సీఎం	మల్లు రవి (సోదరుడు) - ఎంపీ
పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి-మంత్రి	రామసహాయం రఘురామిరెడ్డి (వియ్యంకుడు) - ఎంపీ
కడియం శ్రీహరి-ఎమ్మెల్యే	కడియం కావ్య (కూతురు) - ఎంపీ
కొండా సురేఖ - మంత్రి	కొండా మురళి (భర్త) - మాజీ ఎమ్మెల్సీ
దామోదర రాజనర్సింహ - మంత్రి	రాజనర్సింహ (తండ్రి) - మాజీ ఎమ్మెల్యే
జగ్గారెడ్డి - మాజీ ఎమ్మెల్యే	నిర్మలా జగ్గారెడ్డి (భార్య) - టీజీఐఐసీ చైర్‌పర్సన్ జయారెడ్డి (కూతురు) - యువజన కాంగ్రెస్ నేత
వివేక్ వెంకటస్వామి- ఎమ్మెల్యే	వెంకటస్వామి (తండ్రి) - కేంద్ర మాజీ మంత్రి గడ్డం వినోద్ (సోదరుడు) - ఎమ్మెల్యే గడ్డం వంశీకృష్ణ (కుమారుడు) - ఎంపీ
కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు - ఎమ్మెల్యే	సురేఖ (భార్య)-మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు
రేవంత్‌రెడ్డి - సీఎం	తిరుపతిరెడ్డి (సోదరుడు)- కొడంగల్ అనధికారిక ఎమ్మెల్యే కొండల్‌రెడ్డి (సోదరుడు) - తెరవెనుక రాజకీయాలు జైపాల్‌రెడ్డి (మామ సోదరుడు) - కేంద్ర మాజీ మంత్రి
ఎన్టీఆర్ - మాజీ సీఎం (దివంగత)	చంద్రబాబు (అల్లుడు) - ఏపీ సీఎం బాలకృష్ణ (కుమారుడు) - ఎమ్మెల్యే లోకేశ్ (మనుమడు (చంద్రబాబు కుమారుడు, బాలకృష్ణ పెద్దఅల్లుడు)- మంత్రి శ్రీభరత్ (మనుమడు (బాలకృష్ణ చిన్నల్లుడు) - ఎంపీ పురందేశ్వరి (కూతురు) - ఎంపీ, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు
నారాయణ - ఏపీ మంత్రి	గంటా శ్రీనివాస్‌రావు (వియ్యంకుడు) - ఎమ్మెల్యే



ఏపీలో ఆ కుటుంబమే..


ఉమ్మడి ఏపీలో ప్రారంభమైన కుటుంబ వారసత్వ రాజకీయాలు, రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఏపీలో కొనసాగుతున్నాయి. మొన్నటివరకు ఏపీ సీఎంగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వారసుడే. తెలంగాణలో కేసీఆర్‌ది కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్ పార్టీయే ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ఆర్ కూతురు షర్మిలను నియమించింది. ప్రస్తుతం ఏపీలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూడా ఎన్టీఆర్ రాజకీయ వారసత్వ పార్టీయే. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాక ముందే చంద్రబాబు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసినా, ఆయనకు సీఎం పదవి దక్కింది మాత్రం ఎన్టీఆర్ రాజకీయ వారసత్వం పుణ్యానే. ఎన్టీఆర్ అల్లుడు చంద్రబాబు సీఎం, చంద్రబాబు కుమారుడు లోకేశ్ మంత్రి, చంద్రబాబు బావమరిది బాలకృష్ణ ఎమ్మెల్యే, బాలకృష్ణ అల్లుడు శ్రీభరత్ విశాఖపట్నం ఎంపీ, చంద్రబాబు వదిన పురందేశ్వరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ కూడా. గంటా శ్రీనివాస్‌రావు ఎమ్మెల్యేగా ఉండగా, ఆయన వియ్యంకుడు నారాయణ ఏపీ మంత్రిగా ఉన్నారు. ఇలా చెప్పుకుంటూపోతే అంతా కుటుంబ రాజకీయమే.

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అంతేకాదు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సందర్భాల్లో చెప్పారు. కానీ, అమలుకు నోచుకోవడం లేదు.

నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలె

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు జారీచేసిన హెల్త్‌కార్డులు ఎక్కడా పని చేయడం లేదు. ఇవి దేనికీ పనికిరావని, ముందుగా నగదు చెల్లించి రీయింబర్స్‌మెంట్ చేయించుకోవాలని ఆసుపత్రుల యాజమన్యాలు ఉచిత సలహాలు ఇస్తున్నాయి. అయితే వైద్యానికి భారీగా ఖర్చవుతుంటే ప్రభుత్వం మాత్రం రూ.2 లక్షలలోపే రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం సరికాదు. ప్రజా ప్రభుత్వం అంటున్న రేవంత్ సర్కార్.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లు, వారి కుటుంబసభ్యుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం సబబు కాదు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా ఈ వర్గాలవారు అప్పుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో నగదు రహిత వైద్యాన్ని అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, అన్నిరకాల దవాఖానల్లో హెల్త్ కార్డులు చెల్లుబాటు అయ్యేటట్టు ఉత్తర్వులు జారీ చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లు కోరుతున్నారు.

- డాక్టర్ ఎస్.విజయభాస్కర్
92908 26988



సమ వాటా కోసం బీసీల పోరు

మండల్ కమిషన్ అమలు జరపాలని ఎగిసిన ఉద్యమ పరిణామాల తర్వాత తిరిగి బీసీ చైతన్యం ఇప్పుడు తెలంగాణ అంతటా బలంగా వీస్తున్నది. ఇది ప్రతి బీసీ ఎదను తడుతున్నది. బీసీ కులాల నుంచి ఎగుస్తున్న చైతన్యం ఎటువైపునకు దారితీస్తుందోనని ఆలోచనాపరులు అంచనాలు వేస్తున్నారు. రాజకీయ పార్టీలు సహజంగానే బీసీ చైతన్యాన్ని తమ ఖాతాల్లోకి ఏ విధంగా వేసుకోవాలోనని ప్రయత్నిస్తాయి. బీసీలలో వస్తున్న చైతన్యం ఏ రూపంలో ఎటు దిక్కుగా మళ్లినా రాజకీయ పార్టీలకు తొట్రుపాటు కలిగిస్తుంది. ఈ రకమైన పరిణామాలు ఒకరకంగా బీసీలకు కలిసివచ్చే కాలమైనప్పటికీ రాజకీయ పార్టీలను మాత్రం సంకట పరిస్థితుల్లోకి నెడతాయి.



జూలూరు గౌరీశంకర్

తెలంగాణలో రాజకీయ పార్టీల తీరుతెన్నులపై బీసీలకు సహజంగానే పలురకాల సంశయాలున్నాయి. దీనికి కారణాలనేకం. బీసీలంతా ఒక్కతాటిపైకి రాకుండా చేయటంలో అగ్రకుల ఆధిపత్యాలు తరతరాలుగా ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేస్తూ వస్తున్నారో తెలిసిందే. ఆ పరంపర కొనసాగింపుగానే రాజకీయ పార్టీలు అదే దారిలో ఇప్పటికీ నడుస్తున్నాయి. బీసీలు సమైక్యం కాకుండా చేయటంలో సఫలీకృతమవుతూ వస్తున్న రాజకీయ పార్టీలకు ఇటీవల బీసీల నుంచి వస్తున్న చైతన్యం కొంతవరకు గందరగోళానికి గురిచేస్తున్నది. బహిరంగంగా ఈ విషయంపై మాట్లాడటానికి ఏ రాజకీయ పార్టీ ముందుకు రాదు. కానీ, బీసీ చైతన్యాన్ని ముక్కలు చేయటానికి, కులాలపరంగా వాళ్ల మధ్య విభజన రేఖలు గీయటానికి మాత్రం అగ్రవర్ణ ఆధిపత్య వర్గాలు ఎన్ని పన్నాగాలైనా పన్నుతాయి. బీసీలను కులాలపరంగా విడదీసేందుకు నిచ్చెన మెట్ల కులవ్యవస్థ పాముపట్లాల ఆటలు ఉండనే ఉన్నవి.

బీసీలు గమ్యం చేరకుండా వారి మధ్య వైరుధ్యాలను సృష్టించేందుకు కొందరు చూస్తారు. అది సాధ్యం కాకపోతే బీసీ నాయకత్వాలను.. పార్టీల వారీగా విభజించి గీతలు గీస్తారు. ఫలానా పార్టీ బీసీలకు అనుకూలమని, ఫలానా పార్టీ వ్యతిరేకమని బీసీల ఐక్యతను దెబ్బతీసే పనులు చేస్తారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, కులగణన చేయాలని, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ గొంతుకల నుంచి ప్రశ్నలు వస్తుంటే ఆధిపత్య వర్గాలు అనేక విచ్ఛిన్నకర వాదనలు ముందుకు తెస్తున్నాయి. 'బీసీలంతా ఒక్కటికారు' అన్న పాత విషప్రచారానికే కొత్త కోణంలో రంగులు వేసి ముందుకు తెస్తున్నాయి. బీసీ వాదమే లేదని కొందరు వాదనలు లేపుతున్నారు. బీసీ కులగణన చేస్తే దేశసమగ్రత దెబ్బతిని, దేశ సమైక్యత విచ్ఛిన్నమవుతుందని వాదనలు చేస్తున్నారు. చైతన్యంతో మాట్లాడే బీసీలను కాంగ్రెస్ బీసీ, బీఆర్‌ఎస్ బీసీ, బీజేపీ బీసీ, వామపక్ష బీసీలని రాజకీయ పార్టీల స్టాంపులు వేసి విభజించే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఒక రాజకీయ పార్టీలో ఉన్న బీసీలను మరొక రాజకీయ పార్టీలోని బీసీలపైకి ఉసికొల్పినట్టుగానే.. చైతన్యంతో మాట్లాడే బీసీలపైకి బీసీలనే ఉసికొల్పి విభేదాలు సృష్టిస్తున్నారు.



ఆధిపత్య వర్గాలు తమ రాజకీయ పబ్బాలు గడుపుకొనేందుకు ఎస్సీలకు- ఎస్సీలకు మధ్య, బీసీలకు- బీసీలకు మధ్య, ఎస్టీలకు- ఎస్టీలకు మధ్య వైరుధ్యాలను సృష్టించటం రివాజుగా వస్తున్నది. కానీ, ఆధిపత్య వర్గాల ఉక్కుపాదాల అణచివేతలపై బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి నిలుస్తాయని, దాన్ని ఆపటం ఎవరి తరం కాదని ఈ నేలపై జరిగిన ఐక్యతా పోరాటాలే పాఠాలు చెప్తున్నాయి. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటాల్లో అట్టడుగు కులాలు, వర్గాలన్నీ కలిసి పనిచేశాయి.

బీసీలంతా ఒక్కతాటిపైకి తప్పక వస్తారు. 'మా వాటా మాకే'నంటూ ఒక జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడే సమయం ఆసన్నమైంది. తెలంగాణలోని అన్ని పార్టీల్లో 2 కోట్లమంది బీసీలు ఉన్నారు. బీసీలు లేకపోతే రాజకీయ పార్టీలు కుప్పకూలి కునారిల్లిపోతాయి. బీసీల దీర్ఘకాలిక హక్కుల సాధన కోసం అన్ని పార్టీల్లో ఉన్న బీసీలు ఒక దగ్గరకు జమకావాలి. స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు బీసీ రిజర్వేషన్లు సాధించుకునే వరకు, కులగణన జరిగేవరకు బీసీలు సామూహిక గొంతుకగా మారాలి. బీసీ చైతన్యాన్ని చెల్లాచెదురు చేయాలని చూసేవాళ్ల కుట్రల్ని భగ్నం చేయాలి. 'బీసీలంతా సంఘటితమై జేఏసీగా ఏర్పడి ఒక్క గొంతుకగా గర్జిస్తున్నాం.. చూడండి' అన్న ఐక్యతాపాఠం కూడా చరిత్రకందించాలి.

నాటి తెలంగాణ సాయుధ పోరాటానికి ముందుగా ఏర్పడ్డ ఆంధ్ర మహాసభల్లాగా, తెలంగాణ స్వరాష్ట్రం కోసం ఏర్పడ్డ తెలంగాణ జేఏసీ లాగా, బీసీలకు స్థానిక సంస్థల్లో సమ వాటా, చట్టసభల్లో రిజర్వేషన్లు, సమగ్ర బీసీ కులగణన కోసం ఊరికొక జేఏసీ రావాలి. కుల, విద్యార్థి, మేధావి, ఉపాధ్యాయులు, కార్మిక, కర్షకులు, ఉద్యోగులు అంతా కలిసి బీసీ జేఏసీగా ఏర్పడాలి. 'మనం విడిపోతే చీలిపోతాం, కలిసుంటే గెలిచి తీరుతాం' అన్న సోయి బీసీల్లో పెరిగింది. మన సీట్లు మనకొస్తేనే బాగుపడతాం. బీసీల ఐక్యతే దేశసమైక్యత. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం గళం విప్పుదాం. గర్జనలు చేద్దాం.

(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు)


ఆ ఖాతాలపై ఓ కన్నేయండి

లంచం, అవినీతి ఆనవాళ్లు దొరకొచ్చు

రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల బ్యాంక్ అకౌంట్లపై భారత్‌కు ఎఫ్ఏటీఎఫ్ సూచన

లోతైన పర్యవేక్షణ అవసరమని వ్యాఖ్య

దేశీయ మనీ లాండరింగ్ నిరోధక వ్యవస్థలపై త్వరలో నివేదిక విడుదల



న్యూఢిల్లీ, ఆగస్టు 9: 'మీ దేశంలో మనీ లాండరింగ్ కార్యకలాపాలకు ఆస్కారమున్నది. బ్యాంకింగ్ లావాదేవీలపై ఓ కన్నేయండి. రాజకీయ, అధికార యంత్రాంగాల్లో భారీగా ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయనిపిస్తున్నది' అంటూ అంతర్జాతీయ యాంటీ-మనీ లాండరింగ్ వాచ్‌డాగ్.. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) భారత్‌ను గట్టిగా హెచ్చరించిందని సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, వాళ్లకు కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలపై నిఘా పెట్టాలని ఎఫ్ఏటీఎఫ్ మోదీ సర్కారుకు సూచించింది.

కొత్త ఖాతాలపై..

రాజకీయ నేతల ఆర్థిక వ్యవహారాలను లోతుగా పరిశీలించాలని తమ సమీక్ష సిఫార్సుల్లో భాగంగా ఎఫ్ఏటీఎఫ్ కేంద్రానికి సలహా ఇచ్చినట్టు ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, లంచం, అవినీతి వీలున్నప్పుడు రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యులు, వారికి సన్నిహితంగా ఉండేవారి బ్యాంక్ ఖాతాలపై నజర్ పెట్టాల్సిందేనని అంతర్జాతీయ నిబంధనలు చెప్తున్నాయని ఎఫ్ఏటీఎఫ్ గుర్తుచేస్తున్నది. ఆయా ఖాతాల్లో ఉన్న నిధులు ఎక్కడి నుంచి వచ్చాయన్న ఆరా తీస్తూనే.. వారు, వాళ్లకు సంబంధించిన వారు ఏమైనా కొత్త ఖాతాలను తెరిచారా? అన్న కోణంలో సీనియర్ బ్యాంక్ మేనేజర్ల నుంచి సమాచారం రాబట్టాలని కూడా ఎఫ్ఏటీఎఫ్ చెప్పినట్టు తెలుస్తున్నది. మొత్తంగా బ్యాంకింగ్ లావాదేవీలపై పర్యవేక్షణను మెరుగుపర్చుకోవాల్సిన అవసరమైతే ఉన్నదని ఈ గ్లోబల్ వాచ్‌డాగ్ భారత్‌కు స్పష్టం చేసింది.

చట్టాల్లో సవరణలు?

దేశంలో ప్రస్తుతమున్న మనీ లాండరింగ్ నిరోధక చట్టాలను సవరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకే ఎఫ్ఏటీఎఫ్ ఇప్పుడున్న చట్టాలను, అధికారాలను, వాటిలోని లోటుపాట్లను సమీక్షిస్తున్నట్టు చెప్తున్నారు. ఈ మేరకు తుది నివేదిక వస్తే చట్టాల్లో మార్పులు, చేర్పులు ఉంటాయని కూడా సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. నిజానికి గత ఏడాది డిసెంబర్‌లోనే పార్లమెంట్‌లో ఈ కొత్త చట్టాల సంకేతాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చారు. ఈ సందర్భంగా కఠిన బ్యాంకింగ్ నిబంధనలు, పరవేక్షణలోకి దేశంలోని రాజకీయ నాయకులను తీసుకురావడం తమ ఉద్దేశమేమీ కాదన్న మోదీ.. చట్టాల సవరణకు ముందు ఎఫ్ఏటీఎఫ్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పారు. మరోవైపు దేశంలో మనీ లాండరింగ్ నిరోధక చట్టాల అమలుపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న సంగతి విదితమే. అయితే మనీ లాండరింగ్, టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ కేసుల విచారణను మరింత వేగవంతం చేసేలా చట్టాలుండాలన్న వాదనలు సైతం వినిపిస్తున్నాయి.

ఏం జరుగుతోంది?

భారతీయ మనీ లాండరింగ్ నిరోధక వ్యవస్థల్ని గత ఏడాది నుంచి ఎఫ్ఏటీఎఫ్ సమీక్షిస్తున్నది. అయితే ఈ నేపథ్యంలో దాన్నుంచి ఈ తరహా హెచ్చరికలు రావడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. ఏదో పెద్ద కుంభకోణం జరిగిందా? అన్న అనుమానాలూ తలెత్తుతున్నాయి మరి. నిప్పు లేనిదే పొగ రాదన్నట్టు ఎక్కడో భారీ స్థాయిలోనే అక్రమాలు ఎఫ్ఏటీఎఫ్ గుర్తించి ఉంటుందని, అందుకే ఈ ముందస్తు సంకేతాలన్న గుసగుసలు ప్రస్తుతం ఆర్థిక శాఖ వర్గాల్లో నడుస్తున్నట్టు తెలుస్తున్నది. ఇక తమ సమీక్షపై ఎఫ్ఏటీఎఫ్ త్వరలో భారత్‌కు నివేదిక ఇవ్వనున్నది. దీంతో ఇది వచ్చాక పెను ప్రకంపనలకు అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయిప్పుడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎఫ్ఏటీఎఫ్ తాజా సూచనలు హాట్ టాపిక్‌గా మారుతున్నాయి.

బ్యాంక్ ఖాతా కావాలంటే నలుగురు నామినీలుండాల్సిందే

లోక్‌సభలో బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లును శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ప్రవేశపెట్టారు. ఇకపై ఒక్కో బ్యాంక్ ఖాతాకు నలుగురు నామినీలు కావాలన్న నిబంధనను ఇందులో తీసుకువచ్చారు. ప్రస్తుతం ఒక్క నామినీతో ఖాతాల్ని తెరిచేస్తున్న విషయం తెలిసిందే. అలాగే డైరెక్టర్‌షిప్‌ల కోసం 'సబ్‌స్టాన్షియల్ ఇంట్రెస్ట్'ను పునర్నిర్వచిస్తూ దానికున్న పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచారు. సహకార బ్యాంకులకు సంబంధించీ కొన్ని మార్పులు తెస్తున్నారు. ఇక చట్టబద్ధ ఆడిటర్లకు చెల్లింపుల విషయంలో బ్యాంకులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని కూడా మోదీ సర్కారు నిర్ణయించింది. కాగా, రెగ్యులేటరీ సమ్మతి కోసం బ్యాంకుల రిపోర్టింగ్ రోజులనూ ప్రతి నెలా రెండో, నాల్గో శుక్రవారాలకు బదులుగా 15, నెలాఖరు తేదీల్లోకి మార్చుతున్నారు. ఆర్బీఐ చట్టం 1934, బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949, ఎస్బీఐ చట్టం 1955, బ్యాంకింగ్ సంస్థల చట్టాలు 1970, 1980ల్లో సవరణల కోసం తెచ్చిన ఈ బిల్లుకు గత శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన సంగతి విదితమే. బ్యాంకుల్లో మెరుగైన పాలనాపరమైన అంశాల కోసం, మదుపరులు-ఖాతాదారుల ప్రయోజనార్థం ఈ మార్పులు తెస్తున్నట్టు ఇటీవలి బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు.

లంబోర్ఘిని నయా ఎస్‌యూవీ



ధర రూ.4.57 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఇటలీకి చెందిన సూపర్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆటోమోబిలి లంబోర్ఘిని..దేశీయ మార్కెట్లోకి మరో ప్లగ్-ఇన్ హైబ్రిడ్ వెర్షన్ ఫ్లాగ్‌షిప్ ఎస్‌యూవీ ఊరస్ ఎస్ఈ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ధర రూ.4.57 కోట్లు(నూఢిల్లీ షోరూంలో). ఈ ఏడాది తొలినాళ్లలో అంతర్జాతీయ మార్కెట్లోకి అడుగుపెట్టిన రెండో హైబ్రిడ్ కారును ప్రస్తుతం దేశీయంగా విడుదలచేసింది సంస్థ. ట్విన్ టర్బో 4.0 లీటర్ వీ8 ఇంజిన్‌తో తయారైన ఈ కారులో 25.9 కిలోవాట్ల లిథియం అయాన్ బ్యాటరీతో తయారు చేసింది. సింగిల్ చార్జింగ్‌తో కేవలం 60 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 3.4 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 312 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. దేశవ్యాప్తంగా హైబ్రిడ్ వాహనాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా మాడల్‌ను విడుదల చేసినట్లు ఆటోమోబిలి లంబోర్ఘిని ఆసియా పసిఫిక్ రీజియన్ డైరెక్టర్ ఫ్రాన్సిస్కో స్కార్డోని తెలిపారు. 2023లో సంస్థ 103 యూనిట్లను విక్రయించింది.



కెనరా బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ రుణ గ్రహీతలకు షాకిచ్చింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 5 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లు అధికంకానున్నాయి. అత్యధిక మంది తీసుకునే ఏడాది కాలపరిమితితో వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీరేటు 8.95 శాతం నుంచి 9 శాతానికి సవరించింది. అలాగే మూడేండ్ల రుణాలపై రేటును 9.40 శాతానికి పెంచిన బ్యాంక్.. రెండేండ్ల రుణాలపై వడ్డీరేటును 9.30 శాతానికి పెంచింది. వీటితోపాటు నెల, మూడు, ఆరు నెలల రుణాలపై వడ్డీరేటు 8.35 శాతం నుంచి 8.80 శాతం మధ్యలో ఉంచింది. పెంచిన వడ్డీరేట్లు ఈ నెల 12 నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది.

బీవోబీ కూడా...

బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) కూడా తన ఎంసీఎల్ఆర్ రేటును ఐదు బేసిస్ పాయింట్లు సవరించింది. ఈ నెల 12 నుంచి అమలులోకి వచ్చేలా ఎంపిక చేసిన కాలపరిమితులపై ఎంసీఎల్ఆర్‌ని పెంచింది. ఒక్క రోజు, నెల రుణాలపై వడ్డీరేట్లను యథాతథంగా ఉంచిన బ్యాంక్..మూడు, ఆరు నెలల, ఏడాది కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్‌ని పెంచింది. దీంతో ఏడాది రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.90 శాతం నుంచి 8.95 శాతానికి చేరుకున్నది. అలాగే యూకో బ్యాంక్ కూడా ఈ నెల నుంచి అమలులోకి వచ్చేలా ఎంసీఎల్ఆర్‌ని పెంచింది. దీంతో రోజు, నెల, మూడు, ఆరు నెలలు, ఏడాది రుణాలపై వడ్డీరేటు 8.20 శాతం నుంచి 8.95 శాతం మధ్యలో వసూలు చేస్తున్నది.

తిరిగి కోలుకున్న సూచీలు

సెన్సెక్స్ 820, నిఫ్టీ 250 పాయింట్ల లాభం

ముంబై, ఆగస్టు 9: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకుపైగా లాభపడిన సెన్సెక్స్ 819.69 పాయింట్లు ఎగబాకి 79,705.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 250.50 పాయింట్లు అందుకొని 24,367.50 వద్ద స్థిరపడింది.

4.46 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడటంతో మదుపరుల పంట పండింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.4,46,308.99 కోట్లు పెరిగి రూ.4,50,21,816.11 కోట్ల(5.37 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. స్టాక్ మార్కెట్ లిస్టింగ్ రోజే ఓలా షేరు అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. రూ.75.99 వద్ద ప్రవేశించిన కంపెనీ షేరు ధర 19.97 శాతం లాభంతో రూ.91.18 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.40,217.95 కోట్లుగా నమోదైంది.



2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2,054 కోట్ల విలువైన డివిడెండ్ చెక్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఏ మణిమేఖలై.

హైదరాబాద్‌లో అమెజాన్ హబ్స్

ముంబై, ఆగస్టు 9: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా..దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో హబ్స్‌లను ఏర్పాటు చేసింది. అత్యవసర సహాయ సామాగ్రిని అందించాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌తో పాటు థానే, ఫరీదాబాద్, పూర్బ బర్ధమాన్‌లో ఈ కేంద్రాలను నెలకొల్పింది. వర్షాల కారణంగా దేశంలో అనేక ప్రాంతాలలో వరదలు సంబంధించి ప్రజలకు 72 గంటల్లోగా అత్యవసర సహాయ సామగ్రిని అందించాలనే ఉద్దేశంతో నాలుగు దిక్కుల్లో నాలుగు విపత్తు కేంద్రాలను నెలకొల్పింది.

భగ్గుమన్న పసిడి



వెయ్యి రూపాయల వరకు పెరిగిన ధర

న్యూఢిల్లీ, ఆగస్టు 9: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ ప్రియమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌తోపాటు దేశీయంగా పండుగ సీజన్ కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఫలితంగా దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం ధర రూ.1,100 ఎగబాకి రూ.72,450 పలికింది. పెరగముందు ధర రూ.71,350గా ఉన్నది. పసిడితోపాటు వెండి భారీగా పెరిగింది. కిలో వెండి ఏకంగా రూ.1,400 అధికమై రూ.82,500కి చేరుకున్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల తులం పుత్తడి ధర రూ.820 అధికమై రూ.70,090కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.750 ఎగబాకి రూ.64,250కి చేరుకున్నది. రూ.1,800 అధికమైన కిలో వెండి రూ.88 వేలకు చేరుకున్నది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 5.60 డాలర్లు పెరిగి 2,468.90 డాలర్లకు చేరుకోగా, వెండి 27.60 డాలర్ల వద్ద ఉన్నది.

ఎన్టీఆర్-నీల్ యాక్షన్ డ్రామా షురూ





అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్, కేజీఎఫ్ ఫేమ్ దర్శకుడు ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న పాన్ ఇండియా యాక్షన్ మూవీ శుక్రవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. మే నెలలోనే ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. అప్పటి నుంచి ఈ సినిమా లాంచ్ కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. చిత్ర ప్రారంభోత్సవ వేడుకకు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్ని ఉన్నాయని, వాటన్నింటిని అందుకునేలా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నామని, ఎన్టీఆర్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని 2026 జనవరి 9న విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: భువన్‌గౌడ, సంగీతం: రవి బస్రూర్, ప్రొడక్షన్ డిజైన్: చలపతి, నిర్మాతలు: నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు, రచన-దర్శకత్వం: ప్రశాంత్‌నీల్.

సింగిల్ అని ఎప్పుడైనా చెప్పానా?



సాధారణంగా కథానాయికలు తమ రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి బహిరంగంగా చెప్పడానికి అంతగా ఇష్టపడరు. ఏదైనా ఇంటర్వ్యూలో అలాంటి ప్రశ్నలు ఎదురైనప్పుడు సాధ్యమైనంత వరకు దాటవేసే ప్రయత్నం చేస్తారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అగ్ర కథానాయిక కీర్తి సురేష్ తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి పరోక్షంగా తన మనసులోని మాటను బయటపెట్టింది. 'ఇన్నేళ్లు సింగిల్‌గా ఉంటున్నారు. మీకస్సలు బోర్‌గా అనిపించడం లేదా? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు..'నేను సింగిల్‌గా ఉన్నానని మీతో ఎప్పుడైనా చెప్పానా? అంటూ ఎదురు ప్రశ్నించింది. దాంతో ఈ భామ ప్రేమలో ఉందనే నిర్ధారణకు వచ్చారు అభిమానులు. అదే విషయాన్ని పరోక్షంగా చెప్పిందని అనుకుంటున్నారు. కీర్తి సురేష్ వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ముద్దుగుమ్మ మనసు దోచిన కుర్రాడెవరంటూ ఆమె అభిమానులు ఆరా తీయడం మొదలుపెట్టారు. ఇదే ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం గురించి కూడా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది కీర్తి సురేష్. కెరీర్ ఆరంభంలో వరుస ఫెయిల్యూర్స్‌తో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని, 'మహానటి' చిత్రం తర్వాతే అద్భుతమైన విజయాలు వరించాయని చెప్పింది. కీర్తి సురేష్ తాజా తమిళ చిత్రం 'రఘు తాత' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది.

చిత్రం



అగ్ర హీరో బాలకృష్ణ ఈ ఏడాదితో 50 ఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించేందుకు తెలుగు చలన చిత్ర పరిశ్రమ భారీగా సన్నాహాలు చేస్తున్నది. సెప్టెంబర్ 1న స్వర్ణోత్సవ వేడుకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కర్టెన్ రైజర్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. బాలకృష్ణ సోదరులు నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ స్వర్ణోత్సవ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

'తల్లి మనసు' ప్రారంభం



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య తనయుడు అనంత కిషోర్ నిర్మాతగా రూపొందిస్తున్న తొలిచిత్రం 'తల్లి మనసు' శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. రచిత మహాలక్ష్మి, కమల్‌కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత పోకూరి బాబురావు క్లాప్‌నివ్వగా, ఏషియన్‌గ్రూప్ భరత్ నారంగ్ కెమెరా స్విఛాన్ చేశారు. టైటిల్‌ను బట్టి ఎంత మంచి సబ్జెక్ట్‌తో సినిమా చేస్తున్నామో అర్థం చేసుకోవచ్చుని, తల్లి పాత్రలో రచిత నటిస్తున్నారని ముత్యాల సుబ్బయ్య తెలిపారు. మధ్యతరగతి తల్లి మనోవేదన, సంఘర్షణకు దృశ్యరూపంగా ఉంటుందని దర్శకుడు వి.శ్రీనివాస్ పేర్కొన్నారు. యాభై రోజుల పాటు జరిగే సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: నివాస్, సంగీతం: కోటి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.శ్రీనివాస్.

భాగ్యనగరిలో అజిత్ యాక్షన్

తమిళ అగ్ర హీరో అజిత్ నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. తాజా షెడ్యూల్‌లో అజిత్‌తో పాటు చిత్ర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అజిత్ పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నాం. పోరాట ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయి. దేవిశ్రీప్రసాద్ సంగీతం మరో ఆకర్షణ. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకుతీసుకొస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభినందన్ రామానుజం, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: అధిక్ రవిచంద్రన్.





కీరవాణి సంగీతం చంద్రబోస్ సాహిత్యం

హరికృష్ణ మనవడు, దివంగత జానకీరామ్ తనయుడు నందమూరి తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ సీనియర్ దర్శకుడు వైవీఎస్ చౌదరి ఓ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై యలమంచిలి గీత నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్‌ను ప్రకటించారు. తెలుగమ్మాయి వీణ రావు హీరోయిన్‌గా నటించనుంది. ఈ చిత్రానికి కీరవాణి సంగీతం, చంద్రబోస్ సాహిత్యాన్ని అందించబోతున్నారు. సాయిమాధవ్ బుర్రా సంభాషణల రచయిత. ఈ సందర్భంగా దర్శకుడు వైవీఎస్ చౌదరి మట్లాడుతూ 'కీరవాణిగారు యుగపురుషుడులాంటి వారు. ఆయన నాకు మర్చిపోలేని పాటలు అందించారు. అలాంటి గొప్ప వ్యక్తితో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. చంద్రబోస్ సాహిత్యం అద్భుతంగా ఉండబోతున్నది. సాయిమాధవ్ బుర్రా ప్రతి సినిమాకు గొప్పగా ఎదిగారు. ఆయన మా చిత్రానికి మాటలు రాయడం ఆనందంగా ఉంది. మంచి కూచిపూడి డ్యాన్సర్ అయిన తెలుగమ్మాయి వీణ రావుని కథానాయికగా పరిచయం చేస్తున్నాం' అన్నారు. కీరవాణి, చంద్రబోస్, వైవీఎస్ చౌదరి వంటి గొప్ప వ్యక్తులతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని సాయిమాధవ్ బుర్రా పేర్కొన్నారు.

1980నాటి ప్రేమకథ



ఎస్.ఎస్.సైదులు, భ్రమరాంబిక, అర్పిత లోహి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '1980లో రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకుడు. ఎస్‌వీ క్రియేషన్స్ పతాకంపై ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్నారు. తెలుగు మరియు బంజారా భాషల్లో విడుదలకానుంది. శుక్రవారం నిర్మాతలు బెక్కం వేణుగోపాల్, రామ్ తాళ్లూరి, హీరో సోహైల్ చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ '1980ల నాటి ప్రేమకథ ఇది. అప్పటి రోజులను కళ్లముందుంచుతూ హృద్యంగా సాగుతుంది. కథానుగుణంగా పాటలకు మంచి ప్రాధాన్యత ఉంది' అన్నారు. ఈ చిత్రానికి ఎం.ఎల్.రాజా సంగీతాన్నందించారు.

కాలం రాసిన కథలు



ఎం.ఎన్.వి.సాగర్, శృతిశంకర్, వికాస్, విహారిక చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఎం.ఎన్.వి.సాగర్ దర్శకనిర్మాత. ఈ నెల 29న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల యువ హీరో ఆకాష్ జగన్నాథ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత ఎం.ఎన్.వి. సాగర్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ ఇది. పునర్జన్మ నేపథ్యంలో పరువు హత్యల కథాంశంతో తెరకెక్కించాం. ఐదు జంటల మధ్య కథ నడుస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మేరుగు అరమాన్, రచన, నిర్మాత, దర్శకుడు: ఎం.ఎన్.వి.సాగర్.

నేషనల్ క్రష్ అంటున్నారు



'మిస్టర్ బచ్చన్' చిత్రం ద్వారా తెలుగు సినీరంగంలోకి అరంగేట్రం చేస్తున్నది మరాఠీ సుందరి భాగ్యశ్రీ బోర్సే. తొలి సినిమాకే తెలుగులో సొంతంగా డబ్బింగ్ చెప్పడం గొప్ప అనుభూతినిచ్చిందని, తెలుగు బ్యూటీఫుల్ లాంగ్వేజ్ అంటూ కొనియాడింది. రవితేజ హీరోగా హరీష్‌శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం భాగ్యశ్రీ బోర్సే పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న సంగతులు...

- నా స్వస్థలం మహారాష్ట్రలోని ఔరంగాబాద్. మా నాన్న ఉద్యోగరీత్యా నైజీరియాకు వెళ్లడంతో అక్కడే నా పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. గ్రాడ్యుయేషన్ కోసం ముంబయికి వచ్చిన సమయంలో మోడలింగ్ రంగంలో అవకాశాలొచ్చాయి. 'చందూ ఛాంపియన్' చిత్రంలో చిన్న రోల్ ద్వారా బాలీవుడ్‌కు పరిచయమయ్యా.
- 'మిస్టర్ బచ్చన్' సినిమా కోసం హైదరాబాద్‌కు వచ్చి ఆడిషన్స్‌లో పాల్గొన్నా. నా యాక్టింగ్ నచ్చడంతో సెలెక్ట్ చేశారు. ఈ సినిమాలో నేను తెలుగు మార్వాడి అమ్మాయి జిక్కీగా కనిపిస్తా. ఎప్పుడూ చలాకీగా ఉండే పాత్ర నాది. బచ్చన్ జీవితంలో జిక్కీ ఎలాంటి రోల్‌ప్లే చేసిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది.
- నా పాత్రకు తెలుగులో సొంతంగా డబ్బింగ్ చెప్పాను. అదొక గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. నేను నార్త్ ఇండియా అమ్మాయిని కాబట్టి తెలుగు అర్థం చేసుకోవడం తొలుత కొంచెం కష్టంగా అనిపించింది. క్రమంగా భాషపై పట్టు సాధించా. తెలుగు భాష చాలా అందంగా, అద్భుతంగా ఉంటుంది. ప్రస్తుతం పూర్తిగా నేర్చుకునే ప్రయత్నంలో ఉన్నా.
- ఈ సినిమా విషయంలో రవితేజ, దర్శకుడు హరీశ్‌శంకర్ ఎంతగానో సహకరించారు. వారి ఎంకరేజ్‌మెంట్ వల్లే నా క్యారెక్టర్‌లో రాణించాను. సోషల్‌మీడియాలో చాలా మంది నన్ను నేషనల్ క్రష్ అంటూ పొగుడుతున్నారు. అదొక బిగ్గెస్ట్ కాంప్లిమెంట్‌గా తీసుకుంటాను (నవ్వుతూ).

ఇద్దరూ మా బిడ్డలే

పతకాలు ఎవరికొచ్చినా సమానమే

నీరజ్, నదీమ్ తల్లుల ఆత్మీయ స్పందన ● సోషల్ మీడియా ఫిదా




ఢిల్లీ: విశ్వక్రీడల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి ముగిసిన జావెలిన్ త్రో ఫైనల్లో స్వర్ణం, రజతం సాధించిన అర్షద్ నదీమ్ (పాకిస్థాన్), నీరజ్ చోప్రా (భారత్) మాతృమూర్తులు తమ కొడుకుల ప్రదర్శనపై స్పందించిన తీరు మానవతావాదులను హత్తుకునేలా చేసింది. నీరజ్ తల్లి సరోజ్ దేవి మాట్లాడుతూ.. 'నీరజ్ రజతం సాధించినందుకు సంతోషంగా ఉంది. ఫైనల్లో స్వర్ణం గెలిచిన నదీమ్ సైతం మా కొడుకు వంటి వాడే. వాళ్లంతా క్రీడాకారులు. అందరూ కష్టపడతారు. నదీమ్ చాలా మంచి ప్రదర్శనతో స్వర్ణం సాధించాడు. నీరజ్, నదీమ్ మధ్య పెద్దగా తేడాల్లేవు. మా ఇంట్లోకి పసిడి, వెండి పతకాలు వచ్చాయి. వాటిలో మాకు వ్యత్యాసం ఏమీ లేదు' అని తెలిపింది. ఇక అర్షద్ తల్లి రజియా పర్వీన్ మాట్లాడుతూ.. 'నీరజ్ కూడా నా కొడుకుతో సమానం. అతడు నదీమ్ స్నేహితుడే గాక సోదర సమానుడు. ఆటలో గెలుపోటములు సహజం. నీరజ్‌కూ దేవుడి ఆశీర్వాదం ఉండాలి. అతడు ఇంకా పతకాలు గెలవాలి. నేను నీరజ్‌కూ పతకం రావాలని దేవుడిని వేడుకున్నా' అని వ్యాఖ్యానించింది. ఇరు దేశాల మధ్య చాలా కాలంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా ఈ ఇద్దరు అథ్లెట్ల తల్లుల వ్యాఖ్యలు మాత్రం ఎంతో పరిణితితో ఉండటమే గాక రెండు దేశాల ప్రజల మధ్య ఐక్యతను చాటాయని సోషల్ మీడియాలో నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కాగా రజతం గెలిచిన తర్వాత నీరజ్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ.. ''ఫైనల్ ముగిశాక మీ తల్లి ఇంటర్వ్యూ చూశాను. 'స్వర్ణం పతకం గెలిచిన వ్యక్తి కూడా నా కొడుకుతో సమానం' అని ఆమె చెప్పింది. ఆమె వ్యాఖ్యలు క్రీడా స్ఫూర్తికి నిదర్శనం'' అని కొనియాడారు.



బరిలో నీరజ్.. బద్దలైన రికార్డులు

- ఒలింపిక్స్ వెబ్‌సైట్, యాప్‌కు పోటెత్తిన నెటిజన్లు

పారిస్: భారత యువ అథ్లెట్ నీరజ్ చోప్రా గురువారం అర్ధరాత్రి బరిలో నిలిచిన జావెలిన్ త్రో ఫైనల్ సందర్భంగా ఒలింపిక్స్ వెబ్‌సైట్, యాప్‌నకు నెటిజన్లు పోటెత్తారు. ఈ ఎడిషన్‌లో మొదటిసారిగా వెబ్, యాప్‌ను 273 మిలియన్ల (సుమారు 27.3 కోట్ల మంది) యూజర్లు వీక్షించారు. తాజా ఎడిషన్‌లో ఇదే అత్యధికం. భారత హాకీ జట్టు కాంస్య పతక మ్యాచ్‌తో పాటు రాత్రి 11.55 గంటలకు మొదలైన నీరజ్ చోప్రా ఫైనల్ పోరును ప్రత్యక్షంగా వీక్షించేందుకు భారత క్రీడాభిమానులు అమితాసక్తి చూపించారని ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీకి చెందిన కార్పొరేట్ కమ్యూనికేషన్స్, పబ్లిక్ అఫైర్స్ డైరెక్టర్ క్రిస్టియన్ క్లా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.



1 భారత్ తరపున అత్యంత పిన్న వయస్సు (21ఏండ్లు) లో ఒలింపిక్ పతకం నెగ్గిన తొలి ప్లేయర్

8 ఓవరాల్‌గా ఒలింపిక్స్‌లో ఇప్పటి వరకు భారత్‌కు రెజ్లింగ్‌లో వచ్చిన పతకాలు. హాకీ (13) తర్వాత ఈ క్రీడలోనే అత్యధికం.

కాంస్య పోరులో మెరిసిన సెహ్రావత్..

అమన్ అద్భుతః

రెజ్లింగ్‌లో భారత్‌కు తొలి మెడల్ ● పారిస్‌లో 'ఆరు'కు చేరిన పతకాల సంఖ్య

ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో భారత మల్లయోధుల పతక హవా దిగ్విజయంగా కొనసాగుతున్నది. 1952లో కేడీ జాదవ్ చారిత్రక కాంస్యంతో మొదలైన రెజ్లింగ్ పతక ప్రస్థానం కొత్త పుంతలు తొక్కుతున్నది. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ పసిడి పతక ఆశలు ఆవిరైన వేళ తాను ఉన్నానంటూ యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ చిరుతలా దూసుకొచ్చాడు. జపాన్ రెజ్లర్ చేతిలో సెమీస్‌లో ఓడిన అమన్..కాంస్య పతక పోరులో బెబ్బులిలా విరుచుకుపడ్డాడు. పూర్టోరికో రెజ్లర్ క్రజ్ డెరియన్‌కు చుక్కలు చూపిస్తూ వరుస రౌండ్లలో అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఆదిలో నెమ్మదించినా..పట్టు బిగించిన తర్వాత ప్రత్యర్థిని మెలికలు తిప్పుతూ వరుస పాయింట్లు కొల్లగొట్టాడు. డెరియన్ పుంజుకునేందుకు ఏ మాత్రం అవకాశమివ్వని అమన్..అతి పిన్న వయసులో ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. తద్వారా పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఆరో పతకాన్ని అందించి ఔరా అనిపించాడు. అమన్ కాంస్య పతకంతో వరుసగా ఐదు ఒలింపిక్స్‌లో రెజ్లింగ్‌లో పతకాలు మనకు దాసోహమయ్యాయి.

పారిస్: భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ దేశానికి ఆరో పతకాన్ని అందించాడు. మహిళల విభాగంలో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ అసమాన పోరాటంతో స్వర్ణం లేదా రజతం ఖాయం చేసినా ఫైనల్ పోరుకు కొన్నిగంటల ముందు ఆమె నిర్దేశిత బరువు కంటే వంద గ్రాములు అధికంగా ఉందని 'అనర్హత వేటు' ఎదుర్కోవడంతో ఈ క్రీడలో పతకంపై ఆశలు అడుగంటిన వేళ అమన్ మాత్రం ఆ లోటును తన పతకంతో పూరించాడు. పురుషుల 57 కిలోల ఫ్రీ స్టయిల్ విభాగంలో బరిలోకి దిగిన అమన్ సెమీస్‌లో ఓడినా కాంస్య పోరులో మాత్రం అదరహో అనిపించాడు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అమన్ 13-5తో క్రజ్ డెరియన్ (పూర్టోరికో)ను ఓడించి కంచు మోత మోగించాడు. రెజ్లింగ్‌లో భారత్‌కు పారిస్‌లో ఇదే తొలి పతకం కాగా మొత్తంగా ఆరోవది. వినేశ్ పతకం విషయంలో నిరాశగా ఉన్న భారత క్రీడాభిమానులకు అమన్ కాంస్యం కాస్త స్వాంతన కలిగించేదే. అతడు తెచ్చింది కాంస్యమే అయినా ప్రస్తుత పరిస్థితులలో అది పసిడి కంటే ఎన్నో రెట్లు విలువైనది.

ప్రణాళికతో 'పట్టు'బట్టి..

సెమీస్‌లో జపాన్ రెజ్లర్ హిగూచి చేతిలో ఓడిన అమన్ కాంస్య పోరుకు మాత్రం పక్కా ప్రణాళికతో వచ్చాడు. ప్రత్యర్థిపై ఆది నుంచే ఎదురుదాడికి దిగాడు. అవతలి వైపు క్రజ్ కూడా దూకుడు చూపించడంతో పోరు కాస్తా హోరాహోరీ అయింది. తొలి బౌట్ ఆరంభమైన కొద్దిసేపటికే అమన్‌ను కిందకు పడగొట్టి తొలి పాయింట్ దక్కించుకున్న క్రజ్‌కు ఆ తర్వాత భారత రెజ్లర్ చుక్కలు చూపించాడు. క్రూజ్ కాళ్లను మెలేసి పదే పదే కింద పడగొడుతూ పాయింట్లు రాబట్టాడు. మొదటి రౌండ్ ముగిసేసరికి 6-3 ఆధిక్యంలో ఉన్న అతడు.. రెండో రౌండ్‌లో దూకుడును మరింత తీవ్రతరం చేశాడు. ముక్కుపై గాయమై రక్తపు చుక్కలు కారుతున్నా వెరవకుండా ఆటను కొనసాగించాడు. అమన్ 'పట్టు'కు తొలి బౌట్‌లో కాస్త ప్రతిఘటించిన పూర్టోరికో రెజ్లర్ కీలకమైన రెండో రౌండ్‌లో మాత్రం చేతులెత్తేశాడు. వీలు చిక్కినప్పుడల్లా అతడిని కిందపడేస్తూ పాయింట్లు రాబట్టడమే గాక ప్రత్యర్థిని ఊపిరాడనీయకుండా చేయడంలో అమన్ సఫలీకృతుడయ్యాడు.



5 2008 నుంచి 2024 దాకా వరుసగా ఐదు ఎడిషన్లలోనూ రెజ్లింగ్‌లో భారత్‌కు పతకాలు వచ్చాయి. సుశీల్ కుమార్ (2008, 2012), యోగేశ్వర్ దత్ (2012), సాక్షి మాలిక్ (2016), భజరంగ్ పునియా, రవి దహియా (2020) తర్వాత అమన్ నిలిచాడు.

ముగిసిన అథ్లెట్ల పోరాటం



పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్ల పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల, మహిళల 4X400 మీటర్ల రిలే ఫైనల్స్‌కు అర్హత సాధించడంలో భారత అథ్లెట్లు విఫలమయ్యారు. స్టేట్ డి ఫ్రాన్స్ వేదికగా జరిగిన రిలేలో మహ్మద్ అనాస్, మహ్మద్ అజ్మల్, అమోజ్ జాకబ్, రాజేశ్ రమేష్‌తో కూడిన పురుషుల బృందం రౌండ్ 1 రెండో హీట్‌ను 3:00.08 నిమిషాలలో పూర్తిచేసి నాలుగో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో ఉన్న ఇటలీ 3:00.26 నిమిషాలతో ఫైనల్స్‌కు దూసుకెళ్లడం గమనార్హం. మహిళల విభాగానికొస్తే తెలుగమ్మాయి జ్యోతిక శ్రీదండి, విధ్యా రామ్‌రాజ్, పూవమ్మ, సుభా వెంకటేషన్ బృందం 3:33.99 నిమిషాలలో పరుగును ముగించి అందరికంటే ఆఖరున 8వ స్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్ విభాగంలో భారత్ తరపున 29 మంది బరిలోకి దిగగా నీరజ్ చోప్రా ఒక్కడే పతకం సాధించాడు.

పతాకధారులుగా మను, శ్రీజేష్



ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో భారత మువ్వన్నెల పతకాన్ని చేతబూనే అవకాశం యువ షూటర్ మను భాకర్‌తో పాటు హాకీ దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్‌కు దక్కింది. ఈ ఎడిషన్‌లో మను రెండు పతకాలు గెలుచుకోగా కాంస్యం గెలిచిన హాకీ జట్టులో శ్రీజేష్ సభ్యుడు. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. కాగా శ్రీజేష్‌ను భారత జూనియర్ హాకీ జట్టుకు కోచ్‌గా నియమిస్తూ 'హాకీ ఇండియా' సంచలన నిర్ణయం తీసుకుంది.

ఈజిప్టు రెజ్లర్ అరెస్ట్

లైంగికదాడికి యత్నించినట్టు ఆరోపణ


పారిస్: ఈజిప్టు రెజ్లర్ మహమ్మద్ ఎల్‌సయ్యద్‌పై పారిస్‌లో లైంగికదాడి కేసు నమోదైంది. శుక్రవారం ఒలింపిక్ విలేజ్ నుంచి బయటకు వచ్చిన ఎల్‌సయ్యద్‌పై అక్కడికి సమీపంలోనే ఉన్న ఓ కేఫ్‌లో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు పోలీసులు తెలిపారు. దీంతో వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.



404 కిలోలు ఎత్తిపడేశాడు!

బల్గేరియా వెయిట్‌లిఫ్టర్ కార్లొస్ ప్రపంచ రికార్డు

పారిస్: బల్గేరియా వెయిట్ లిఫ్టర్ కార్లొస్ నాసర్ రికార్డు బరువు ఎత్తి పారిస్‌లో కొత్త చరిత్ర లిఖించాడు. 21 ఏండ్ల ఈ కుర్రాడు పురుషుల 89 కిలోల విభాగంలో ఏకంగా 404 కిలోల బరువును ఎత్తి ఒలింపిక్ రికార్డులతో పాటు ప్రపంచ రికార్డుల దుమ్ము దులిపాడు. స్నాచ్‌లో 180 కిలోలు ఎత్తిన కార్లొస్.. క్లీన్ అండ్ జర్క్‌లో రికార్డు స్థాయిలో 224 కిలోల బరువును ఎత్తేశాడు. క్లీన్ అండ్ జర్క్‌లో ఇప్పటి వరకూ ఇదే అత్యుత్తమం. కాగా గతేడాది బాత్‌రూమ్‌లో గోడ కూలి తీవ్ర గాయాల పాలై సర్జరీ చేయించుకున్న కార్లొస్.. ఏడాది కాలంలో పూర్తిగా కోలుకోవడమే గాక రికార్డు స్థాయిలో బరువును ఎత్తి పసిడి గెలుచుకోవడం విశేషం. ఇదే పోటీలో రజతం సాధించిన కొలంబియా అథ్లెట్ యీసన్ లోపెజ్ (390 కిలోలు) స్నాచ్‌లో 182 కిలోలతో వరల్డ్ రికార్డు నమోదు చేసుకున్నాడు. ఇటలీ ప్లేయర్ అంటానియో 383 కిలోలు ఎత్తి కాంస్యం గెలుచుకున్నాడు.



పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	32	25	21	78
2	యూఎస్ఏ	31	39	38	108
3	ఆస్ట్రేలియా	18	16	14	48
4	ఫ్రాన్స్	14	20	22	56
5	బ్రిటన్	14	20	22	56
6	జపాన్	14	8	13	35
66	భారత్	0	1	5	6

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

కులగణన చేపట్టాలి.. లేదంటే గద్దె దిగాలి

- ఢిల్లీ మహాధర్నాలో బీసీ నేత జాజుల డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): కులగణన చేపట్టాలి, లేదంటే గద్దె దిగిపోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణనతో పాటు బీసీల డిమాండ్ల సాధనకు ఢిల్లీలో శుక్రవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రధాని మోదీ బీసీ బిడ్డగా ఆలోచించి బీసీ కులగణన చేపట్టి బీసీల మన్ననలు పొందాలని కోరారు. వర్గీకరణ తరహాలోనే కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే దేశవ్యాప్తంగా మరో మహా మండల్ ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే కాంగ్రెస్‌ను బీసీలు ఎప్పటికీ నమ్మబోరని తెలిపారు. మహాధర్నాలో ఎంపీ మల్లు రవి, వివిధ రాష్ర్టాల బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్


కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

- అధికారంలోకి రాగానే కులగణన ఏమైంది?
- కాంగ్రెస్ నేతల భిన్నాభిప్రాయంపై బీసీ నేతల నిలదీత

ఖైరతాబాద్, ఆగస్టు 9: కులగణనపై కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ఓమాట, గల్లీలో ఓమాట మాట్లాడుతూ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని బీసీ నేతలు అభిప్రాయపడ్డారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నాయకులు.. తమ పార్టీ అధికారంలోకి రాగానే కులగణన చేపడుతామని, 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే కులగణన ఏమైందని నిలదీశారు. ఓ వైపు ఢిల్లీలో రాహుల్‌గాంధీ కులగణన చేయాలని, రిజర్వేషన్లు పెంచాలని నినదిస్తుంటే, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ మాటలకు తెలంగాణ ప్రభుత్వం విలువ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. బీసీ జన సభ అధ్యక్షుడు రాజారాంయాదవ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బీసీలకు న్యాయం జరగాలంటే పోరాటమే ఏకైక మార్గమని స్పష్టంచేశారు. కులగణన, బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నేడు ఇందిపార్కు వద్ద బీసీల సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామని, బీసీలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రొఫెసర్ తిరుమలి, బత్తుల సిద్దేశ్వర్లు, ప్రభంజన్ యాదవ్, సాంబశివగౌడ్, కట్టెకోల శ్రీహరిముదిరాజ్, అశోక్, మాధవి, శ్రీహరిముదిరాజ్, సురేశ్‌ముదిరాజ్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కులగణన చేయకపోతే అంతర్యుద్ధం తప్పదు

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



హైదరాబాద్, ఆగస్టు9 (నమస్తే తెలంగాణ) : దేశంలో పేద, ధనిక వర్గాల మధ్య ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని, వాటి నివారణకు కులగణన ఒక్కటే మార్గమని, లేకుంటే దేశంలో అంతర్యుద్ధం వాటిల్లక తప్పదని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ హెచ్చరించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం సంపన్నవర్గాల ప్రయోజనం కోసమే పని చేస్తున్నదని దుయ్యబట్టారు. దేశంలోని 271మంది బిలియనీర్లలో 94మంది 2023లోనే కొత్త బిలియనీర్లుగా మారారని, వారిలో ఒక్క బీసీ, ఎస్సీ, ఎస్టీ లేడని, దేశంలో ఆర్థిక అంతరాలకు ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాభీష్టాన్ని విస్మరిస్తే రాజకీయ పార్టీలకు మనుగడ ఉండదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి నేత మారేపల్లి లక్ష్మణ్, సీనియర్ జర్నలిస్టు దుర్గం శ్రీనివాస్, యువ నాయకులు కావలి రాజు, మల్లేశ్, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

13న మాదిగ అమరవీరులకు నివాళి

ముషీరాబాద్, ఆగస్టు 9: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన మాదిగ అమరవీరులకు వర్గీకరణ విజయాన్ని అంకితం చేస్తూ ఈ 13న నివాళి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరుల త్యాగాలవల్లనే వర్గీకరణ ఉద్యమం పతాక స్థాయికి చేరుకుందని, రేపు వర్గీకరణ ఫలితాలు అనుభవించనున్న ప్రతి కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ అంబేద్కర్, అమరవీరుల విగ్రహాలు, చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండారు శ్రీనివాస్, చాప కృష్ణ, వేణు, యాకన్న, రాజేశ్, కొల్లూరి వెంకట్, రాజేందర్ పాల్గొన్నారు.

నర్సాపూర్-బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): నర్సాపూర్-బెంగళూరు , సికింద్రాబాద్-రామాంతపురం రైల్వే స్టేషన్ల మధ్య రెండేసి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 28 వరకు ఈ రైళ్లు రాకపోకలను సాగిస్తాయని పేర్కొన్నారు. బెంగళూరు-కలబుర్గి స్టేషన్ల మధ్య ఆరు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

చిరుధాన్యాలతో జీవనసిరి

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ముచ్చింతల్‌లో 24, 25, 26 తేదీల్లో చిరుధాన్యాలతో జీవనసిరి అనే అంశంపై డాక్టర్ ఖాదర్‌వలీ, సరళాఖాదర్ అవగాహన కల్పిస్తున్నట్టు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందులో పాల్గొనేవారు 9705383666, 7093973999 ఫోన్ నంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

బంగ్లాదేశ్ పరిణామాలు మోదీకి గుణపాఠం కావాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ



హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): బంగ్లాదేశ్ పరిణామాలు భారత ప్రధాని మోదీకి గుణపాఠం కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉందని కామెంట్ చేశారు. ముస్లిం మైనార్టీలు, వారికి సంబంధించిన హక్కులను కాలరాసేందుకు ఎన్డీఏ సర్కార్ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. బిల్లుపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని స్పష్టంచేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చింది అప్పు మాత్రమే అని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో ఏపీ మాజీ సీఎం జగన్ చేపట్టిన ధర్నా అట్టర్‌ఫ్లాప్ అయిందని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన రెండు నెలల్లోనే రాష్ట్రపతి పాలన కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఓటింగ్‌ను తప్పనిసరి చేసే ప్రతిపాదన లేదు

లోక్ సభకు తెలిపిన కేంద్రం



న్యూఢిల్లీ: ఎన్నికల్లో ఓటు వేయడాన్ని తప్పనిసరి చేసే ప్రతిపాదన లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ శుక్రవారం తెలిపారు. ప్రజలకు ఉచిత తాయిలాల పంపిణీపై రాజకీయ పార్టీలు ఇచ్చే ఎన్నికల హామీలను కట్టడి చేసే ఆలోచన లేదని చెప్పారు. లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు ఆయన వేర్వేరుగా ఇచ్చిన లిఖితపూర్వక సమాధానాల్లో ఈ వివరాలను వెల్లడించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 65.79 శాతం ఓట్లు నమోదైనట్లు తెలిపారు. అస్సాంలో అత్యధికంగా, బీహార్‌లో అత్యల్పంగా ఓట్లు పోలయ్యాయని చెప్పారు.

రష్యాలోకి ఉక్రెయిన్ బలగాలు

- కుర్స్క్‌లో 30 కిలోమీటర్లు చొచ్చుకెళ్లిన దళాలు
- ఆర్టిలరీ, డ్రోన్లతో దాడులు.. రష్యా అప్రమత్తం
- ఎమర్జెన్సీ ప్రకటించిన పుతిన్ సర్కారు
- సురక్షిత ప్రాంతాలకు 3 వేల మంది తరలింపు
- కీవ్ దళాలను అడ్డుకునేందుకు భారీగా బలగాల మోహరింపు



ఈ నెల 7న ఉక్రెయిన్ దాడిలో తగలబడుతున్న కుర్స్క్‌లోని ఓ భవనం

కీవ్/మాస్కో, ఆగస్టు 9: గత రెండేండ్లకు పైగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో సీన్ రివర్స్ అయింది. మొదట సైనిక చర్య పేరుతో రష్యా సైన్యం ఉక్రెయిన్ భూభాగంలోకి చొరబడి, విధ్వంసం సృష్టించగా.. ఇప్పుడు ఉక్రెయిన్ బలగాలు రష్యా భూభాగంలోకి 30 కిలోమీటర్ల మేర వెళ్లిపోవడం కీలకంగా మారింది. శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లడమే కాకుండా ఆర్టిలరీ, డ్రోన్ దాడులను కూడా ఉక్రెయిన్ దళాలు చేపట్టాయి. రష్యా భూభాగంలోకి వెళ్లిన ఉక్రెయిన్ బలగాల సంఖ్య వెయ్యికి పైగా ఉండే అవకాశం ఉన్నదనే ప్రచారం జరుగుతున్నది. వీరంతా ఈశాన్య ఉక్రెయిన్‌లోని సుమీ ఒబ్లాస్ట్ రీజియన్ నుంచి వెళ్లి, రష్యాలోని కుర్స్క్ ఒబ్లాస్ట్‌ను తమ అధీనంలోకి తీసుకొన్నట్టు తెలుస్తున్నది. తాజా పరిణామాల నేపథ్యంలో కుర్స్క్ రీజియన్‌లో రష్యా ఫెడరల్ స్థాయి ఎమర్జెన్సీని విధించింది. ఉక్రెయిన్ బలగాలను మరింత ముందుకు వెళ్లనీయకుండా అక్కడకు పెద్దయెత్తున సైనికుల మోహరింపు చేపట్టింది. సరిహద్దు నుంచి 10 కిలోమీటర్ల దూరంలోని సుడ్జా పశ్చిమ శివార్లలో రెండు దేశాల మధ్య సైనికుల మధ్య యుద్ధం జరుగుతున్నదని రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. కుర్స్క్ నుంచి 3 వేల మందికి వరకు ఇతర ప్రాంతాలకు తరలించినట్టు గవర్నర్ అలెక్సీ స్మిర్నోవ్ తెలిపారు. తమ ప్రాంతాన్ని కాపాడుకొనేందుకు రాకెట్ లాంచర్లు, ఆర్టిలరీ, ట్యాంకులు, హెవీ ట్రక్కులు వంటి ఆయుధాలను పంపిస్తున్నట్టు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఉక్రెయిన్ లక్ష్యంపై అస్పష్టత

ఉక్రెయిన్ చేపట్టిన ఈ ఆపరేషన్‌కు సంబంధించిన ఉద్దేశంపై అస్పష్టత నెలకొన్నది. అయితే యుద్ధం ప్రారంభమైన 2022, ఫిబ్రవరి నాటి నుంచి ఉక్రెయిన్ తాజాగా చేపట్టిన ఈ ఆపరేషన్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు పెద్ద సవాల్‌గా మారిందనే విశ్లేషణలు వస్తున్నాయి. అయితే తాజా పరిణామంపై ఉక్రెయిన్ నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. అయితే దీని ద్వారా యుద్ధం నెమ్మదిగా రష్యా భూభాగంలోకి ప్రవేశించిందని ఆ దేశం గ్రహిస్తుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సలహాదారు మైహైలో పేర్కొన్నారు. ఉక్రెయిన్ ఏమీ చెప్పనప్పటికీ, దానికి ఒక స్పష్టమైన లక్ష్యం ఉన్నట్టు కనిపిస్తున్నదని రక్షణ విశ్లేషకులు మథ్యూ బౌలేగ్ అభిప్రాయపడ్డారు. యుద్ధ ట్యాంకులు, సాయుధ వాహనాలతో ఉక్రెయిన్ బలగాలు రష్యా భూభాగంలోకి 35 కిలోమీటర్ల వరకు వెళ్లాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టడీ ఆఫ్ వార్(ఐఎస్‌డబ్ల్యూ) అనే సంస్థ పేర్కొన్నది.

రష్యా సైన్యంలో 69 మంది భారతీయులు


రష్యా ఆర్మీలో పనిచేస్తున్న 69 మంది భారతీయుల విడుదల కోసం ఎదురుచూస్తున్నామని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. వారిలో చాలామంది భారత్‌లోని కొందరు ఏజెంట్లు, మాయగాళ్ల మాటలను నమ్మి అక్కడకు వెళ్లి ఆర్మీలో చిక్కుకుపోయారని ఆయన చెప్పారు. మోసపు మాటలను నమ్మి రష్యా ఆర్మీలో చేరిన మన దేశ పౌరులను విడిచిపెట్టకపోతే ఆ దేశం నుంచి చవక చమురు కొనుగోలును భారత్ నిలిపివేస్తుందా? అని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అలా వారిని మోసగించి రష్యాకు పంపిన 19 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. మొత్తం 91 మంది భారతీయులు రష్యా ఆర్మీలో నియమితులయ్యారని, వారిలో ఎనిమిది మంది మరణించగా, 14 మంది ప్రభుత్వ సహకారంతో వెనక్కి వచ్చారని, మిగిలిన 69 మంది పౌరులను రప్పించడానికి కేంద్రం కృషి చేస్తున్నదని చెప్పారు.

మాల్‌పై రష్యా దాడి.. 11 మంది మృతి

మరోవైపు తాజా పరిణామాల నేపథ్యంలో తూర్పు ఉక్రెయిన్‌లోని కొస్టియాంటినివ్కాలో ఓ మాల్‌పై రష్యా క్షిపణి దాడి చేసింది. ఈ ఘటనలో 11 మంది చనిపోగా, 44 మందికి గాయాలయ్యాయని స్థానిక అధికారులు వెల్లడించారు. రద్దీ ప్రాంతంపై రష్యా మరోసారి దాడికి పాల్పడిందని డొనెట్స్క్ రీజనల్ హెడ్ ఫిలాస్కిన్ అన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఇదే పట్టణంలోని మార్కెట్‌పై రష్యా జరిపిన దాడిలో 17 మంది మరణించారు.

టెల్ అవీవ్‌కు విమాన సర్వీసులు నిలిపివేత

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో టెల్ అవీవ్‌కు విమాన సేవలను నిరవధికంగా నిలిపివేసినట్లు ఎయిరిండియా తెలిపింది. తదుపరి నోటీసు వరకు న్యూఢిల్లీ-టెల్ అవీవ్ మధ్య విమానాలను నడపమని చెప్పింది.



ఆఫ్రికన్ దేశాలను వణికిస్తున్న మంకీపాక్స్

- 15 వేల మందికి సోకిన వ్యాధి

న్యూఢిల్లీ: ఆఫ్రికా దేశాలను మంకీపాక్స్ వ్యాధి వణికిస్తున్నది. ఇప్పటివరకు 15 ఆఫ్రికా దేశాలకు వ్యాపించిన ఈ వ్యాధి కారణంగా 500 మంది మరణించగా, 15 వేల మంది దీని బారిన పడ్డారు. దీంతో అప్రమత్తమైన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) వ్యాధి తీవ్రత ప్రజా ఆరోగ్య అత్యవసర స్థితికి దారితీస్తుందో లేదో నిర్ణయించడానికి అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. గతంలో ఈ వ్యాధి జాడలు లేని కెన్యా, ఉగాండా, రువాండా, బురుండి దేశాలు కూడా ఈసారి ఈ వ్యాధి బారిన పడ్డాయి. వేగంగా ఈ వ్యాధి వ్యాప్తి చెందడంపై డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రాస్ అథనామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధి జంతువులతో ప్రత్యక్ష సంబంధాల ద్వారా వ్యాపిస్తుంది. ఉడుతలు వంటి చిన్న ప్రాణుల ద్వారా కూడా ఇది సోకుతుందని నిపుణులు తెలిపారు. అయితే కొత్త వేరియంట్ మానవుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందని చెప్పారు.

ఇరాక్‌లో బాలికల కనీస వివాహ వయసు 9కి తగ్గింపు!

పార్లమెంట్‌లో ప్రభుత్వం బిల్లు

బాగ్దాద్, ఆగస్టు 9: బాలికల కనీస వివాహ వయసును 18 నుంచి 9 ఏండ్లకు తగ్గిస్తూ ఇరాక్ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టింది. ఈ ముసాయిదా బిల్లు ప్రకారం బాలుర వివాహ వయసును 15కు తగ్గించారు. ఇరాక్ ప్రవేశపెట్టిన ఈ కొత్త బిల్లు దేశాన్ని తిరోగమనంలోకి నెట్టేస్తుందని హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్ఆర్ డబ్ల్యూ) పరిశోధకుడు సారా శాన్‌బార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లు పౌరుల ప్రాథమిక హక్కులను దెబ్బ తీస్తుందని తెలిపారు. ఇరాక్‌లో పెద్ద ఎత్తున బాల్య వివాహాలు జరుగుతున్నాయని మొదటి నుంచి ఆరోపణలున్నాయి. యునిసెఫ్ నివేదిక ప్రకారం ప్రస్తుతం 20 నుంచి 24 ఏండ్ల మధ్య ఉన్న వారిలో 28 శాతం మందికి 18 ఏండ్లకు ముందే వివాహం అయ్యింది. అలాగే ఏడు శాతం మందికి 15వ ఏడు వచ్చిన వెంటనే పెండ్లి జరిపించారు.

సీఏఏకు ఈ పత్రాలు సమర్పించండి

- కేంద్ర హోం శాఖ స్పష్టత

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కింద భారత పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునే వారి నిబంధనల పరిధిని కేంద్రం విస్తరించింది. అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌కు చెందిన పీడిత మైనారిటీ వర్గానికి చెందిన వారు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేందుకు సమర్పించాల్సిన డాక్యుమెంట్ల గురించి స్పష్టతనిచ్చింది. దరఖాస్తుదారుల తల్లిదండ్రులు, తాతలు, ముత్తాతలు పై మూడు దేశాలకు చెందిన ఒక దానిలో పౌరులుగా ఉన్నారని రుజువు చేస్తూ మన దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, లేదా పాక్షిక న్యాయవ్యవస్థ జారీ చేసే ఏదైనా పత్రాన్ని ఆమోదిస్తామని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. సీఏఏ, 2019కు సంబంధించి పలు సందేహాలు రావడంతో కేంద్ర హోం శాఖ దీనిపై వివరణ ఇచ్చింది. దరఖాస్తుదారుల తల్లిదండ్రులు, తాతలు, ముత్తాతలు పై మూడు దేశాలకు చెందిన వారంటూ రుజువుచేస్తే చాలని గతంలో ఉండగా, తాజాగా దీనిపై ఇచ్చిన వివరణ ప్రకారం సదరు పత్రాలు దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పాక్షిక న్యాయవ్యవస్థలు జారీ చేసి ఉండాలని స్పష్టం చేసింది.

వయనాడ్‌లో వింత శబ్దాలు

- భయాందోళనలో ప్రజలు

వయనాడ్: కొండచరియలు విరిగిపడి ఘోర విపత్తును ఎదుర్కొంటున్న వయనాడ్‌వాసులను భూమిలో నుంచి వినిపించిన వింత శబ్దాలు భయాందోళనలకు గురి చేశాయి. వైతిరి తాలుకాలోని అంబలవయల్ గ్రామంలో శుక్రవారం భూమి నుంచి భారీ శబ్దాలు వినిపించాయి. దీంతో ప్రజలకు ఏం జరుగుతోందో అర్థం కాక ఆందోళనకు గురయ్యారు. ముందుజాగ్రత్త చర్యగా ఈ ప్రాంతంలోని ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు వయనాడ్ జిల్లా కలెక్టర్ డీఆర్ మేఘశ్రీ తెలిపారు. ఇప్పటివరకు భూమిలో కదలికలు జరిగినట్టు ఎలాంటి సూచనలు లేవని కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది.

బ్రెజిల్‌లో కుప్పకూలిన విమానం

- 62 మంది ప్రయాణికుల మృతి



బ్రెసిలియా: బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకొన్నది. 62 మందితో వెళ్తున్న ఓ విమానం శుక్రవారం విన్హెడో పట్టణంలో కూలిందని స్థానిక టీవీ స్టేషన్ గ్లోబో న్యూస్ వెల్లడించింది. విమానంలోని ప్రయాణికులందరూ మృతిచెందినట్టు స్థానిక అధికారులు వెల్లడించారు. వోపాస్ లిన్హాస్ ఏరియాస్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం పరన రాష్ట్రంలోని కాస్కవెల్ నుంచి సావో పాలోలోని గువారుల్హోస్ వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని వెబ్‌సైట్ జీ1 పేర్కొన్నది. విన్హెడోలో విమానం కూలిన విషయాన్ని సావో పాలో రాష్ట్ర అగ్నిమాపక విభాగం ధ్రువీకరించింది. ఘటనాస్థలికి బృందాలను పంపినట్టు తెలిపింది. విమాన ప్రమాదానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో పోస్టు అయింది. విమానం చెట్లలోకి పడిపోవడం, పెద్దయెత్తున నల్లటి పొగ ఆవరించడం కనిపించింది.

నీటివనరులను సమర్థంగా వినియోగించుకోవాలి

- రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలి
- 'ఇండియా వాటర్ వీక్' సన్నాహక భేటీలో ఎన్‌డబ్ల్యూడీఏ చైర్మన్ భూపాల్ సింగ్

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): నీటి వనరులను సంరక్షించుకోవడంతోపాటు వాటిని సమర్థంగా వినియోగించుకోవాలని, అందుకు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అవసరమని జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) చైర్మన్ భూపాల్ సింగ్ స్పష్టం చేశారు. నీటివనరుల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు కేంద్ర జలశక్తి శాఖ ఏటా 'ఇండియా వాటర్ వీక్' (ఐడబ్ల్యూడబ్ల్యూ) పేరుతో వారోత్సవాలను నిర్వహిస్తున్నది. అందులో భాగంగా ఈ ఏడాది 'నీటి అభివృద్ధి- నిర్వహణలో సమిష్టి భాగస్వామ్యం-సహకారం' అనే థీమ్‌తో వచ్చే నెల 17-29 వరకు ఢిల్లీలో నిర్వహించతలపెట్టిన 8వ వారోత్సవాలకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్ ముఖేశ్ కుమార్ సిన్హా చేతులమీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భూపాల్ సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయంతో నీటిసమస్యలను పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నదుల అనుసంధాన ప్రాజెక్టులను ఉదాహరించారు. కార్యక్రమంలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చైర్మన్, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అతుల్ జైన్, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అనిల్ కుమార్, సీఈ మోహన్ కుమార్, ఈఈ సుబ్రహ్మణ్య ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ దేవేందర్‌రావు, ఎన్‌డబ్ల్యూడీఏ డీడీ లలిత, వివిధ రాష్ట్రాల అధికారులు, కేంద్ర ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆగస్టు 20 నుంచి ఓటరు జాబితా సవరణ

అక్టోబర్ 29 నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈనెల 20వ తేదీ నుంచి ఓటరు జాబితా సవరణ ప్రారంభమై జనవరి 6న తుది జాబితా ప్రకటనతో ముగియనుంది. ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు ఓటరు జాబితా సవరణలో భాగంగా బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో)లు ఇంటింటికీ తిరిగి పేర్లను పరిశీలిస్తారు. అవసరమైతే పోలింగ్ స్టేషన్ల సర్దుబాటు, మార్పులు చేస్తారు. అధికారుల పరంగా చేయాల్సిన బాధ్యతలన్నింటినీ అక్టోబరు 28 కల్లా పూర్తి చేయనున్నారు. ముసాయిదా ఓటరు జాబితాను అక్టోబర్ 29న ప్రచురిస్తారు. అక్టోబరు 29 నుంచి నవంబర్ 28 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. డిసెంబర్ 24లోగా దరఖాస్తులను పరిశీలిస్తారు. తుది ఓటరు జాబితాను 2025 జనవరి 6న ప్రచురిస్తారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఓటు హక్కు కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. కొత్త ఓటు, చిరునామా మార్చుకోవడం, చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఓటరు వివరాలు సవరించుకోవడానికి అవకాశాన్ని కల్పించారు.

జేపీసీలో ఇద్దరు తెలంగాణ ఎంపీలు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): వక్ఫ్ బోర్డు అధికారాల సవరణకు సంబంధించిన బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంట్ కమిటీ (జేపీసీ)లో ఇద్దరు తెలంగాణ ఎంపీలకు చోటు దక్కింది. మొత్తం 21 మందితో కమిటీని ఏర్పాటు చేస్తూ లోక్‌సభ కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో తెలంగాణ నుంచి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి చోటు దక్కింది.

శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. గురువారం స్వామివారిని 63,535 మంది భక్తులు దర్శించుకోగా..వారిలో 28,685 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3. 81 కోట్లు వచ్చిందని తెలిపారు. ఈ నెల 10న తిరుమలలో అంగ ప్రదక్షిణ కోసం(శనివారం) మధ్యాహ్నం10 గంటలకు ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తున్నామని వెల్లడించారు. 250 అంగ ప్రదక్షిణ టోకెన్లను విడుదల చేస్తున్నామని వివరించారు.

13 వరకు దోస్త్ రిపోర్టింగ్ గడువు

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువును అధికారులు 13 వరకు పొడగించారు. దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్స్ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారు 13 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని సూచించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళల కోసం జాబ్ ఫెయిర్

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించిన జాబ్ ఫెయిర్‌లో 300 మందికిపైగా ఉద్యోగాలు పొందారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐకియా, రిలయన్స్, నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్, మెడ్‌ప్లస్, టాటా మోటార్స్, మ్యాక్స్, గోపిజ్జా, కేఎస్ బేకర్స్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. తెలంగాణ డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్, వీహబ్ సంయుక్తంగా జూబ్లీహిల్స్‌లోని బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించాయి. 4వేల మంది మహిళలు హాజరయ్యారు.

రేవంత్ తమ్ముడిపై అరెస్టు వారెంట్?

న్యూజెర్సీ సుపీరియర్ కోర్టు జారీ

58,500 డాలర్లు అప్పు తీసుకొని తిరిగి ఇవ్వలేదని బాధితుడు డేవిడ్ ఆరోపణ



ఎనుముల కొండల్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ్ముడు ఎనుముల కొండల్‌రెడ్డిపై అమెరికా కోర్టు వారెంట్ జారీ చేసినట్టు తెలిసింది. కొండల్‌రెడ్డి దంపతులు ప్రవాస భారతీయుడి నుంచి అప్పు తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో, సదరు ఎన్నారై కోర్టును ఆశ్రయించగా, కొండల్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదైనట్టు సమాచారం. ఇదంతా నిజమేనని బాధితుడు డేవిడ్ ఒక యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. వివరాలు బాధితుడి మాటల్లోనే.. '1972లో అమెరికాకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డాను. నా మేనల్లుడు రఘోత్తంకు ఎరుపుల కన్సల్టింగ్ సంస్థ ద్వారా కొండల్‌రెడ్డి పరిచయమయ్యారు. రఘోత్తం, కొండల్‌రెడ్డి కలిసి కొంత కాలం కన్సల్టింగ్ సంస్థను నడిపారు. మనస్పర్థలు, వివాదాల కారణంగా విడిపోయారు. సొంతంగా బిజినెస్ పెడతామంటూ కొండల్‌రెడ్డి దంపతులు డబ్బుల కోసం నన్ను సంప్రదించారు. వారిపై సానుభూతితో 58,500 అమెరికా డాలర్లు ఇచ్చాను. వారిచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయి. దాంతో ఆధారాలతోసహా న్యూజెర్సీ సుపీరియర్ కోర్టులో కొండల్‌రెడ్డిపై క్రిమినల్ కేసు ఫైల్ చేశాను. విచారణ జరిపిన కోర్టు కొండల్‌రెడ్డికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. అరెస్టు వారెంట్ కూడా జారీచేసింది. కొండల్‌రెడ్డి అమెరికాను విడిచి వెళ్లడంతో నాటినుంచి ఆయన ఆచూకీ కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఒకవేళ కొండల్‌రెడ్డి అమెరికాకు వస్తే నేర చరిత్ర ఆధారంగా పోలీసులు అతడిని అరెస్టు చేస్తారు' అని పేర్కొన్నారు. కొండల్‌రెడ్డి తన దగ్గర అప్పు తీసుకున్నట్టు ఉన్న చెక్స్, ప్రామిసరి నోటు, కోర్టు తీర్పులు, ఇతర ఆధారాలు ఇవేనంటూ అంటూ వాటిని మీడియా చూపించారు.

హైదరాబాద్‌లో గ్రీన్ డాటా సెంటర్

రూ.3,350 కోట్ల పెట్టుబడి పెట్టనున్న ఆరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అమెరికాలో విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఇప్పటికే 11 కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెంట్టేందుకు ముందుకొచ్చాయి. తాజాగా హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత గ్రీన్ డాటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఆరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్ సంస్థ ప్రకటించింది. ఇందుకోసం దశలవారీగా 400 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.3,350 కోట్ల) పెట్టుబడి పెట్టనున్నట్టు వెల్లడించింది. ఈ సంస్థ చైర్మన్ వెంకట్ బుస్సా శుక్రవారం అమెరికాలో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమై తమ విస్తరణ ప్రణాళికలను వివరించారు. హైదరాబాద్‌లో నెలకొల్పే డాటా సెంటర్‌తో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ సేవల్లో అంతరం తగ్గడంతోపాటు ఈ-సేవ, ఈ-పేమెంట్, ఈ-ఎడ్యుకేషన్ వంటి ప్రభుత్వ సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

హైకోర్టులో 101 మంది ఏజీపీల నియామకం

హైదరాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ) : హైకోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లను పెద్ద సంఖ్యలో నియమిస్తూ ఏజీ ఏ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో గవర్నమెంట్ ప్లీడర్‌కు ఇద్దరు చొప్పున, ముఖ్యమైన శాఖలు నిర్వహించే గవర్నమెంట్ ప్లీడర్లకు ముగ్గురు, నలుగురు ఏజీపీలను అటాచ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.